www.velthuru.com
VELTHURU TELUGU DAILY
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
# వెలుతురు
తెలుగు దినపత్రిక
ఆదివారం 22 డిసెంబర్ 2024
సంపుటి :06 సంచిక : 204 , పేజీలు : 12 వెల:రూ.5/-
TELANGANA, ANDHRA PRADESH

## కువైట్ ఓ మినీ ఇండియా

- ప్రవాస భారతీయుల సమావేశంలో ప్రధాని మోడీ




2 లో..

**కువైట్,డిసెంబర్21(వెలుతురు):** పశ్చిమాసియా దేశమైన కువైట్ లో ఇంత మంది భారతీయులను చూడటం చాలా ఆనందంగా ఉందని, ఇదో




## మళ్లీ జీఎస్టీ బాదుడు..




- యూజ్డ్ కార్లపై జీఎస్టీ పెంపు!
- పాత కార్ల అమ్మకాలపై 18శాతం జీఎస్టీ బాదుడు
- పాప్‌కార్న్‌పై కొత్త పన్ను రేట్లు..!
- 1,500 వరకు ఉన్న దుస్తులపై 5% జీఎస్టీ
- 1,500 నుండి రూ.10,000 వరకు వస్త్రాలపై 18% జీఎస్టీ
- 10,000 కంటే ఎక్కువ విలువైన బట్టలపై 28% జీఎస్టీ
- షూస్, వాచీలపై పన్ను రేటు 28%కి పెంచాలని సిఫార్సు
- ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ పై 5%కి జీఎస్టీ తగ్గించే యోచన
- సైకిళ్లు, క్యాన్సర్ ఔషధాలపై జీఎస్టీ 5%కి తగ్గించాలని సిఫార్సు
- ఈ ప్రొడక్ట్స్ పై పన్నుల్లో మార్పులు
- 148 పదార్థాలపై ప్రతిపాదిత మార్పులు
- పలు వస్తువులపై పెరగనున్న జీఎస్టీ
- బడ్జెట్‌పై కేంద్రం కసరత్తు..
- 2025-26 సంవత్సరానికి బడ్జెట్ రూపకల్పన
- రాజస్థాన్‌లో నిర్మలా సీతారామన్ అధ్యక్షతన సమావేశం

2 లో

**న్యూఢిల్లీ,డిసెంబర్ 21(వెలుతురు):** రాజస్థాన్ లోని జైసల్మేర్ లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన 55వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో బీమా ఉత్పత్తులకు జీఎస్టీ కి సంబంధించిన నిర్ణయంపై చర్చను వాయిదా వేశారు. అనంతరం పన్నుల ఫ్రేమ్ వర్క్ కు పలు అప్ డేట్స్ ను ప్రవేశపెట్టారు. 55వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో వివిధ రంగాలలో పన్ను రేట్లను సర్దుబాటు చేశారు. యూజ్డ్ కార్లు, ఎలక్ట్రిక్ వాహనాలపై చిన్న పెట్రోల్/డీజిల్ వాహనాలు, ఎలక్ట్రిక్ వాహనాలతో సహా పాత, ఉపయోగించిన కార్ల అమ్మకాలపై జీఎస్టీని 12 శాతం నుంచి 18 శాతానికి పెంచడానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది ఉప్పు, మసాలాలతో కూడిన పాప్ కార్న్ (అన్ ప్యాకేజ్డ్ అయితే) 5% జీఎస్టీని, ప్రీ-ప్యాకేజ్డ్ పాప్ కార్న్ పై 12% జీఎస్టీ, క్యారమెల్-కోటెడ్ పాప్ కార్న్ పై 18% పన్ను విధించాలని నిర్ణయించారు. ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్ తుది వినియోగంతో

## ఆర్థిక విధ్వంసంతో అభివృద్ధికి పాతర

- పదేళ్ల పాలనలో వెయ్యేళ్ల సంపాదన,
- అప్పులతో రాష్ట్రాన్ని దివాళా తీయించిన కెసిఆర్,
- అబద్ధాలతో ప్రజలను మోసం చేసిన కుటుంబం,
- కాళేశ్వరం పేరుతో కూలేశ్వరం కట్టారు,
- రైతుభరోసాపై చర్చలో బిఆర్ఎస్‌ను కడిగేసిన రేవంత్ రెడ్డి



- రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం
- అర్హులైన భూమి ఉన్న వారికే రైతుభరోసా
- సంక్రాంతి తరవాత రైతుభరోసా అమలు చేస్తాం
- గతంలోల ఆగా రాళ్లూ రప్పలకు, రోడ్లకు ఇవ్వలేం

**బిఆర్ఎస్ హయాంలో 22,600కోట్లు అనర్హులకు చెల్లింపు**

- తెలంగాణ అభివృద్ధికి బిఆర్ఎస్ మోకాలడ్డు
- కొడంగల్‌ను అభివృద్ధి చేయడం తప్పా
- విద్యవైద్య సౌకర్యాలు వారికి వద్దా
- బిఆర్ఎస్ తీరుపై నిప్పులు చెరిగిన సిఎం రేవంత్




- పుష్పా-2 ఘటన ఎంతో కలిచివేసింది...
- కనీసం మానవత్వం చూపని సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు
- సమాజం ఎటువైపు పోతుంది..
- హీరోలంటే.. తెరపైన కాదు.. నిజజీవితంలో చూపాలి
- హీరోలను అరెస్టు చేయకుండా ఏమైనా చట్టాలు ఉన్నాయా..?
- ఉంటే చెప్పండి.. అలా నడుచుకుంటాం :
- తల్లి చనిపోయి.. కుమారుడు ఆస్పత్రిలో ఉంటే కనీసం ఒక్కరూ చూడలేదు
- అసెంబ్లీలో భావోద్వేగానికి గురైన సీఎం రేవంత్‌రెడ్డి

2 లో..

**హైదరాబాద్,డిసెంబర్21(వెలుతురు):** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు హాట్ హాట్‌గా కొనసాగుతున్నాయి. రైతుబంధుపై చర్చ సందర్భంగా సిఎం రేవంత్ సహా, మంత్రులు, ఎమ్మెల్యేలు విపక్ష బిఆర్ఎస్ లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. పదేళ్ల పాలనతో బిఆర్ఎస్ తెలంగాణను భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. తెలంగాణలో ఆర్థిక విధ్వంసం సృష్టించి,అభివృద్ధిని అడ్డుకున్న బిఆర్ఎస్ పదేళ్ల పాలనపై సిఎం రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. ఎందరో బలిదానాలతో ఇచ్చిన తెలంగాణను అప్పులకుప్పగా మార్చారని అన్నారు. ఇప్పటికీ అభివృద్ధిని అడ్డుకుంటూ కాళ్లల్లో కట్టెలు పెడుతున్నారని, వీరిని ఎలా ఆదర్శంగా తీసుకుని పాలించగలమని ప్రశ్నించారు. అప్పుల కారణంగా వడ్డీలకే సంపాదన సరిపోతోందని లెక్కలతో సహా వివరించారు. గత ఆర్థిక మంత్రి తప్పుడు లెక్కలతో ఆర్‌బిఐని కూడా మోసం చేశారని అన్నారు. అలాగే రైతుబంధు పేరుతో రాళ్లూ రప్పలు, ప్లాట్లు, రోడ్లకు నిధులు ఇచ్చారని అంటూ..ఇప్పుడూ అలాగే చేయాలనడం దుర్మార్గమని అన్నారు. రైతులను ఆదుకునేందుకు తాము కట్టుబడి ఉన్నామని అన్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ పై సీఎం రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. ఆరు గ్యారంటీలు అమలు చేయకపోవడానికి కారణం.. బీఆర్ఎస్సేనని మండిపడ్డారు. తెలంగాణ అప్పు 7 లక్షల 22 వేల కోట్లు.. వాళ్ళు తెచ్చిన అప్పుకు 11.5 వేలకోట్లు వడ్డీ అని అన్నారు. వడ్డీ తగ్గించండి అని అడుక్కుంటాం.. వేరే దేశాల్లో ఐతే ఉరి తీసేవాళ్ళని ఆరోపించారు. ఢిల్లీకి నేను వెళ్తుంది.. ఆర్థిక శాఖ న్యాయ నిపుణుల కాళ్ళు పట్టుకునే పరిస్థితి వచ్చిందని

## ముఖ్యమంత్రిది డొల్ల నీతి..

- తెలివి తక్కువతనంతో హామీలు ఇచ్చానని సీఎం రేవంత్ ఒప్పుకున్నడు
- కేసీఆర్ చెప్పినట్లే రైతుబంధు రాం..రాం అయ్యింది..
- వానాకాలం రైతుబంధు ఎగ్గొట్టినోడు ఎవడు..?
- ఎన్ని అబద్ధాలైనా అవలీలగా చెప్పే సామర్థ్యం..
- ఓటుకు నోటు దొంగ చెప్పినవన్నీ అబద్ధాలే..
- సబ్ కమిటీ వేసింది రైతుబంధు ఎగ్గొట్టేందుకే..
- ముష్టి వేస్తున్నడని అహంకారపు మాటలు..
- ప్రభుత్వం అబద్ధాలు చెబుతున్నది..
- సీఎం రేవంత్‌వి నికృష్టపు మాటలు..
- రైతుబంధు దేశానికే ఆదర్శం..
- ప్రభుత్వాన్ని నమ్మడం లేదు..
- సీఎం రేవంత్‌పై కేటీఆర్ మండిపాటు..



10లో..

**హైదరాబాద్,డిసెంబర్21(వెలుతురు):** తెలివి తక్కువతనంతో అడ్డగోలు హామీలు ఇచ్చానని.. తనకు పాలన చేతకావడం లేదని సీఎం రేవంత్ ఒప్పుకున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడారు. 'ఒకటి మాత్రం తేటతెల్లమైపోయింది. సీఎం రేవంత్‌రెడ్డి ఒక కన్ఫెషన్

## హామీలు,మేనిఫెస్టోలపై బిఆర్ఎస్ అబద్దాలు

- కాళేశ్వరంతో ఒక్క ఎకరాకు కూడా నీరివ్వలేదు
- దళితుడిని సిఎం చేస్తానని దగా చేసిన కెసిఆర్
- అసెంబ్లీలో హరీష్ రావు వ్ఆయఖ్యలపై మండిపడ్డ కోమటిరెడ్డి

**హైదరాబాద్, డిసెంబర్21(వెలుతురు):** అసెంబ్లీలో కాళేశ్వరం నీళ్లపై జగడం మొదలైంది. మాజీ మంత్రి హరీష్ రావుకు మంత్రి కోమటి రెడ్డి సవాల్ విసిరారు. నల్గొండ జిల్లాకు కాళేశ్వం నీరు చేరాయన్నా దానిపై



10లో..

## వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ అసెంబ్లీలో అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్




**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 21:** అందరికీ అన్నం పెట్టే అన్నదాతలు సంతోషంగా లేరని అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు శనివారం శాసనసభలో రైతు సమస్యల గురించి ప్రభుత్వానికి నివేదించారు వ్యవసాయం కోసం బడ్జెట్లో ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని ఆయన కోరారు రైతులు తమ పిల్లలకు కార్పొరేట్ విద్యను అందించలేని పరిస్థితిలో ఉన్నారని ఆయన అన్నారు విద్య వైద్య రంగాల్లో రైతులకు ప్రాధాన్యత ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు విత్తనాలు ఎరువులు పంట పొలాలకు తీసుకెళ్లేందుకు పండించిన పంటను తిరిగి ఇంటికి తెచ్చుకునేలా పంట పొలాలకు వెళ్లే రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఆయన కోరారు...

## కొత్త సంవత్సరం వేళ డ్రగ్స్ కలకలం

**వరుసదాడుల్లో భారీగా మాదకద్రవ్యాల పట్టివేత**

**న్యూ ఇయర్ వేడుకలపై పోలీసుల డేగకన్ను**

**హైదరాబాద్,డిసెంబర్21(వెలుతురు):** మరికొద్దిరోజుల్లో న్యూఇయర్ రాబోతోండగా హైదరాబాద్‌లో డ్రగ్స్ కలకలం రేపాయి. ఇటీవలి కాలంలో వరుసగా డ్రగ్స్ పట్టివేతలు కలకలం రేపుతున్నాయి. అయితే న్యూఇయరే టా÷-గ్గ్ం÷ట్‌గా కొందరు డ్రగ్ ఫెడ్లర్‌లు..



10లో..

## గిరిజన యువత తలుచుకుంటేనే మార్పు సాధ్యం

- సర్పంచ్‌లు తల ఎత్తుకుని తిరిగే పరిస్థితులు
- డోలీ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పని
- రూ.105 కోట్లతో రోడ్లు నిర్మిస్తున్నాం
- రెండోరోజూ గిరిజన గ్రామాల్లో పవన్ పర్యటన

**విజయనగరం,డిసెంబర్21(వెలుతురు):** ప్రభుత్వంలో పవన్ కల్యాణ్ భాగస్వామి అయ్యాడంటే.. ప్రతీ గిరిజన యువకుడు ప్రభుత్వంలో వున్నట్టే లెక్క అంటూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. డోలీ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఇక్కడ ప్రజల ఆవేదన, బాధ తెలుసుకోవడం కోసమే అటవీ ప్రాంతంలో పర్యటించామన్నారు. రూ.105 కోట్లతో పంచాయతీ రాజ్ శాఖ ద్వారా రోడ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. ఎన్నికల కోసమో, ఓట్ల కోసం మా ప్రభుత్వం



10లో..

పనిచేయదని.. ప్రజల కష్టాలు, కన్నీళ్లలో మేం వున్నామని కచ్చితంగా చెబుతున్నామన్నారు. 19 పనులు ప్రారంభించామని ఆయన తెలిపారు. అల్లూరి జిల్లా అనంతగిరి మండలం గుమ్మంతి పర్యటనలో గిరిజనుల సమస్యను పవన్ కల్యాణ్ అడిగి తెలుసుకున్నారు. 'డోలీ మోతల విముక్త ఏపీ'లో భాగంగా మారుమూల గిరిజన గ్రామాలకు రహదారి నిర్మాణం కోసం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భూమి పూజ చేశారు. గిరిజన యువత తలుచుకుంటేనే మార్పు సాధ్యమని.. ప్రభుత్వం మారింది, పంచాయతీ

**ఓట్ల కోసం తాము పనిచేయడంలేదు**

**మాకు ఓట్లు వేయని వాళ్ల కోసం కూడా పనిచేస్తాం**

**ప్రజా సంక్షేమమే మాకు ముఖ్యం**

**ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**

## బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం

- ఉత్తరాంధ్ర వర్షాలపై సిఎం చంద్రబాబు సమీక్ష
- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశం




10లో..

**అమరావతి,డిసెంబర్21(వెలుతురు):** అల్పపీడన ప్రభావంతో ఉత్తరాంధ్రలో కురుస్తున్న భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని సిఎం చంద్రబాబు

# ఆర్థిక విధ్వంసంతో అభివృద్ధికి పాతర

(మొదటి పేజీ తరువాయి..)
పేర్కొన్నారు. మరోవైపు.. హాస్టల్‌లకు మీరేం చేశారని బీఆర్ఎస్ ను సీఎం ప్రశ్నించారు. హాస్టల్ కట్టలేదు.. అమ్మాయిలకు టాయ్‌లెట్ కట్టలేదన్నారు. నాలుగు గంటల నుండి క్యూ కట్టాల్సిన పరిస్థితి.. పదేళ్ల పాలనలో బాత్‌రూం కూడా కట్టనందుకు క్షమాపణ చెప్పాలని ముఖ్యమంత్రి అన్నారు. అందుకే ఆయన సభకు రావడం లేదు.. వస్తే కడిగేద్దాం అని ఏడాది నుండి చూస్తున్నానని పరోక్షంగా కెసిఆర్ గురించి అన్నారు. మీరెంత.. మీ స్థాయి ఎంత.. నా నిబద్ధతను మీరా ప్రశ్నించేదని తీవ్ర స్థాయిలో సీఎం మండిపడ్డారు. పేపర్ దిద్దలేని మీరు.. టీఎస్పీఎస్సీ పరీక్ష పెట్టలేని మీరు.. నన్నా అడిగేదని దుయ్యబట్టారు. కేసీఆర్ దొంగ లెక్కలు చూపించలేదు.. ఆర్థికమంత్రిగా ఈటల రాజేందర్ కూడా దొంగ లెక్కలు చూపలేదు.. కానీ కేసీఆర్ తరవాత వచ్చిన హరీష్ దొంగ లెక్కలు రాశాడని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ పెద్దమనిషి పని ఎట్లా ఉందంటే.. ప్రశ్నపత్రం నువ్వే రెడీ చేసి.. నువ్వే సమాధానం చెప్పి.. నువ్వే ఎక్కువ మార్కులు వేసుకుని ఇదే నా ఘనత అంటున్నాడని విమర్శించారు. అప్పులు ఎక్కడ ఉన్నాయో.. తప్పులు ఎక్కడ ఉన్నాయో చూడనివ్వండని అన్నారు. తమ చేతులు విరగొట్టాలని చూస్తున్నారని, పాలన చేయకుండా, అభివృద్ధి సాగకుండా చేయాలని చూస్తున్నారని బీఆర్ఎస్ పై సీఎం తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇక లగచర్ల కేసుపై పరోక్షంగా మాట్లాడుతూ...పరిశ్రమలు రాకుండా అడ్డుపడుతూ అభివృద్ధికి మోకాలడ్డుతున్నారని మండిపడ్డారు. కొడంగల్ ప్రజలకు తాను ఎంత చేసినా తక్కువేనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తమ ప్రజలు ఇచ్చిన దీవనతో సీఎం అయ్యానని తెలిపారు. కోట్ల రూపాయలతో లావాదేవీ పెట్టుకుని ఫార్మా పెట్టొచ్చు.. ఏమీ లేని తన ప్రాంతానికి మెడికల్ కాలేజీ పెడితే తప్పా అని అన్నారు. కాలేజీలు తీసుకున్నా తప్పే అంటారు.. కొడంగల్ 3 లక్షల ఎకరాల్లో 1300 ఎకరాలు తీసుకుని పరిశ్రమలు పెడదాం అనుకున్నా, తప్పేనని అంటున్నారు. కొడంగల్ ప్రజలకు తన చర్మం ఒలిచి చెప్పులు కుట్టించినా తక్కువేనని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కానీ కోట్లు ఖర్చు చేసి అధికారుల మీద దాడి చేయించారని మండిపడ్డారు. కొడంగల్ లో పరిశ్రమలు పెట్టొద్దా.. ఉద్యోగాలు ఇవ్వొద్దా.. మా పిల్లలు డాక్టర్లు కావద్దా అని అన్నారు. అడ్డం వస్తే తొక్కుకుంటూ పోతా అని అందుకే చెప్పానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.స్కిల్ వర్సిటీ కోసం అదానీ రూ.100 కోట్లు ఇచ్చారు. దీనిపై ప్రతిపక్షం చేసిన నానాయాగీ వల్ల ఆ మొత్తాన్ని అదానీకి తిరిగి ఇచ్చాం. రూ.100 కోట్లు తిరిగి ఇవ్వడం వల్ల రాష్ట్రానికి నష్టం. రెండు సార్లు సీఎం అయ్యి.. వందేళ్ల విధ్వంసం చేసి.. వెయ్యేళ్లకు సరిపడా మీరు సంపాదించుకున్నారు' అని సీఎం ఆరోపించారు. తొమ్మిదిన్నర ఏళ్ల భారాస పాలనలో రూ.7 లక్షల కోట్ల అప్పు చేశారని.. పదేళ్లు కష్టపడి కేసీఆర్ 'కూలేశ్వరం' కట్టారని సీఎం ఎద్దేవా చేశారు. కొన్నికొన్ని సంఘటనలు చూస్తే మనసు చలించిపోతుందని, అసలు సమాజం ఎటువైపు పోతుందని బాధేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి శనివారం జరిగిన అసెంబ్లీలో సమావేశంలో తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. అసెంబ్లీ సమావేశంలో భాగంగా పుష్పా-2 సినిమా బెన్‌ఫిట్ షో సందర్భంగా సంధ్య థియేటర్‌లో జరిగిన ప్రస్తావన సందర్భంగా సీఎం మాట్లాడారు. పుష్పా-2కు సంబంధించి టిక్కెట ధరలు విషయంలో, బెన్‌ఫిట్ షోకు సంబంధించి ప్రభుత్వమే అనుమతి ఇచ్చిందని సీఎం గుర్తు చేశారు. కానీ బెన్‌ఫిట్ షోకు వస్తే జనం కిక్కిరిసి ఉంటారని, కనీసం జ్ఞానం లేకుండా లేకుండా, పోలీసులకు సరైన సమాచారం ఇవ్వకుండా థియేటర్‌కు రావడంతో ఒక మహిళ చనిపోవడంతోపాటు ఆమె కుమారుడు అపస్మార స్థితిలో ఉన్నాడని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరిగినా కనీసం చలనం కూడా లేకుండా అక్కడ ఉండి సినిమా చూస్తా అనడం దేనికి సంకేతమని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఇంకా అక్కడే ఉంటే మరింత ప్రమాదం జరుగుతుందని సినీహీరో అల్లుఅర్జున్‌కు చెప్పిన పోలీసులు ఇప్పటికే ఒకరు చనిపోయారు, ఒకరి పరిస్థితి ప్రమాదకరంగా ఉందని చెప్పినా కూడా వెళ్లకుండా ఉండటంతో మీరు ఇక్కడే ఉంటే అరెస్టు చేయాల్సి వస్తుందని అనడంతో అప్పుడు వెళ్లిపోయారన్నారు. అది కూడా వెళ్లే సమయంలో ఓపెన్‌టాప్ జీపులో చేతులు బయటకు ఊపుతూ కనీసం ఎవరూ చనిపోయారు, ఎవరూ గాయాలు పాలయ్యారు అని చూడకుండా ఉండటం ఎంత వరకు సబబు అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఇప్పటికీ ప్రమాదంలో గాయపడిన బాబు పరిస్థితి ఆందోళన కరంగా ఉందని కనీసం సినీ పెద్దలు కానీ, రాజకీయ ప్రముఖులు కానీ వెళ్ల లేదని ఇదా అధ్యక్ష మానవత్వం అంటే అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఒక్కరోజు జైలులో ఉన్నందుకు అల్లుఅర్జున్‌కు పదుల సంఖ్యలో పరామర్శలు, ప్రభుత్వంపైన విమర్శలు చేస్తున్నారని, అల్లుఅర్జున్ ఏమైనా గాయపడ్డారా..? ఏమైనా జరిగిందా..? అని నిలదీశారు. ఒక్క రోజు జైలులో ఉంటేనే మీకు అలా ఉంటే అక్కడ ఒకరి ప్రాణం పోవటంతో, ఏమీన తెలియని చిన్నారి కోమాలోకి వెళ్లిపోతే బాధ కలగదా అని అన్నారు. అల్లుఅర్జున్‌ను కావాలనే ప్రభుత్వం అరెస్టు చేసిందని పదేళ్లు పాలించిన ఒక నాయకుడు ట్విటర్‌లో ఇష్టం వచ్చినట్లు కామెంట్లు పెడుతున్నారని, సమాజం ఎటువైపు పోతుందని ఆయనకు కనీస మానవత్వం కూడా లేదా అని ప్రశ్నించారు. అదే మన ఇంట్లో ఇలాంటి ఘటన జరిగితే మనం ఊరుకుంటామా అని అన్నారు. మరీ అలాంటప్పుడు సినీ హీరోలను అరెస్టు చేయవద్దని ఏమైనా చట్టాలు ఉన్నాయా.. లేకపోతే చేయండి అధ్యక్షా.. అలానే చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఒకింత అసహనానికి లోనయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చేసిన చట్టం ప్రకారం పోలీసులు నడుచుకుంటారని వారు రాజకీయ నాయకులా.. సినీ హీరోలా అని చూడరని అన్నారు. నిజంగా హీరోలంటే తెరపైన కాదు.. నిజజీవితంలో ఎలా ఉండాలో చూపిస్తే వారిని ప్రేమిస్తే అభిమానులకు మేలు జరుగుతుందని ఆయన హితవు పలికారు. ఇప్పటికైనా అర్థంపర్థంలేని కామెంట్లు చేయకుండా కనీస మానవత్వాన్ని చాటుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

**ఇలాంటి ఘటనలు ఎవరూ హర్షించరు : అక్బరుద్దీన్**

సంధ్య థియేటర్‌లో జరిగిన ఘటనను మానవత్వం ఉన్న ఎవరూ హర్షించరని, దానికి బాధ్యులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ అన్నారు. మనకు పిల్లలు ఉన్నారని, ఇలాంటి ఘటనను తీవ్రంగా వ్యతిరేకించాల్సిందేనని అన్నారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన బాలుడు త్వరగా కోలుకోవాలని ఆ భగవంతుడిని కోరుకున్నట్లు చెప్పారు. సినీ ప్రముఖులు కూడా ఆ బాలుడిని పరామర్శించకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. ఇంకా ఘటనకు బాధ్యులైన వారికే సానుభూతి పలకడం ఎంత వరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంలో ఎటువంటి సందేహాలు అవసరం లేదని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

రైతులకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. గతంలో మాదిరిగా కాకుండా అర్హులైన రైతులందరికీ భరోసా కల్పిస్తామని ప్రకటించారు. రైతు భరోసా అమలు విషయంలో ఎవరికీ ఎలాంటి అనుమానాలు వద్దన్నారు. రైతు భరోసా అంశంపై అసెంబ్లీలో జరిగిన స్వల్పకాలిక చర్చలో ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంతో ప్రేమ ఉందన్నారు. భూమి చుట్టూనే రైతు జీవితం, వారి కుటుంబాలు ఆధారపడి ఉన్నాయన్నారు. భూమినే నమ్ముకుని.. భూమినే అమ్మగా భావించి జీవనాధారం సాగిస్తున్నారన్నారు సీఎం రేవంత్ రెడ్డి. పెట్టుబడి సాయం కింద రైతును ఆదుకోవాలనే ఉద్దేశంతోనే రైతు భరోసా తెస్తున్నామన్నారు. గత ప్రభుత్వం.. బీఆర్ఎస్ పార్టీ హయాంలో... సాగులో లేని భూములు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, రాళ్లు, రప్పలు, జాతీయ రహదారుల కింద పోయిన భూములు.. పరిశ్రమల్లోని భూములు ఇలాంటి వాటన్నింటికీ రైతు బంధు కింద.. అనర్హులకు కూడా డబ్బులు ఇచ్చారన్నారు. కేసీఆర్ హయాంలో 72 వేల కోట్లు రైతు బంధు కింద చెల్లిస్తే.. అందులో 22 వేల 606 కోట్ల రూపాయలు అనర్హులకే చెల్లించారన్నారు. ఈ 22 వేల 606 కోట్ల రూపాయలు బీఆర్ఎస్ పార్టీ నేతలు దోచుకున్నారన్నారు. ఇలాంటి తప్పిదాలు అన్నింటినీ సవరించి.. కొత్త విధానాలు రూపొందించి.. అర్హులకే రైతు బంధు సాయం అందించే విధంగా ప్రణాళిక రచిస్తున్నామన్నారు. సంక్రాంతి పండుగ తర్వాత.. 2025 జనవరి నెలలో కొత్త విధివిధానాలతో రైతు బంధు నిధులు విడుదల చేస్తామన్నారు. నిజమైన రైతులకు న్యాయం జరిగే విధంగా చూస్తామన్నారు. హైదరాబాద్ లో అసలు వ్యవసాయమే లేదని.. ఇలాంటి హైదరాబాద్ సిటీలోనూ రైతు బంధు కింద డబ్బులు దోచుకుని తిన్నారంటూ సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రైతులను ఆదుకోవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.రైతు భరోసాపై ఎలాంటి అనుమానాలు అవసరం లేదని స్పష్టం చేశారు. 'రైతు సమాజాన్ని ఆదుకునేందుకు మా ప్రభుత్వం ముందు ఉంటుంది. గత ప్రభుత్వం రైతు బంధు అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరించింది. రైతులకు పెట్టుబడి సాయం ఇచ్చేందుకు ఈ పథకాన్ని తెచ్చారు. సాగులో లేని భూములకూ రైతుబంధు ఇచ్చారు. దీని ద్వారా రూ.22,600 కోట్ల ఆయాచిత లబ్ది చేకూర్చారు. రియల్ ఎస్టేట్, పారిశ్రామికవేత్తలకూ ఇచ్చారు. రాళ్లకు, గుట్టలకూ రైతుబంధు ఇద్దామా..?' అని సీఎం రేవంత్ ప్రశ్నించారు. రైతు భరోసా అమలు చేయడానికి సభ్యులంతా సలహాలు ఇవ్వాలని సీఎం కోరారు. గత ప్రభుత్వం రైతు బంధు అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరించింది. రైతులకు పెట్టుబడి సాయం ఇచ్చేందుకు ఈ పథకాన్ని తెచ్చారు. సాగులో లేని భూములకూ రైతుబంధు ఇచ్చారు. దీని ద్వారా రూ.22,600 కోట్ల ఆయాచిత లబ్ది చేకూర్చారు. రియల్ ఎస్టేట్, పారిశ్రామికవేత్తలకూ ఇచ్చారు. రాళ్లకు, గుట్టలకూ రైతుబంధు ఇద్దామా..?' అని సీఎం రేవంత్ ప్రశ్నించారు. రైతు భరోసా అమలు చేయడానికి సభ్యులంతా సలహాలు ఇవ్వాలని సీఎం కోరారు.'జమీందార్లు, భూస్వాములకు రైతు బంధు ఇవ్వాలా..? మీరు ఇచ్చారు కాబట్టి.. మమ్మల్నీ రాళ్లు, గుట్టలకు రైతు బంధు ఇవ్వాలంటున్నారు. భారాసను ఆదర్శంగా తీసుకోవాలని అంటున్నారు. వారిని ఆదర్శంగా తీసుకుంటే మేం కూడా ప్రతిపక్షంలోనే ఉండేవాళ్లం. 2023లో అధికారం.. 2024లో డిపాజిట్లు కోల్పోయిన మీరు మాకు ఆదర్శం కాదు. నిజమైన లబ్దిదారులెవరికీ అన్యాయం జరగకూడదు' అని సీఎం అన్నారు.'రైతుల ఆత్మహత్యల్లో మహారాష్ట్ర తొలి స్థానంలో ఉంది. తెలంగాణ రెండో స్థానంలో ఉంది. భారాస పాలనలో 3 వేల మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతుల ఆత్మహత్యలు తగ్గించామని చెబుతున్నారు. అబద్దాలు చెప్పే సంఘానికి అధ్యక్షుడు అసెంబ్లీకి రాలేదు. ఆ సంఘానికి ఉపాధ్యక్షుడు అసెంబ్లీకి వచ్చారు' అని సీఎం ఎద్దేవా చేశారు. రైతు భరోసా పథకంపై వివిధ అంశాలను ఆయన వెల్లడించారు. రైతు భరోసా పై ఎలాంటి అనుమానాలు అవసరం లేదని, ఇందిరాగాంధీకి ఉన్న చరిత్ర అందరికీ తెలుసునని అన్నారు. రైతు బందు ఉద్దేశం వ్యవసాయ పెట్టుబడికి సహాయం చేయడమని ఆయన అన్నారు. గత ప్రభుత్వం రైతు బంధు పథకం కింద రూ. 72 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టారు. అయితే, ఈ పథకంలో అనేక అవకతవకలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, కేసీఆర్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం కొనసాగించారు. కేసీఆర్ అనుభవం, నాయకత్వాన్ని మేము అంగీకరిస్తున్నాం. కానీ, కొన్ని ముఖ్యమైన అంశాలను తెలుసుకోవాలని.. కేవలం గొప్పగా మాట్లాడటం కాదు, పేద రైతు వరకు ప్రభుత్వ పథకాలు అందించాలని ఆయన అన్నారు. రేవంత్ రెడ్డి తన నాయకత్వంలో రైతుల రుణమాఫీ చేయడం విధానాన్ని తెలిపారు. మేము రైతుల రుణమాఫీకి ముందుగానే చర్యలు తీసుకున్నామని, రైతులపై వడ్డీ భారం ఉండకూడదు కాబట్టి మేము ముందుగానే పని చేశామని ఆయన అన్నారు. ఆ తరువాత స్విస్ బ్యాంకులోని బిల్లులపై విమర్శలు గుప్పించిన ఆయన, రాజకీయ నాయకులు స్విస్ బ్యాంకుకు కూడా అప్పు ఇచ్చే స్థాయిలో ఉన్నారు. 8 వేల కోట్లు కూడా లేవని కేసీఆర్ సభలోనే చెప్పారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చివరగా, తెలంగాణ రాష్ట్రం ఆర్థిక పరిస్థితిపై కూడా మాట్లాడారు. రూ. 72 వేల కోట్లు అప్పులు చేసిన 16 మంది ముఖ్యమంత్రులు వాటి మీద పద్ధతి లేకుండా మాట్లాడుతున్నారని ఆయన అన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటూ..గతంలో తాము చేసిందే అభివృద్ధి అని చెబుతూ..అదే ఆదర్శంగా తీసుకోవాలని చెబుతున్న బిఆర్ఎస్ తీరుపై తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కొడంగల్ అభివృద్దకి మోకాలడ్డుతున్న బిఆర్ఎస్ నేతల తీరును దుయ్యబట్టారు. నల్లమల్ల అడవుల్లో జంతువలను తొక్కుకుంటూ వచ్చిన తాను వారిలాగా రాజకీయంగా ఎదగలేదన్నారు. లగచర్ల ఘటనపై అసెంబ్లీలో సీఎం మాట్లాడుతూ.. 'కొడంగల్ ప్రజలకు నా జీవితాంతం ఏం చేసినా తక్కువే. స్వాతంత్య్రం వచ్చాక కొడంగల్ నుంచి ఒక్కరూ మంత్రి కాలేదు. నాకు సీఎంగా అవకాశం వచ్చింది. కొడంగల్ నియోజకవర్గంలో చదువుకున్న వాళ్లకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని నేను అనుకోవడం తప్పా. ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్‌కు కూతవేటు దూరంలో ఉన్న ముచ్చర్లలో ఫార్మా సిటీ పెట్టడం తప్పు కానప్పుడ, సాగు, త్రాగు నీరు లేని చోట భూములు తీసుకుంటే తప్పా అంటూ ప్రశ్నించారు. నాలుగు గ్రామాల్లో భూసేకరణ చేసి కంపెనీలు తేవాలని అనుకున్నా. కోట్ల రూపాయలు పంపించి, మందు తాగించి దాడులు చేయించారు. అధికారులు వెళ్తే రాళ్లు, రప్పలతో దాడులు చేయించారు. కొడంగల్‌లో కంపెనీలు పెట్టొద్దా, ఉద్యోగాలు ఇవ్వవద్దా, మెడికల్ చదువులు వద్దా. అని ప్రశ్నించారు. అభివృద్ధికి అడ్డుపడితే తొక్కుకుంటూ పోతా అని అందుకే అంటున్నా. అన్నీ వద్దు అన్నాక అభివృద్ధి పథంలో నడిపించడం ఎట్లా సాధ్యం అవుతుంది. దొంగలకు సద్దులు మోస్తున్నారు. నల్లమల అడవుల నుంచి కూరమృగాల మధ్య నుంచి వచ్చాను. గుంటూరు విజ్ఞాన్‌లో చదువుకుని రాలేదు. సామాన్యుడిగా వచ్చాను. అయ్య పేరు చెప్పుకుని రాలేదు. ఎమ్మెల్యేలను ఒత్తిడి చేసి సియోల్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పంపించలేదు. కాళ్లల్లో కట్టె పెట్టి అడ్డంపడుతున్నారు' అంటూ సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి విషయంలో అడ్డుపడితే తెలంగాణ సమాజం క్షమించదన్నారు. గత పదేళ్ల విధ్వంసం గురించి తెలంగాణ సమాజం తెలుసుకోవాలని అన్నారు. ఇచ్చిన మాటలకు కట్టుబడి సోనియా తెలంగాణ ఇస్తే పదేళ్లపాటు అధికారం చెలాయించి వెయ్యేళ్లకు సరిపడా సంపాదించుకున్నారని అన్నారు.

## కువైట్ ఓ మినీ ఇండియా

'మినీ ఇండియా' లా కనిపిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. రెండు రోజుల కువైట్ పర్యటనకు వెళ్లిన ప్రధాని.. అక్కడి ప్రవాస భారతీయులతో నిర్వహించిన 'హలా మోదీ' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీ అందరికీ భారత్ నుంచి ఇక్కడికి రావడానికి 4 గంటల సమయం పడితే.. ఓ భారత ప్రధాని ఇక్కడికి రావడానికి 4 దశాబ్దాల సమయం పట్టిందన్నారు. ప్రతి ఏటా వందలాది మంది భారతీయులు ఇక్కడికి వస్తున్నారని, అలా కువైట్ సమాజానికి భారతీయతను పరిచయం చేశారని మోదీ అన్నారు. భారతదేశ ప్రతిభ, సాంకేతికత, సంప్రదాయాలను మేళవించి కువైట్ నేలను భారతీయ రంగులతో నింపారని ప్రశంసించారు. ఈ దేశ వైద్యరంగానికి భారతీయ వైద్యులు, పారామెడికల్ ప్రధాన బలమన్నారు. 'కువైట్ భవిష్యత్ తరాలను తీర్చిదిద్దడంలో భారతీయ ఉపాధ్యాయుల పాత్ర కీలకంగా మారింది. ఈ దేశ నేతలతో ఎప్పుడు మాట్లాడినా భారతీయుల గురించి ప్రశంసిస్తూనే ఉంటారు. రెమిటెన్స్‌లను (విదేశీ కరెన్సీ) స్వీకరించడంలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా ఉంది. మీరంతా కష్టపడి పని చేయడం వల్లే ఈ ఘనత సాధ్యమైంది. భారత్, కువైట్ దేశాలు అరేబియా సముద్రానికి ఇరువైపులా ఉన్నాయి. ఈ రెండు దేశాలను కేవలం దౌత్యసంబంధాలే కలపడం లేదు. హృదయ సంబంధాలు కూడా దగ్గర చేస్తున్నాయి. ఇప్పుడే కాదు.. గతంలోనూ రెండు దేశాల మధ్య సంబంధాలు బాగుండేవి. కువైట్‌కు అవసరమైన మానవ వనరులు, నైపుణ్యత, సాంకేతికతను అందించడం లో భారత్ ముందంజలో ఉంది. రాబోయే కాలంలో ఈ రెండు దేశాలు కేవలం వాణిజ్యపరంగానే కాకుండా పరస్పర శ్రేయస్సు కోరుకునే భాగస్వాములు కూడా అవుతాయి. భారతదేశంలోని స్టార్టప్‌లు, సాంకేతిక కువైట్ అవసరాలకు అత్యాధునిక పరిష్కారాలను చూపించగలవు' అని మోదీ అన్నారు. కొవిడ్ -19 మహమ్మారి సమయంలో భారత్‌కు లిక్విడ్ ఆక్సిజన్ సరఫరా చేసిన కువైట్ ప్రభుత్వానికి ఈ సందర్భంగా మోదీ కృతజ్ఞతలు తెలిపారు.

## రైతులకు సంకెళ్లు వేసిన చరిత్ర మీది

◆ **కేటీఆర్‌పై మంత్రి సీతక్క విమర్శలు**

హైదరాబాద్,డిసెంబర్21(వెలుతురు):
రైతులకు సంకెళ్లు వేసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మండిపడ్డారు. అసెంబ్లీలో రైతు బంధుపై చర్చ సందర్భంగా కౌలు రైతులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆమె స్పందిస్తూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. అ–దద ఇంట్లో ఉంటున్న వ్యక్తి యజమాని అయితే కౌలు రైతులకు రైతుబంధు ఎందుకు ఇవ్వాలి. కౌలు రైతులకు రైతుబంధు ఇస్తామని నాడు మాట్లాడిన బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు తమ ప్రేమను చాటుకుంటున్నారని ఆమె అన్నారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ రైతు బంధు ఇవ్వలేదని, పట్టా బంధు, పట్టా ఉన్నవారికే రైతుబంధు ఇచ్చారని, కౌలు రైతులకు, చిన్న, సన్నకారు రైతులకు పట్టా అందలేదని ఆమె అన్నారు. రుణమాఫీ గురించి మాట్లాడుతున్నారని, అయితే ఇది రుణమాఫీ కాదని, వడ్డీ మాఫీ మాత్రమేనని ఆమె స్పష్టం చేశారు. రుణమాఫీ పేరుతో ఆ రోజు పెట్టిన నిబంధనల వల్ల నాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన రుణమాఫీలో కొందరికి అర్హత లేదన్న మాట వాస్తవమేనని ఆమె అన్నారు. బీఆర్ఎస్ హయాంలో రైతులకు అన్నీ చేశామని, ఇంకా రూ.30 వేల కోట్ల రుణమాఫీ ఎందుకు పెండింగ్ లో ఉందో కేటీఆర్ చెప్పాలన్నారు. భూమి లేని పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.5 గ్యాస్ ఇచ్చింది. 500, మరియు రూ. ఇవ్వబోతోంది. భరోసా కింద 12వేలు, బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో భూమిలేని పేదలకు ఏం ఇచ్చారో మంత్రి సీతక్క చెప్పాలని డిమాండ్ చేశారు.

## ఇకముందు బెనిఫిట్ షోలు రద్దు

◆ **ఆ కుటుంబానికి 25 లక్షల సాయం ప్రకటించిన ప్రభుత్వం**

హైదరాబాద్,డిసెంబర్21(వెలుతురు):
సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన రేవతి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.25 లక్షలు అందించనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో ఇకపై సినిమా విడుదలకు ముందు రోజు ఎలాంటి బెనిఫిట్ షోలు ఉండవని స్పష్టం చేశారు. అలాంటివాటికి అనుమతులు ఇవ్వబోమని అన్నారు. టికెట్ రేట్ల పెంపునకు అనుమతివ్వబోమని పేర్కొన్నారు. తొక్కిసలాట ఘటనలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడి కుటుంబానికి పరిహారం ఇస్తామన్న హామీని అల్లు అర్జున్ నిలబెట్టుకోలేదన్నారు. శ్రీతేజ్ వైద్య చికిత్స కోసం అయ్యే ఖర్చును ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనపై విపక్ష ఎంఐఎం సభ్యుడు అక్బరుద్దీన్ ప్రస్తావించగా సిఎం రేవంత్ తీవ్రంగా స్పందించారు.

# మళ్లీ జీఎస్టీ బాదుడు..

(మొదటి పేజీ తరువాయి..)
సంబంధం లేకుండా జీఎస్టీ రేటును మునుపటి 18% నుండి 5% కు తగ్గించారు. ఆటోక్లేవ్డ్ ఏరేటెడ్ కాంక్రీట్ (ఎసిసి) బ్లాక్స్: 50% కంటే ఎక్కువ ఫ్లై యాష్ ఉన్న ఏసీసీ బ్లాకులపై ఇప్పుడు జీఎస్టీ ని 18% నుండి 12 శాతానికి తగ్గించారు. వివిధ వస్తువులపై పన్ను రేట్లను హేతుబద్ధీకరించాలని GOM సిఫార్సు చేసింది. హానికరమైన పానీయాలు, పొగాకు ఉత్పత్తులపై పన్ను రేటును 28% నుంచి 35%కి పెంచాలని ప్రతిపాదించింది. అదేవిధంగా దుస్తులపై ప్రతిపాదిత కొత్త రేట్లు ఈ కింది విధంగా ఉండనున్నాయి. రూ. 1,500 వరకు ఉన్న దుస్తులపై 5% జీఎస్టీ, రూ.1,500 నుండి రూ.10,000 వరకు వస్త్రాలపై 18% జీఎస్టీ, రూ.10,000 కంటే ఎక్కువ విలువైన బట్టలపై 28% జీఎస్టీ, రూ.1,500 పైబడిన షూస్, రూ.25,000 పైబడిన వాచీలపై పన్ను రేటును 18% నుంచి 28%కి పెంచాలని సిఫార్సు చేసింది. నిత్యావసర వస్తువులపై పన్ను భారాన్ని తగ్గించాలని కూడా జిఓఎం సిఫార్సు చేసింది. ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ (20 లీటర్లు లేదా అంతకంటే ఎక్కువ)పై జీఎస్టీని 18% నుంచి 5%కి తగ్గించాలని ప్రతిపాదించారు. అదనంగా, రూ. 10,000 కంటే తక్కువ ఉన్న సైకిళ్లు, క్యాన్సర్ ఔషధాలపై జీఎస్టీ రేట్లను 12% నుండి 5%కి తగ్గించాలని సిఫార్సు చేసింది. విటమిన్లు, మినరల్స్ యాడ్ చేసిన బలవర్ధకమైన బియ్యం పై పన్ను రేటును 5 శాతానికి తగ్గించారు. తుది వినియోగంతో సంబంధం లేకుండా ఈ నిర్ణయం తీసుకున్నారు. స్విగ్గీ , జొమాటో వంటి ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్‌లపై పన్ను భారం తగ్గించారు, దీనివల్ల ప్రజలకు మరింత తక్కువ ధరలో ఆహార పదార్థాలు అందుబాటులోకి వస్తాయి. ఈ ప్లాట్‌ఫామ్‌లపై ప్రస్తుతం విధిస్తున్న 18 శాతం జీఎస్టీని (ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌తో కూడిన) 5 శాతానికి (ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ లేకుండా) తగ్గించేందుకు ఫిట్‌మెంట్ కమిటీ ప్రతిపాదించింది. దీనిపై ఈ సమావేశంలో చర్చ జరుగుతుంది. 55th GST Council Meeting Decesions: రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ (Nirmala Sitharaman) అధ్యక్షతన, 55వ వస్తు సేవల పన్ను మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. AAC బ్లాక్‌లు, బలవర్ధకమైన బియ్యం (ఫోర్టిఫైడ్ రైస్), ఫ్లేవర్డ్ పాప్‌కార్న్ వంటివాటిపై మొదట నిర్ణయాలు వెలువడ్డాయి. 50% కంటే ఎక్కువ ఫ్లై యాష్ కంటెంట్ ఉన్న ఆటోక్లేవ్డ్ ఎరేటెడ్ కాంక్రీట్ బ్లాక్‌లపై జీఎస్టీని 18 శాతం నుంచి 12 శాతానికి తగ్గించారు. ఎలక్ట్రిక్ వెహికల్స్ సహా పాత ఉపయోగించిన కార్ల విక్రయాలపై జీఎస్టీ రేటును 12 శాతం నుంచి 18 శాతానికి పెంచడానికి కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. విటమిన్లు, మినరల్స్ యాడ్ చేసిన బలవర్ధకమైన బియ్యం (Fortified rice)పై పన్ను రేటును 5 శాతానికి తగ్గించారు. తుది వినియోగంతో సంబంధం లేకుండా ఈ నిర్ణయం తీసుకున్నారు. రెడీ-టు-ఈట్ పాప్‌కార్న్‌పై పన్నును కూడా GST కౌన్సిల్ సవరించింది. నాన్‌కీన్‌ల తరహాలో ఉప్పు, మసాలాలు కలిపిన పాప్‌కార్న్‌ను ప్యాకింగ్ & లేబుల్ లేకుండా సరఫరా చేస్తే 5 శాతం GST చెల్లించాలి. అదే




ఫుడ్‌ను ప్యాక్ చేసి లేబుల్‌తో సరఫరా చేస్తే 12 శాతం కట్టాలి. పంచదారతో కలిపిన పాప్‌కార్న్, కారామెల్ పాప్‌కార్న్‌లో ఉపయోగించే చక్కెర వల్ల ఈ రకాలను మిఠాయి కిందకు తీసుకువచ్చారు, 18 శాతం విధించారు. స్విగ్గీ జొమాటో వంటి ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్‌లపై పన్ను భారం తగ్గించారు, దీనివల్ల ప్రజలకు మరింత తక్కువ ధరలో ఆహార పదార్థాలు అందుబాటులోకి వస్తాయి. ఈ ప్లాట్‌ఫామ్‌లపై ప్రస్తుతం విధిస్తున్న 18 శాతం %+ూ%ని (ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌తో కూడిన) 5 శాతానికి (ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ లేకుండా) తగ్గించేందుకు ఫిట్‌మెంట్ కమిటీ ప్రతిపాదించింది. దీనిపై ఈ సమావేశంలో చర్చ జరుగుతుంది. దేశవ్యాప్తంగా ప్రజలు ఎదురు చూస్తున్న 'బీమాపై పన్ను రేటు తగ్గింపు' అంశాన్ని కౌన్సిల్ మరోమారు వాయిదా వేసింది, ప్రజలను నిరాశకు గురి చేసింది. ఈ అంశంపై మంత్రుల బృందం భేటీలో ఏకాభిప్రాయం లేకపోవడంతో తదుపరి పరిశీలన కోసం బీమా అంశాలపై నిర్ణయాన్ని కౌన్సిల్ పోస్ట్‌పోన్ చేసింది. వాస్తవానికి, టర్మ్ పాలసీలు సహా వయోజనలు తీసుకునే ఆరోగ్య బీమా పాలసీలపై టాక్స్‌ను రద్దు చేసేందుకు మంత్రుల బృందం ఓకే చెప్పింది. సాధారణ ప్రజలు తీసుకునే రూ.5 లక్షల లోపు హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలపైనా జీఎస్టీని రద్దు చేయాలని, రూ.5 లక్షలు దాటిన హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలకు ప్రస్తుతం ఉన్న 18 శాతం జీఎస్టీని కొనసాగించాలని నిర్ణయించింది. దీనిపై కౌన్సిల్ మీటింగ్ ప్రారంభంలోనే చర్చ జరిగినప్పటికీ, మరింత లోతైన చర్చ కోసం వాయిదా వేసింది. తి గడియారాలు, పెన్నులు, బూట్లు, దుస్తులు వంటి విలాసవంతమైన వస్తువులపై టాక్స్ పెంపు సహా 148 వస్తువులపై పన్ను రేట్ల హేతుబద్ధీకరణ ప్రతిపాదనలు చేశారు. ప్రస్తుతం 5 శాతం, 12 శాతం, 18 శాతం, 28 శాతంగా ఉన్న జీఎస్టీ శ్లాబ్‌లతో పాటు 35 శాతం టాక్స్ స్లాబ్‌ను కూడా ప్రవేశపెట్టడం, హానికర ఉత్పత్తులకు 35 శాతం టాక్స్ స్లాబ్‌ను వర్తింపజేయడంపై చర్చించారు. కూల్‌డ్రింక్స్‌తో పాటు దుస్తులపైనా పన్ను రేట్లలో మార్పులు చేసే ప్రతిపాదన కౌన్సిల్ దగ్గర ఉంది. రూ.1500 వరకు ఉండే రెడీమేడ్ దుస్తులపై 5%, రూ.1500-10,000 విలువైన దుస్తులపై 18%, రూ.10,000 కంటే ఎక్కువ ధర ఉన్న దుస్తులపై 28% జీఎస్టీ విధించాలని ప్రతిపాదనపై , గడియారాలు, పెన్నులు, బూట్లు, దుస్తులు వంటి విలాసవంతమైన వస్తువులపై టాక్స్ పెంపు సహా 148 వస్తువులపై పన్ను రేట్ల హేతుబద్ధీకరణ ప్రతిపాదనలు చేశారు. ప్రస్తుతం 5 శాతం, 12 శాతం, 18 శాతం, 28 శాతంగా ఉన్న GST శ్లాబ్‌లతో పాటు 35 శాతం టాక్స్ స్లాబ్‌ను కూడా ప్రవేశపెట్టడం, హానికర ఉత్పత్తులకు 35 శాతం టాక్స్ స్లాబ్‌ను వర్తింపజేయడంపై, కూల్‌డ్రింక్స్‌తో పాటు దుస్తులపైనా పన్ను రేట్లలో మార్పులు చేసే ప్రతిపాదన కౌన్సిల్ దగ్గర ఉంది. రూ.1500 వరకు ఉండే రెడీమేడ్ దుస్తులపై 5%, రూ.1500- 10,000 విలువైన దుస్తులపై 18%, రూ.10,000 కంటే ఎక్కువ ధర ఉన్న దుస్తులపై 28% జీఎస్టీ విధించాలని ప్రతిపాదన చేశారు. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరితో పాటు పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు, ఆర్థిక మంత్రులు, కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మంత్రుల బృందం మధ్య చర్చల తరువాత మరింత సమీక్ష అవసరమని పేర్కొంటూ బీమా సంబంధిత జిఎస్టి మార్పులకు సంబంధించిన నిర్ణయాలను వాయిదా వేయాలని కౌన్సిల్ నిర్ణయించినట్లు వివిధ మీడియా నివేదికలు తెలిపాయి. దీనిపై మరింత చర్చ జరగాల్సిన అవసరం ఉందని కొందరు సభ్యులు చెప్పారు. మేము జనవరిలో మళ్లీ సమావేశమవుతాము" అని బీమాపై జివోఎంకు నేతృత్వం వహిస్తున్న బీహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి చెప్పారు. శనివారం జరిగిన 55వ సమావేశంలో జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంలపై పన్ను రేట్లను తగ్గించే నిర్ణయాన్ని జీఎస్టీ కౌన్సిల్ వాయిదా వేసింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మరిన్ని సాంకేతిక చర్చలు అవసరమని కౌన్సిల్ సభ్యులు అంగీకరించారు. దీనిపై అదనపు చర్చల కోసం మంత్రుల బృందం ను నియమించింది. కాగా సమావేశానికి ఏపీ ఆరి?క మంత్రి పయ్యావుల కేశవ్ కూడా హాజరయ్యారు. రాష్ట్ర ఆర్థిక అవసరాలు, ప్రాధాన్యతా రంగాలకు అవసరమైన నిధులు అంశంపై కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ కు పయ్యావుల వివరించారు. నదుల అనుసంధానం, పూర్వోదయా వంటి స్కీమ్ ల కేటాయింపుల్లో ఏపీకి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. "ఏపీలో రెండు వేల టీఎంసీల నీరు సముద్రం పాలవుతోంది. నీటిని సద్వినియోగం చేసుకుని రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడానికి ఏపీ సీయం చంద్రబాబు పట్టిసీమ ద్వారా కృష్ణా-గోదావరి నదుల అనుసంధానం చేపట్టారు. ఇప్పుడు కృష్ణా-పెన్నా నదుల అనుసంధానం చేయాల్సి ఉంది. నదుల అనుసంధానం ద్వారా రాయలసీమ ప్రాంతానికి నీరు అందుతుంది. దేశంలోనే అతి తక్కువ వర్షపాతం నమోదయ్యే అనంతపురం జిల్లా రాయలసీమలోనే ఉంది. జైసల్మేర్ కంటే అనంతపురంలో తక్కువ వర్షపాతం నమోదవుతుంది. కేంద్రం కూడా నదుల అనుసంధానం పైన దృష్టి పెట్టింది. దీనిలో భాగంగా ఏపీలో నదుల అనుసంధానికి నిధులు కేటాయించాలి. పూర్వోదయా స్కీంలో భాగంగా ఈఏపీ ప్రాజెక్టుల ద్వారా ఏపీకి రాయితీలు అందివ్వాలి. మౌలిక సదుపాయాలు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, మెట్రో రైలు వంటి ప్రాజెక్టులకు నిధులను ఈఏపీ ప్రాజెక్టులతో అనుసంధానించాలి. 90:10 పద్ధతిన పూర్వోదయా స్కీం నిధులను అందివ్వాలి.గ్రీన్ ఫీల్డ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యూనివర్సిటీ, ఏవియేషన్ యూనివర్సిటీ, సంప్రదాయేతర ఇంధన వనరులపై ప్రత్యేక యూనివర్సిటీ ఏర్పాటుకు రూ. 100 కోట్లు ఇవ్వాలి. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు విభజన చట్టం మేరకు ఆర్థిక సాయం అందివ్వాలి. ఏపీలో చేనేత కార్మికులు ఎక్కువగా ఉన్నారు. ఐదు టెక్స్ టైల్ క్లస్టర్ల ఏర్పాటుకు నిధులివ్వాలి" అని పయ్యావుల కేశవ్ ఈ సమావేశంలో నిర్మలా సీతారామన్ కు విజ్ఞప్తి చేశారు.

# స్వర మతాలకు సంపూర్ణ రక్షణ ప్రభుత్వందే

## ఎల్ బి స్టేడియం లో కేక్ కట్ చేసి క్రిస్ మస్ శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి





(రాపర్తి భాస్కర్ గౌడ్ )

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 21:**
తెలంగాణలో సర్వమతాలకు సమానమైన సంపూర్ణ రక్షణ కల్పించడం ప్రజా ప్రభుత్వ విధానమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. సర్వమత సమానత్వంలో ఎవరైనా ఇతర మతాలను కించపరిచే చర్యలకు పాల్పడితే ప్రభుత్వం సహించదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి కేక్‌ను కట్ చేసి, అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నిన్ను నువ్వు ప్రేమించినట్టుగానే పొరుగువారిని కూడా ప్రేమించమని క్రీస్తు ప్రబోధనల్లో సమస్త అంశాలు సంక్షిప్తమై ఉన్నాయని అన్నారు.విద్య, వైద్యం విషయంలో క్రిస్టియన్ మిషనరీలు ప్రభుత్వాలతో పోటీ పడి నిరుపేదలకు సేవలు అందిస్తూ అందరికీఆదర్శంగా నిలుస్తున్నాయని అభినందించారు. సమాజ నిర్మాణంలో ఆదర్శవంతులుగా, విద్యార్థినీ విద్యార్థులను ఒక బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దడంలో ఆదర్శంగా నిలబడ్డారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.క్రిస్మస్ పండుగ జరుపుకునే డిసెంబర్ నెలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, తెలంగాణ ప్రకటన వెలువడిన నెల అని సీఎం గుర్తుచేశారు. ఈ పండుగను ప్రభుత్వం అధికారికంగా రాష్ట్రమంతా నిర్వహిస్తోందని గుర్తుచేశారు. దళిత క్రిస్టియన్ల సంక్షేమానికి, అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్ ,పొంగులేటి శ్రీనివాస రెడ్డి ,ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ,హైదరాబాద్ రెసిడెంట్ ,ప్రిసైడింగ్ బిషప్ ఎం.ఏ. డానియల్ ,ఎవాంజలిస్ట్ డాక్టర్ ఎన్ జయపాల్ ,కల్వరి టెంపుల్ పాస్టర్ డాక్టర్ సతీష్ ,బిషప్ రూబెన్ మార్క్ తో పాటు క్రిస్టియన్ పెద్దలుపాల్గొన్నారు.



## మాజీ మంత్రి బిఆర్ఎస్ నాయకులు వి.శ్రీనివాస్ గౌడ్ పైన టిటిడి బోర్డు చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్న ప్రకటను వెంటనే వెనక్కి తీసుకోవాలి

- బీసీ నేత జాజుల లింగంగౌడ్ డిమాండ్



**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 21:**
తిరుమల కొండపైన తెలంగాణ భక్తులకు జరుగుతున్న అసౌకర్యలను ఇబ్బందులను మీడియా సమక్షంలో మాట్లాడినందుకు మాజీ మంత్రి బి ఆర్ ఎస్ నాయకులు వి.శ్రీనివాస్ గౌడ్ పైన టిటిడి బోర్డు చర్యలు తీసుకుంటామన్న బోర్డు ప్రకటనను వెంటనే వెనక్కి తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో ఎంతోమంది రాజకీయ పార్టీల నాయకులు రాజకీయాల గురించి తిరుపతిలో మాట్లాడారని బలహీన వర్గాల నాయకులు మాట్లాడితేనే రూల్స్ ఇతర వర్గాల వారు మాట్లాడితే వారికీ రూల్స్ వర్తించవా?? అని బీసీ సంక్షేమ సంఘం గా టిటిడి బోర్డ్ ను ప్రశ్నిస్తున్నాం.తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రిగా గతంలో తెలంగాణ ప్రజా ప్రతినిధులకు ఎదురైన ఇబ్బందులను వెలిబుచ్చినందుకు మాజీ మంత్రిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్న టిటిడి నిర్ణయం సరైనది కాదని టిటిడి బోర్డు నిర్ణయాన్ని తప్పుపట్టుతున్నం.

## సీపీఐ జాతీయప్రధాన కార్యదర్శి డి రాజాను కలిసిన తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర బృందం



**న్యూ ఢిల్లీ వెలుతురు న్యూస్ డిసెంబర్ 21:**
న్యూఢిల్లీ సీపీఐ జాతీయ కార్యాలయం అజయ్ కుమార్ గోష్ భవన్ లో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి,ఎంపీ రాజ్యసభ సభ్యులు డి రాజా,మరియు మాజీ రాజ్యసభ సభ్యులు అజీజ్ పాషా లను కలిసిన మేకపోతుల నరేందర్ గౌడ్ రాష్ట్ర అధ్యక్షులు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం, దేశవ్యాప్తంగా జరగబోయే జనాభా లెక్కలలో దేశవ్యాప్తంగా కులాల లెక్కలు చెయ్యలి,(దేశవ్యాప్త సమగ్ర కులగణన)జరిపించడానికి, బీజేపీ ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకు రావాలని కోరారు, అదేవిధంగా కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటుకొరకు,జాతీయ స్థాయి విద్య విధానంలో ఓబీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించే దిశగా నరేంద్ర మోదీ ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి, రాజా గారికి వినతిపత్రం అందజేశారు, ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర శ్రీహరి గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గిరగాని భిక్షపతి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## సంధ్య థియేటర్ తొక్కిసలాట లో మృతి చెందిన కుటుంబానికి 25 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించిన మంత్రి వెంకట్ రెడ్డి

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 21:**
సంధ్య థియేటర్ తొక్కిసలాటలో గాయపడి కిమ్స్‌లో చికిత్స పొందుతున్న శ్రీతేజ్ తండ్రి భాస్కర్ ను కలిసి 25 లక్షల రూపాయల చెక్కును కోమటి రెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ తరుపున రాష్ట్ర మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అందించారు, శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్ లను అడిగి మంత్రి తెలుసుకున్నారు, అలాగే శ్రీ తేజ్ కు మెరుగైన వైద్య చికిత్స అందించాలని ఆయన కోరారు,తన చికిత్సకు కోసం ఉపయోగపడే వైద్యం ప్రపంచంలో ఎక్కడ ఉన్న శ్రీ తేజ్ ను తీసుకెళ్తాం బ్రతికించుకుంటామని మంత్రి తెలిపారు,ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు బాలుడి వైద్య ఖర్చులను పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని మంత్రి తెలిపారు,భవిష్యత్తులో ఈ కుటుంబానికి అన్ని విధాలా ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి వెంకట్ రెడ్డి హామీ ఇచ్చారు, సోదరి రేవతి మరణం చాలా బాధాకరం.వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నానని మంత్రి వెంకట్ రెడ్డి తెలిపారు,



## ఓ ఆర్ ఆర్ పరిధిలోని 51 గ్రామాలను మున్సిపల్ లో విలీనం

### - మండలిలో పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుపై మంత్రి పొన్నం



(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 21:**
హైదరాబాద్ సమీపంలోని ఓ ఆర్ ఆర్ పరిధిలో ఉన్న 51 గ్రామ పంచాయతీలు,పట్టణ ప్రాంతాలకు దగ్గరగా ఉండి పట్టణ లక్షణాలు ఉన్న గ్రామాలు సమీపంలో ఉన్న మున్సిపల్ లో విలీనం చేయడం జరుగుతుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలో పట్టణ ప్రాంతాల్లో 80 గ్రామ పంచాయతీ లు మున్సిపాలిటీ లు గా ,మున్సిపల్ కార్పొరేషన్ లుగా మార్చడం జరుగుతుందన్నారు, సుప్రింకోర్టు ఆదేశాల మేరకు పంచాయతీ రాజ్ ఎన్నికలు జరపడానికి డెడికేటెడ్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి ప్రభాకర్ చెప్పారు, రాష్ట్ర ఎన్నికల సంఘం ట్రిబ్యునల్ సవరణ మేరకు పంచాయతీ రాజ్ చట్టం షెడ్యూల్ 8 లోనీ 140 పంచాయతీల సవరణ చేయడం జరిగిందని మంత్రి పేర్కొన్నారు,శాసన మండలి పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు పై మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు.51 గ్రామాల విలీనం పై పంచాయతీ రాజ్ చట్ట సవరణ చేయడం జరుగుతుందని మంత్రి ప్రభాకర్ తెలిపారు,రిజర్వేషన్ల పెంపు పై డెడికేటెడ్ కమిషన్ వేసాం.దాని వల్ల భవిష్యత్ లో రిజర్వేషన్ల అమలు ఇబ్బంది కూడా ఉండదని మంత్రి తెలిపారు, మా మేనిఫెస్టో లో 42 శాతం రిజర్వేషన్లు బీసీ లకు కేటాయిస్తమని చెప్పినట్లు చేస్తామన్నారు,మా నాయకుడు రాహుల్ గాంధీ చెప్పిన విధంగా జిత్ నా అబాధి ఉత్న ఇస్తాది ప్రస్తుతం సుప్రీం కోర్టు నిబంధనల్లో ఉన్న 50 శాతం రిజర్వేషన్లు పెంచడానికి రాజ్యాంగ సవరణ చేస్తామని మంత్రి ప్రభాకర్ ఈ సందర్భంగా చెప్పారు,సామాజిక అంశాల విషయంలో రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జరుగుతుంది దీనిద్వారా ఎవరెంతో వారికంత సామాజిక న్యాయం జరుగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు,పేదవారికి అన్యాయం జరగకుండా అక్రమంగా ఎవరైనా నిర్మాణాలు చేపడితే హైడ్రా చర్యలు తీసుకుంటుందన్నారు, భవిష్యత్ లో ఎలాంటి పరిస్థితి రాకుండా స్థానికులు ఆక్రమణకు గురైన సమాచారాన్ని ఇవ్వాలని మంత్రి సూచించారు,సామాజిక రిజర్వేషన్లు పై 50 శాతం నిబంధనలు ఎత్తివేసి రిజర్వేషన్లు పెంచాలని ప్రభుత్వం భావిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు,

## ఓబీసీల సమస్యలపై డిల్లీలో జాతీయ ఓబీసీ, కమిషన్ ను కలిసిన బీసీ నేతలు

### అనంతుల రామ్మూర్తి గౌడ్, పి బడే సాహెబ్,




న్యూఢిల్లీ వెలుతురు డిసెంబర్ 21:
దేశంలో ఓబీసీల సమస్యలపై ఎవరు నోరు మెదపడం లేదని ఓబీసీల విషయానికి రాగానే నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవ రిస్తున్నారని దానికి ఉదాహరణే మొన్న జరిగిన పార్లమెంటరీ సమావేశాల్లో దేశవ్యాప్త కుల జనన గణన గురించి ఒక్క ఎంపీలు మంత్రులు నాయకులు ఎవ్వరు కూడా మాట్లాడకపోవడం పార్లమెంట్లో చర్చ జరగకపోవడం అనేది యావత్ బీసీ సమాజానికి అన్యాయం చేసినట్లే అని రామ్మూర్తి గౌడ్ బడేసాబ్ లు ఆరోపించారు దేశంలో ఓబీసీలకు జరుగుతున్న అన్యాయాలపై ఇకనైనా ప్రధాన పార్టీలైన బిజెపి కాంగ్రెస్ కమ్యూనిస్టు జాతీయ పార్టీలు రాష్ట్రీయ పార్టీలు కూడా ముకుమ్మడిగా నడుం బిగించాలని డిమాండ్ చేశారు కేంద్రంలో ఓబీసీలకు తక్షణమే మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, దేశవ్యాప్త కుల జనన,గణన, జరగాలని లేనిపక్షంలో దేశవ్యాప్త ఉద్యమాలు చేపడతామని, దేశంలో ఉన్న యూనివర్సిటీలలో ఓబీసీ విద్యార్థులకు ఫెలోషిప్లు మంజూరు చేయాలని ఐఐటి, ఐఐఎం, నీట్, తదితర ప్రొఫెషనల్ చదువులలో పూర్తి రియాంబర్స్మెంట్, ప్రభుత్వాలే మంజూరు చేయాలని, ర్యాంకు నిబంధన లేకుండా ఓబీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ మంజురు చేయాలని, ప్రైవేటు ఉద్యోగాల్లో కూడా ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, తదితర అంశాలపై జాతీయ బిసి కమిషన్ చైర్మన్ ను కలిసిన విద్యార్థి యువజన సంఘాల అధ్యక్షులు మరియు నాయకులు పాల్గొన్నారు

## పాడి కౌశిక్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన రంగారావు...



**కూకట్ పల్లి డిసెంబర్ 21 వెలుతురు:**
హుజురాబాద్ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి జన్మదిన సందర్భంగా మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు శనివారం శేర్లింగంపల్లి నియోజకవర్గ ముఖ్య నాయకులతో కలసి కొండాపూర్ లోని కౌశిక్ రెడ్డి నివాసంలో వారిని మర్యాదపూర్వకంగా కలిసి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## నీటి సంఘాల ఎన్నికలు చెంపపెట్టు

### మంత్రి నిమ్మల రామానాయుడు

**అమరావతి,డిసెంబర్21( వెలుతురు):**
ఆరేళ్ల తర్వాత నిర్వహించిన సాగు నీటి సంఘాల ఎన్నికల్లో అన్నదాతలకు అఖండ విజయం చేకూరిందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఐదేళ్లపాటు నీటిపారుదల రంగాన్ని నిర్వీర్యం చేసిన జగన్, అయన పార్టీకి ఈ ఎన్నికలు ఒక చెంపపెట్టు లాంటివని వ్యాఖ్యానించారు.కూటమిలోని అన్ని పార్టీల ఐఖ్యతకు అన్నదాతలు ఏకపక్షంగా మద్దతు పలికారన్నారు.

# సంపాదకీయం..

## ఇ.వి.ఎం లు కాదు .. అసలు సమస్య తెలుసుకోవాలి

ఇ.వి.ఎంలపై సుప్రీంకోర్టులో మరో వ్యాజ్యం దాఖలయింది. దీనిపై జనవరి 20వ తేదీతో ప్రారం భమయ్యే వారంలో విచారణ జరగనుంది. న్యాయమూర్తి జస్టిస్ దీపాంకర్ దత్తా ఆధ్వర్యంలోని బెంచ్ విచారణ జరుపుతుందని శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం ప్రకటించింది. ఇదే తరహా ఉపశమనం కోరుతూ దాఖలైన పిటిషన్‌లను కోర్టు గతంలో తిరస్కరించిన విషయం తెలిసిందే. ఎన్నికల్లో తిరిగి బ్యాలెట్ పత్రాలను ప్రవేశపెట్టాలన్న పిటిషన్‌ను జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం ఏప్రిల్‌లో తిరస్కరించిన సంగతి కూడా తెలిసిందే. మరోవైపు, ఎన్నికల విధానాలు, ఈవీఎంల స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్లలో అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ పార్టీ, దాని మిత్రపక్షాలు ఆరోపిస్తున్నాయి. వాస్తవానికి, ఎన్నికల్లో ఓడిపోయిన ప్రతిసారి కాంగ్రెస్ పార్టీ ఈ అంశాన్ని తెరమీదకు తెస్తోంది. ఇటీవల హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా పరాజయం పాలైన తర్వాత కూడా అదే జరగుతోంది. ఇ.వి.ఎం గురించి తన ఆందోళనా స్వరాన్ని పెంచింది. అయితే, ఎన్నికల సమగ్రతకు సంబంధించి ఈవీఎం అంశం ఒక్కటే లేదు. ఇంకా చాలా అంశాలున్నాయని కాంగ్రెస్ తెలుసుకోవాలి. వాటి పట్ల భారత ఎన్నికల సంఘం స్వచ్ఛంగా వుండాల్సిన అవసరముంది. వీటిపై మాట్లాడాల్సిన అవసరం చాలా ఉంది. వాస్తవానికి ఇ.వి.ఎం లను ఎలక్ట్రానిక్ ట్యాంపరింగ్ చేసే ముప్పు ఈ జాబితాలోకి రాదు. కాంగ్రెస్ ఓ తప్పుడు అంశంపై గొంతెత్తుతోంది. అది కూడా ఎంపిక చేసుకున్న అంశాలపైనే, అందులోనూ ఓడిపోయిన వాటిపైనే మాట్లాడుతోంది. ఇ.వి.ఎం లకు సంబంధించి అవకతవకల ముప్పు వుందని సూచించేలా పరోక్షంగా లేదా ముందుగానే ప్రోగ్రామింగ్ చేయడం ద్వారా ట్యాంపరింగ్ జరిగి వుంటుందన డానికి ఎలాంటి ఆధారాలు లేవని కాంగ్రెస్ నేతలే కొందరు బహిరంగంగా అభిప్రాయపడ్డారు. ఇద్దరు ప్రతిపక్ష నేతలు నేషనల్ కాన్ఫరెన్స్ నేత, జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, తృణమూల్ కాంగ్రెస్ నేత అభిషేక్ బెనర్జీ కూడా ఈ ఆరోపణలతో తమకు సంబంధం లేదని విడగొట్టుకున్నారు. ఇ.వి.ఎం లలో చాలా కచ్చితంగా, తెలివిగా అవకతవకలకు పాల్పడ్డారని భావించేందుకు వీల్లేదు. ఎందుకంటే, కొన్ని రాష్ట్రాల్లో బిజెపి విజయం సాధించింది, మరికొన్ని రాష్ట్రాల్లో ఓడిపోయింది. కాబట్టి ఇక్కడ ఆ లాజిక్ పని చేయడం లేదు. ఇదంతా కాకపోయినా 2024 సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి సంపూర్ణ మెజారిటీని సాధించలేకపోయింది. పైగా, ఈ ఫలితాలన్నీ మరీ ముఖ్యంగా హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్ ఫలితాలు సామాజిక, రాజకీయ సమీకరణలు ఎలా పనిచేసినవో సరిగానే వివరించాయి.ఇ.వి.ఎం లలో అవకతవకల గురించి పదే పదే లేవనెత్తడం ద్వారా ఎన్నికల సమగ్రతకు సంబంధించిన నిజమైన, తీవ్రమైన అంశాలు వెనక్కి పోతున్నాయి. ప్రతిపక్షాల పోలింగ్ ఏజెంట్లు లేని పోలింగ్ బూత్‌లలో, ఒక పార్టీ ఆధిపత్యమే వున్న చోట ఇ.వి.ఎం లను ఎత్తుకుపోవడానికి గల అవకాశాలనేవి వాటిలో ఒకటి. పోలింగ్ ముగిసే సమయంలో చాలా చోట్ల పెద్ద ఎత్తున ఓటింగ్ శాతం నమోదు కావడంపై ప్రశ్నలు తలెత్తుతున్న నేపథ్యంలో ఇది సందర్భోచితమైన అంశంగా వుంది. ఈ ధోరణిని ఎన్నికల కమిషన్ సంతృప్తికరమైన రీతిలో వివరించడం లేదు. దీనికి తోడు పెద్ద ఎత్తున ఓటర్ల పేర్లు నమోదు కావడం, తొలగించడమనేది కూడా ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోన్న ధోరణిగా వుంది. ఎన్నికల కమిషన్ దీన్ని పెద్దగా పట్టించుకోనట్లు కనిపిస్తోంది. ఫిబ్రవరిలో ఎన్నికలు జరగనున్న ఢిల్లీలో, ముస్లిం ఓటర్ల పేర్లను ఎంపిక చేసి మరీ తొలగించినట్లు ఆరోపణలున్నాయి. యు.పి ఉప ఎన్నికల్లో, బిజెపికి వ్యతిరేకంగా ఓటు వేస్తారని ఊహించిన ఓటర్లను నిలువరించేందుకు పోలీసులు పక్షపాతంతో వ్యవహరించడం వివాదాస్పదమైంది. ఇక ఎన్నికల షెడ్యూలు అనేది మరో తీవ్రమైన అంశం. ఎన్నికల కమిషన్ దీనిపై పారదర్శకంగా వ్యవహరించడం లేదు. దేశంలో, రాష్ట్రాల్లో ఒకేసారి ఎన్నికలను నిర్వహించేందుకు సమాయత్తమవుతున్న దేశం ఇటీవల మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను రెండు విడతలుగా నిర్వహించింది. దీనివల్ల లబ్ధి పొందింది బిజెపి మాత్రమే. ఈ అంశాల్లో కొన్ని స్థానికమైనవి, మరికొన్ని బిజెపి, ప్రతిపక్షం మధ్య గల సామర్థ్య అంతరం భారీగా వుండడానికి సంబంధించినవి. మరికొన్ని ఎన్నికల కమిషన్ కోర్టులో వున్నవి. ఎన్నికల సమగ్రతకు సంబంధించిన వాస్తవిక అంశాలపై ప్రతిపక్షం దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం వుంది. అంతేకానీ ఇ.వి.ఎం లపై భయాలు ఈ వాస్తవిక అంశాలను మరుగుపరిచేవిగా వుండకూడదు.

## అసెంబ్లీ లో పుష్ప వివాదం


### - సిఎం రేవంత్ ఫైర్!



**హైదరాబాద్, డిసెంబర్ 21 వెలుతురు:** 'పుష్ప-2' బెనిఫిట్ షో సందర్భంగా హైదరాబాద్ సంధ్య థియేటర్ తొక్కిసలాటలో మహిళ మృతి కేసుకు సంబంధించి అల్లు అర్జున్ అరెస్ట్ ఎంత సెన్సేషన్ క్రియేట్ చేసిందో తెలిసిందే. ఈ విషయంలో విమర్శలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే ఒక చర్చా వేదికలో దీటుగా సమాధానం చెప్పారు. తాజాగా అసెంబ్లీలో సైతం ఈ అంశం చర్చకు వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి ప్రభుత్వం ప్రకటన చేయాలని ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ కోరగా.. ముఖ్యమంత్రి కొంచెం సుదీర్ఘంగానే మాట్లాడారు. ఈ కేసు విషయం పై ముఖ్యమంత్రి తన ప్రసంగంలో ఏమన్నారంటే..“సంధ్య థియేటర్ ఘటన అసెంబ్లీలో చర్చకు వస్తుందని అనుకోలేదు. సభ్యులు ఈ విషయంపై ప్రస్తావించారు కాబట్టి నేను స్పందించాల్సి వస్తోంది. ఈ వ్యవహారం ప్రస్తుతం దర్యాప్తు దశలో ఉన్నందు వల్ల పెద్దగా మాట్లాడకూడదు. ఇలా చేస్తే దర్యాప్తు అధికారి ఇబ్బందుల్లో పడతారు. డిసెంబరు 2న చిక్కడపల్లి పోలీస్ స్టేషన్లో సంధ్య థియేటర్ యాజమాన్యం దరఖాస్తు చేసింది. ఈ నెల 4న 'పుష్ప-2' సినిమా ప్రదర్శనకు హీరో హీరోయిన్లు, మరికొందరు థియేటర్‌కు వస్తున్నారని, బందోబస్తు కావాలని అడిగారు. మరుసటి రోజు పోలీసులు థియేటర్‌కు లిఖిత పూర్వక సమాధానం పంపారు. సంధ్య థియేటర్ పరిసరాల్లో రెస్టారెంట్లు, ఇతర థియేటర్లు ఉన్నాయి. సెలబ్రెటీలు వస్తే జనాన్ని అదుపు చేయడం కష్టమవుతుంది. కాబట్టి సెక్యూరిటీ ఇవ్వడం సాధ్యం కాదని చెప్పారు. హీరో హీరోయిన్లు ఎవరైనా వస్తే థియేటర్‌కు అనుమతి ఇవ్వొద్దని.. దరఖాస్తును తిరస్కరిస్తున్నామని చెప్పారు. అయినా సరే ప్రిమియర్ షోకు అల్లు అర్జున్ వచ్చారు. నేరుగా థియేటర్‌కు వచ్చి సినిమా చూసి వెళ్లిపోతే ఈ ఘటన జరిగేదో లేదో నాకు తెలియదు. కానీ క్రాస్ రోడ్డు నుంచి కారులో రూఫ్ టాప్ మీదికి ఎక్కి చేతులు ఊపుతో సంధ్య థియేటర్‌కు చేరుకున్నారు. అప్పుడు హీరోను చూడాలని అభిమానులు థియేటర్ నుంచి తోసుకుంటూ బయటికి వచ్చారు. హీరో కారును లోపలికి పంపించేందుకు గేటు తెరవగా.. వందల మంది అభిమానులు లోపలికి వచ్చే ప్రయత్నం చేశారు. అప్పుడే తొక్కిసలాట జరిగి రేవతి అనే మహిళ చనిపోయింది. ఆమె కొడుక్కి బ్రెయిన్ డ్యామేజ్ అయింది. చికిత్స జరుగుతోంది. ఆ సమయంలో పరిస్థితి అదుపు దాటుతోందని, వెళ్లిపోవాలని అల్లు అర్జున్‌కు పోలీసులు చెప్పాలని ప్రయత్నించారు. కానీ అతను మాత్రం సినిమా చూసే వెళ్తానని అన్నట్లు సిటీ కమిషనర్ నాతో చెప్పారు. ఎలాగోలా పోలీసులు బలవంతంగా అతణ్ని అక్కడి నుంచి పంపించాలని చూస్తే.. మరోసారి రూఫ్ టాప్ ద్వారా చేతులు ఊపుతూ వెళ్లారు. మహిళ చనిపోయింది, ఆమె కొడ్కు పరిస్థితి విషమంగా ఉందని తెలిసీ అదే పద్ధతి కొనసాగించారు” అని ముఖ్యమంత్రి వివరించారు.

# శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్

## భారత దేశానికి చెందిన ప్రముఖ గణిత శాస్త్రవేత్త



శ్రీనివాస అయ్యంగార్ రామానుజన్ జయంతి సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న గణిత శాస్త్రవేత్తలకు ప్రేరణ అని చెప్పుకోవచ్చు. ఆయనకు ప్రత్యేకంగా గురువులు ఎవరూ లేరు. సొంతంగా చదువుకొని ప్రపంచం గర్వించే స్థాయికి ఎదిగారు.

మహా మేధావులు కూడా సాధించలేని సమస్యలను అలవోకగా ఎలాంటి పుస్తకాల సాయం లేకుండా సాధించి, ప్రపంచం దృష్టిని తనవైపు తిప్పుకున్న భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్.

20వ శతాబ్దంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గొప్ప గణిత మేధావులలో ఒకరు. పది సంవత్సరాల వయసులోనే గణిత శాస్త్రంతో అనుబంధం ఏర్పరుచుకొని గణితం పట్ల ఆశక్తిని పెంచుకొని త్రికోణమితి మీద రాసిన పుస్తకాలను చదివి పూర్తిగా అవగాహన చేసుకొని, పదమూడు సంవత్సరాలు నిండే సరికల్లా ఆ పుస్తకాన్ని పరిపూర్ణంగా అర్థం చేసుకొని, సొంతంగా సిద్ధాంతాలు కూడా తయారు చేయడం ప్రారంభించే స్థాయికి ఎదిగిన ప్రజ్ఞావంతుడు రామానుజన్.

అపారమైన మేధస్సుతో భారతదేశపు కీర్తిని ప్రపంచ గణిత శిఖరాలపై ఎగురవేసిన మహాగణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్. 1887 డిసెంబర్ 22న తమిళనాడులోని ఉత్తర అర్కాట్ జిల్లా ఈరోడ్‌లో ఒక నిరుపేద కుటుంబంలో జన్మించిన రామానుజన్ పన్నెండేళ్ల వయసులోనే గణితంలో అసాధారణ బాలునిగా గుర్తింపు పొందారు. రామానుజన్ 'ఆయిలర్' సూత్రాలు, త్రికోణమితికి చెందిన అనేక సమస్యలను సులువుగా సాధించి చూపేవారు. కుంభకోణం గవర్నమెంటు కాలేజీలో చేరిన రామానుజన్ గణితం మీదే శ్రద్ధ చూపి మిగిలిన సబ్జెక్టులపై దృష్టి పెట్టకపోవడంతో ఎఫ్.ఎ. పరీక్ష తప్పారు. ఆ తరువాత మద్రాస్‌లోని పచ్చయ్యప్ప కాలేజీలో చేరారు.

అక్కడ గణితోపాధ్యాయునిగా ఉన్న ఎన్. రామానుజాచారి గణిత సమస్యలను కఠినమైన పద్ధతిలో పరిష్కరించి చూపుతుంటే, రామానుజన్ వాటిని తనదైన రీతిలో తక్కువ సోపానాలతో సాధించేవారు. రామానుజన్ ప్రతిభను గమనించిన ప్రొఫెసర్ సింగారవేలు ముదలియార్, రామానుజన్‌తో కలిసి మ్యాథమెటికల్ జర్నల్స్‌లో క్లిష్టమైన సమస్యలను చర్చించి సాధిస్తుండేవారు. మ్యాజిక్ స్క్వేర్స్, కంటిన్యూడ్ ఫ్రాక్షన్స్, ప్రధాన సంఖ్యలు, పార్టిషన్ ఆఫ్ నంబర్స్, ఎలిప్టిక్ ఇంటిగ్రల్స్ వంటి విషయాలపై రామానుజన్ విశేష పరిశోధనలు చేశారు.

15 ఏళ్ళకే రామానుజన్‌లోని తెలివితేటలను ప్రపంచానికి చాటడానికి దోహదం చేసిన గ్రంథం జార్జ్ స్క్యూచ్‌సిడ్జ్‌కార్ రాసిన 'సినాప్సిస్'. అందులో ఆల్‌జీబ్రా, అనలిటికల్ జామెట్రీ వంటి విషయాల మీద దాదాపు 6165 సిద్ధాంతాలున్నాయి. వీటి నిరూపణలు చాలా కష్టంగా ఉండేవి. పెద్దపెద్ద ప్రొఫెసర్‌లు సైతం అర్థం చేసుకోలేకపోయిన ఈ సిద్ధాంతాలను, సూత్రాలకు రామానుజన్ ఎటువంటి పుస్తకాలను తిరగేయకుండా వాటి సాధనలను అలవోకగా కనుక్కునేవారు. అప్పటికే అందులో చాలా సమస్యలు నిరూపించబడ్డాయన్న విషయం ఆయనకు తెలియకపోవడం చేత వాటిని తన పద్ధతితో సాధించి చూపారు.

కానీ శ్రీనివాసన్ రామానుజన్ మరణానంతరం అంతటి ప్రతిభ గల గణితశాస్త్ర వేత్తలను భారతదేశం తయారు చేసులేకపోవడం దురదృష్టకరం. మానవ నాగరికత చరిత్రకు గణితాన్ని పరిచయం చేసిన ఆర్యభట్ట, భాస్కరుడు.... ఆ తదనంతరం రామానుజన్ వంటి గణిత మేథావుల పరంపర ఆ తరువాత కొనసాగలేదు. భవిష్యత్తులోనైనా ఈ లోటును నేటి విద్యార్థి లోకం భర్తీ చేయగలదని భావిద్దాం.



ఆలేటి రమేశ్

8186867999.

# టెక్నాలజీ బంధాలను దూరం చేస్తోందా?

**హైదరాబాద్, డిసెంబర్ 21 వెలుతురు:** టెక్నాలజీ బంధాలను బలోపేతం చేస్తోందా, మనుషులను దూరం చేస్తోందా అనేది మిలియన్ డాలర్ ప్రశ్న. ఆధునిక టెక్నాలజీ ప్రపంచాన్ని అరచేతిలో పెట్టేస్తోంది. కానీ, మన చిన్న ప్రపంచాన్ని మాత్రం కొన్ని మైళ్ల దూరానికి తీసుకుపోతోంది. మునపటి తరానికి ప్రస్తుత తరానికి ఆలోచనలు, ఆచరణలో చాలా తేడా వుంది. దీనికి ప్రధాన కారణం టెక్నాలజీ అని చెప్పవచ్చు. తరానికి తరానికి మధ్య ఈ తేడా ఉండటం సహజమే కానీ. కానీ ఈ సహస్రాబ్ది జనరేషన్ స్పీడ్ మామూలుగా లేదు. పాతిక, ముప్పయ్ ఏళ్ల క్రితం మొబైల్ ఫోన్లు లేవు, స్కూలు, కాలేజీ నుంచి ఇంటికి వచ్చి అమ్మా నాన్నలతోనే గడిపేవారు. ఇప్పటిలా ఇంట్లో వేర్వేరు గదులు లేవు. హాల్‌లోనే చదువులు ఉండేవి. పిల్లలు రహస్యంగా ఏ పని చేయాలన్నా కష్టంగానే ఉండేది. తల్లిదండ్రులు, ఇంట్లో పెద్దవాళ్లు ఓ కంట కనిపెట్టేవారు. పిల్లలు తల్లిదండ్రుల మాటకు చాలా విలువ ఇచ్చేవాళ్లు. కానీ ఇప్పుడు, 13, 14 ఏళ్లకే పిల్లల చేతికి మొబైల్ ఫోన్ వస్తోంది. స్కూలులో పాఠాలు నేర్చుకోవడానికి, రీసెర్చ్‌కి మొబైల్ ఫోన్ లేకపోతే ఎలా అని అడగడంతో, తోటి పిల్లల దగ్గర ఎక్కడ తక్కువైపోతారో, చదువులో ఎక్కడ వెనకబడిపోతారో అనే భయంతో తల్లిదండ్రులు పిల్లల చేతిలో స్మార్ట్ ఫోన్ పెట్టక తప్పట్లేదు. మొబైల్ చేతిలోకొచ్చాక వాళ్ల స్నేహాలు ఎవరితో ఎలా ఉంటున్నాయో అంచనా వేయలేరు.సైబర్ నేరాలు, సైబర్ మోసాలు, ఆడపిల్లలను మోసం చేయడం, అపరిచితులతో స్నేహాలు, డేటింగ్ ఇవన్నీ మొబైల్ ఫోన్ల వల్ల పెరుగుతున్నాయి. టెక్నాలజీ చేతుల్లోకి రాగానే, ప్రపంచం చేతుల్లోకి వచ్చేసింది. గత తరంలో పిల్లలు తమకు తెలియని విషయాల గురించి పెద్దవాళ్లను ప్రశ్నలు అడిగేవారు. ఇప్పుడు గూగుల్ తల్లిని అడుగుతున్నారు. ఫోన్లు, టీవీలు పిల్లలకు ఫ్రెండ్స్‌గా మారిపోయాయి. ఇంటికి చుట్టాలు, స్నేహితులు వస్తే, వాళ్లతో గడపడానికి, కనీసం ఐదు నిమిషాలు పలకరించేందుకు కూడా ఈ తరం పిల్లలకు ఓపిక ఉండటం లేదు. అవతలి వ్యక్తులు మాట్లాడుతుంటే, వీళ్లు ఫోన్లు చూసుకుంటూ, ఇంటికొచ్చిన వారి పట్ల నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇది పేరెంట్స్ పెంపకం తప్పో, టెక్నాలజీ తప్పో అర్థం కాని పరిస్థితి. ఇక, ఇంట్లో అందరూ కలిసి భోజనం చేసే సంస్కృతి ఎప్పుడో పోయింది. దీంతో, కుటుంబ సభ్యుల మధ్య మాటలే కరువయ్యాయి. డబ్బులు కావాలంటే మాత్రం ప్రేమగా ఓ ఐదు నిమిషాలు మాట్లాడతారు. ప్రతి బంధాన్నీ ఓ డీల్‌లా చూడటం అలవాటైపోయింది. మానవ సంబంధాలు యాంత్రికంగా మారిపోయాయి. అసాధారణ ప్రవర్తనను ఈ జనరేషన్ సాధారణం చేశారు. ఐతే, ఈ తరం వారు దీర్ఘ కాలంలో ఒత్తిడికి, అసహనానికి లోనయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. క్షణకాలపు ఆకర్షణలో ఏర్పడే పరిచయాలకు శాశ్వతత్వం ఉండదు. ఆన్‌లైన్ చాట్‌లు, కొన్ని రోజులు గడిపిన తర్వాత గొడవలు సాధారణం అయ్యాయి. సైబర్ సైకాలజీ, బిహేవియర్ అండ్ సోషల్ నెట్ వర్కింగ్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనంలో ఆన్‌లైన్‌లో కలిసిన జంటల సంబంధాలు ఆఫ్‌లైన్‌లో కలిసిన వారి కంటే భిన్నంగా ఎలా ఉంటాయనే అంశాలను పరిశీలించింది.ఈ అధ్యయనంలో ఆన్‌లైన్ డేటింగ్‌లో ఏర్పడే సంబంధాలు విఫలమవుతాయని, బలహీనంగా ఉంటాయని చెప్పడం తప్పు అని అధ్యయనకారులు పేర్కొన్నారు. నేటి యువత సంబంధాలను ఏర్పరచుకోవడంలో, నిర్వహించడంలో టెక్నాలజీ కీలకమైన మార్పులు తీసుకువచ్చింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ లాంటి సోషల్ మీడియా ఎ÷-లాట్ ఫారాలు వాట్సాప్, సిగ్నల్ లాంటి మెసేజింగ్ అప్లికేషన్లు తక్షణ కనెక్టివిటీని అందిస్తున్నాయి. దూరంతో సంబంధం లేకుండా సులువుగా కమ్యూనికేట్ చేయడానికి, కొత్త స్నేహాలను ఏర్పరచుకోవడానికి సహాయపడుతున్నాయి.మరోవైపు ఈ కనెక్టివిటీని అధికంగా ఉపయోగించడం నిజమైన బంధాలకు ఆటంకంగా మారవచ్చు. ఒంటరితనం, అసంతృప్తికి కారణం కావచ్చు. మితిమీరిన స్క్రీన్ టైం వంటి అంశాలు ముఖాముఖి సంబంధాలను తగ్గిస్తాయి. దీనివల్ల సోషల్ స్కిల్స్, ఎమోషనల్ స్కిల్స్ మందగించవచ్చు. కాబట్టి, టెక్నాలజీని బ్యాలెన్స్‌గా వాడుకోవాలని యువత గుర్తించాలని అంటున్నారు సైకాలజిస్టులు.



# కేటీఆర్‌కు చెక్ పెట్టేందుకు హరీశ్‌ను వాడుకుంటున్నారా?

**హైదరాబాద్, డిసెంబర్ 21 వెలుతురు:** సిఎం రేవంత్ రెడ్డి కేటీఆర్- హరీశ్‌రావు మధ్య చీలిక తెచ్చే ఆట మొదలు పెట్టారా? హరీశ్ రావుతోనే కేటీఆర్‌కు చెక్ పెట్టే ప్లాన్ వేస్తున్నారా? అసెంబ్లీ సాక్షిగా రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దేనికి సంకేతం? హరీశ్‌రావు కోరిక మేరకే ఒఆర్‌ఆర్ లీజ్ టెండర్ల విచారణ జరిపిస్తున్నారా.? రేవంత్ వాఖ్యల వెనుక వ్యూహం అదేనంటూ పొలిటికల్ సర్కిల్స్‌లో పుకార్లు చక్కర్లు కొడుతోంది.. ఏడాది క్రితం వరకు తిరుగులేని పార్టీగా ఉన్న బీఆర్ఎస్ ఇప్పుడు అష్టకష్టాలను ఎదుర్కొంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాజయం, ఆ తర్వాత ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వలసలు.. వరుస ఎదురుదెబ్బలతో గులాబీ పార్టీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. మూలిగే నక్కపై తాటిపండు పడినట్లు కేసులు, విచారణలు కూడా విరుచుకుపడుతున్నాయి. గులాబీ బాస్ కేసీఆర్ విశ్రాంతి తీసుకుంటున్నారు. పీకల్లోతు కష్టాల్లో ఉన్న కారు స్టీరింగ్‌ను కేటీఆర్ తన చేతుల్లోకి తీసుకున్నారు. ఇంతలో ఈ-కారు రేస్ కేసు స్పీడ్ బ్రేకర్‌లా అడ్డొచ్చిపడింది. ఈ-కారు రేసును మించిన వేగంతో కేసు దర్యాప్తు మొదలైంది.. కేటీఆర్‌ను ఎ-1 గా చేర్చి ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేసింది ఏసీబీ. మరోవైపు ఈడీ కూడా రంగంలోకి దిగి వివరాలు ఇవ్వాలంటూ ఏసీబీకి లేఖ పంపించింది. ఈ పరిణామాలు చూస్తుంటే.. ఏ క్షణంలోనైనా కేటీఆర్ అరెస్ట్ కావచ్చనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఓ వైపు ఈ-కారు రేస్ కేసు రైజింగ్‌లో ఉన్న టైమ్‌లో హఠాత్తుగా ఔటర్‌రింగ్ రోడ్డు లీజు టెండర్ల అంశం తెరపైకి రావడంతో రాజకీయాలు మరింత వేడెక్కాయి. ఔటర్ రింగ్ రోడ్డును గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం 7వేల కోట్ల రూపాయలకు ఓ ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టిందని కాంగ్రెస్ సర్కార్ ఆరోపిస్తోంది. ఈ అంశంపై విచారణ జరిపిస్తామని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడంతో ఇది ఎక్కడికీ దారితీస్తోందోనన్న చర్చ జరుగుతోంది. ఒ.ఆర్.ఆర్ లీజ్ టెండర్లపై విచారణ జరిపిస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి పదే పదే హరీశ్‌రావు పేరును ప్రస్తావించడమే బిగ్ డిబేట్ పాయింట్‌గా మారింది. హరీశ్‌రావు కోరిక మేరకే ఒ.ఆర్.ఆర్ టెండర్లపై సిట్ విచారణ జరిపిస్తామని నొక్కి మరీ చెప్పడం వెనుక రేవంత రెడ్డి ఆంతర్యమేంటనే చర్చ పొలిటికల్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది.. ఓఆర్ఆర్ లీజుపై అభ్యంతరాలుంటే.. రద్దు చేయండని హరీశ్‌రావు కామెంట్ చేస్తే.. హరీశ్‌రావు కోరిక మేరకు విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి చెప్పడంలో ఏదో స్టాటజ్రీ ఉందనే అనుమానాలు బీఆర్ఎస్ కేడర్‌ను వెంటాడుతున్నాయి. సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గతంలో చేసిన వ్యాఖ్యల్ని రాజకీయ వర్గాలు గుర్తు చేసుకుంటున్నాయట. తెలంగాణలో కేసీఆర్ ఉనికి లేకుండా చేస్తామని.. కేసీఆర్‌ను రాజకీయంగా మర్చిపోయేలా చేస్తామని రేవంత్ రెడ్డి చాలాసార్లు అన్నారు. హరీశ్‌రావును వాడుకొనే కేటీఆర్‌కు చెక్ పెడతామని హింట్ కూడా ఇచ్చారు. ఇప్పుడు హరీశ్‌రావు కోరిక మేరకే అని అనడంతో.. అప్పటి రేవంత్ మాటల్ని రివైండ్ చేసుకుంటున్నారట. చెప్పినట్టే.. హరీశ్‌రావును వాడుకొని రేవంత్ తన పొలిటికల్ గేమ్ స్టార్ట్ చేశారనే చర్చ ఊపందుకుంది. బావ-బావమరుదులకు మధ్య మనస్పర్థలు సృష్టించే రాజకీయ చదరంగాన్ని సీఎం రేవంత్ రెడ్డి మొదలు పెట్టారన్న టాక్ వినిపిస్తోంది. ఔటర్‌రింగ్ రోడ్డు లీజ్ టెండర్లు హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో జరిగాయి. అప్పుడు కూడా మున్సిపల్ శాఖ మంత్రిగా కేటీఆర్ ఉన్నారు. కాబట్టి ఒ.ఆర్.ఆర్ టెండర్ల తీగ లాగితే.. అది మళ్లీ కేటీఆర్‌కే ఉచ్చులా బిగుసుకునేలా చేస్తుందని టాక్.

## రావి నారాయణరెడ్డి చౌరస్తా లో
# అమిత్ షా దిష్టి బొమ్మ దగ్ధం



**వెలుతురు, హయత్ నగర్, డిసెంబర్ 21:**
సిపిఐ పార్టీ రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్టు మండల సమితి ఆధ్వర్యంలో శనివారం రావి నారాయణరెడ్డి చౌరస్తా వద్ద కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై లోక్ సభలో అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కేంద్ర మంత్రి గా కొనసాగే నైతిక హక్కు అమిత్ షా కు లేదని అమిత్ షా ను బర్తరఫ్ చేయాలి డిమాండ్ చేస్తూ తన దిష్టిబొమ్మను దగ్ధం చేశారు ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి,రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాది రెడ్డి ,జిల్లా కార్యవర్గ సభ్యులు, సిపిఐ పార్టీ స్థానిక కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ అజ్మీర హరిసింగ్ నాయక్, కౌన్సిల్ మరియు పార్టీ కార్యవర్గ సభ్యులు, భూ పోరాటా కమిటీ సభ్యులు, మహిళా సమైక్య నాయకురాలు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో వాహనం నడిపి ఒక మహిళ మరణానికి కారణమైన వ్యక్తికి జైలు శిక్ష



**శంకర్ పల్లి వెలుతురు డిసెంబర్ 21**
మద్యం మత్తులో వాహనం నడిపి ఒక మహిళ మరణానికి కారణమైన కావలి అనిల్ కుమార్ వయసు 24 సంవత్సరాలు నవపేట్ మండలం మాదారం గ్రామస్తుడు అనే వ్యక్తికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష మరియు 10 వేల రూపాయల నగదు జరిమానా విధించడం జరిగింది. 2021లో చేవెళ్ల మండలం కందవాడ గ్రామస్తుడైన ఫిరంగి రవి అనే వ్యక్తి తన భార్య అయిన ఫిరంగి లక్ష్మీతో శంకర్ పల్లికి వచ్చి ఆసుపత్రికి చూయించుకొని తిరిగి చేవెళ్ల వెళ్తుండగా నిందితుడు మద్యం సేవించి రామంతపూర్ శివారులో తన బైక్ ని అతివేగంగా మరియు అజాగ్రత్తగా నడుపుతూ ముందుగా వెళుతున్న ఫిర్యాదు యొక్క బైక్ ని యాక్సిడెంట్ చేయడం వల్ల ఫిర్యాది భార్య అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది, ఇట్టి కేసు విచారణ అనంతరం ఎల్బీనగర్ 9వ జిల్లా సెషన్స్ కోర్టు జడ్జ్ శ్రీమతి గౌరవ హరీష గారు నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష మరియు పదివేల రూపాయల జరిమానా విధించడం జరిగింది. ఈ కేసు విచారణ మరియు దర్యాప్తులో బాగా పనిచేసిన సిబ్బందిని అభినందిస్తూ వారికి రివార్డు ప్రకటించడం జరిగిందని శంకర్పల్లి సిఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడపరాదని మరియు మద్యం మత్తులో వాహనం నడిపి ఇతరుల ప్రాణాలకి హాని కలిగించినచో చట్ట ప్రకారం చాలా కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## మన్మర్రి పాఠశాలలో తెలంగాణ ఆహార మహోత్సవం



**చేవెళ్ళ వెలుతురు డిసెంబర్ 21**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలనుసారం చేవెళ్ళ నియోజకవర్గం షాబాద్ మండలంలోని ప్రాథమిక పాఠశాల మన్మరిలో తెలంగాణ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా విద్యార్థులు, మరియు వారి తల్లిదండ్రుల భాగస్వామ్యంతో ఇంటిదగ్గర తయారు చేసుకొని తెచ్చిన వివిధ రకాల పిండి పదార్థాల, మాంసకృతుల, పీచు పదార్థాల, విటమిన్ల పోషక విలువలు గల ఆహార పదార్థాలు, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పాలు, పెరుగు తదితర తినుబండారాలను పాఠశాలలో ప్రదర్శించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, మరియు ఉపాధ్యాయుడు మర్పల్లి అశోక్ మాట్లాడుతూ విద్యార్థుల శారీరక మరియు మానసిక అభివృద్ధి కోసం ప్రతిరోజు పౌష్టికాహారాన్ని తల్లిదండ్రులు అందించాలని అందులో ముఖ్యంగా కూరగాయలు, ఆకుకూరలు, పిండి పదార్థాలు, మాంసకృతులు గల ఆహారాన్ని అందించాలని తెలపడం జరిగింది. పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరగాలంటే ప్రతి రోజు ఉడికించిన కోడిగుడ్డు, పాలు, పెరుగు, మాంసకుతులకు సంబంధించిన ఆహార పదార్థాలను పెట్టాలని, వీదుల్లో దొరికే లేస్, కుర్కురే, మాగీ, నూడుల్స్, మంచూరియా, ఫిజ్జా, బర్గర్ తదితర జంక్ ఫుడ్ కు దూరంగా ఉంచాలని తెలిపి, పిల్లలు ఆహారాన్ని తీసుకునే ముందు చేతులు శుభ్రంగా సబ్బుతో గాని, డెటాల్ తో గాని కడుకోవాలని వివరించి, విద్యార్థులు ఫుడ్ పాయిజన్ కి గురి కాకుండా వంట చేసేటప్పుడు ఇంటిదగ్గర గాని, పాఠశాలల్లో గాని వంట పాత్రలు శుభ్రంగా కడగాలని, అదేవిధంగా కూరగాయలు మంచినీటితో శుభ్రం చేయాలని, వండిన ఆహారంపై సరిపడా మూతలు పెట్టాలని తెలియజేయడం జరిగింది. కార్యక్రమంలో విద్యార్థులు, మరియు వారి తల్లిదండ్రులు శంకర్, రవి మల్లేష్, యాదయ్య, నరసింహులు, మమత, వెంకటేశ్వరి, యాదమ్మ, నాజియా, నూరిన్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ను అవమానించిన
# అమిత్ షా ను బర్తరఫ్ చేయాలి

- మతోన్మాదుల నుండి దేశాన్ని రక్షించుకోవాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి



**వెలుతురు న్యూస్ సూర్యాపేట డిసెంబర్ 21**
రాజ్యాంగ నిర్మా త అంబేద్కర్ పై కేంద్ర హెూంమంత్రి అమిత్ షా చేసిన అవమానకర వ్యాఖ్యలు బాధాకరమని, తక్షణమే ఆయనను మంత్రివర్గంలో నుండి బర్తరఫ్ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ లో జరిగిన సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పై అమిత్ షా అహంకారపూరితమైన ,తిరస్కార స్వరంతో అమిత్ షా మాట్లాడడం తన అహంకారాన్ని రుజువు చేసిందన్నారు. భారతదేశ లౌకిక , ప్రగతిశీల రాజ్యాంగ రూపశిల్పి పైన చూపిన అగౌరవాన్ని, అపహాస్యం చేయడానికి ప్రయత్నించారని విమర్శించారు. ఈ అవమానకరమైన వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ హెూం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలనిడిమాండ్ చేశారు. ఈ వ్యాఖ్యలు కేవలం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పైన చేసినవి మాత్రమే కాదని,సామాజిక న్యాయం కోసం పోరాటాన్ని కొనసాగిస్తున్న లక్షలాది మంది అణగారిన వ్యక్తులకు జరిగిన అవమానమన్నారు .తక్షణమే అతన్ని బర్తరఫ్ చేయాలన్నారు. భారత రాజ్యాంగంపై బీజేపీ చేస్తున్న దాడికి వ్యతిరేకంగా భారత ప్రజల నుంచి పెరుగుతున్న ప్రతిఘటన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేశారన్నారు .డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ హిందూత్వ శక్తులచే నిరంతరం దాడికి గురవుతున్న భారత రాజ్యాంగంలో పొందుపరచబడిన నిశ్చయాత్మక చర్యల నిబంధనల పరిరక్షణ కోసం పోరాడటానికి లక్షలాది మందిని ప్రేరేపించారని చెప్పారు. భారత ప్రజలపై మనువాద భావజా లాన్ని రుద్దేందుకు ఈ శక్తులు అవిశ్రాంతంగా పనిచేస్తున్నా యని చెప్పారు. అమిత్ షా , బిజెపి పార్టీ వారి ఆలోచనలు కులతత్వంతో ఉన్నాయని, రాజ్యాంగం పట్ల నిజమైన గౌరవం లేదని ,ఇది మరోసారి రుజువయిందన్నారు. ఎన్నికల సమయంలోనే కాకుండా ఆర్ఎస్ఎస్ ,బిజెపి తరచుగా వ్యక్తం చేసే అసహనం, భారతదేశంలో సామాజిక న్యాయం , సమానత్వం కోసం డాక్టర్ అంబేద్కర్ పోరాడి నడిపిన ఉద్యమాలు , ఆదర్శాల పట్ల వారి లోతైన ద్వేషాన్ని వెల్లడిస్తుం దన్నారు. మతోన్మాదుల నుండి దేశానికి ప్రమాదం పొంచి ఉందని అమిత్ షా విద్వేషాలకు కారకుడని విమర్శించారు. తక్షణమే అమిత్ షా ను బర్తరఫ్ చేయాలని చేసే వరకు సిపిఎంఉద్యమాలను కొనసాగిస్తుందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మది వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగి న ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కో లిశెట్టి యాదగిరిరావు, పారేపల్లి శేఖర్ రావు, ములకలపల్లి రాములు, నాగారపు పాండు, మట్టి పెల్లి సైదులు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ధర్మశాస్త్ర అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో
# అత్యంత వైభవంగా పడి పూజ

- అధిక సంఖ్యలో పాల్గొన్న మాలదరణ స్వాములు, భక్తులు
- అభిషేకం, అర్చనలు చేసిన పిసిసి సభ్యులు,పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి



**వెలుతురు న్యూస్ సూర్యాపేట డిసెంబర్ 21**
భక్తి పారవశ్యంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని పిసిసి సభ్యులు,పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని శభరి నగర్ లో ధర్మశాస్త్ర అన్నదాన సేవా సమితి నిర్వాహకులు యర్రంశెట్టి ఉపేందర్, నరసయ్య, వెంపటి పురుషోత్తం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ఏర్పాటు చేసిన ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు, పూలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా పిసిసి సభ్యులు,పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి మాట్లాడుతూ కార్తీక మాసంలో దీపారాధన చేసి పూజలు చేస్తే స్వామి వారి ఆశీస్సులు పొంది ప్రతి ఫలం పొందుతారని అన్నారు. వంటి పూట భోజనంతో అనునిత్యం పూజలు చేస్తూ కఠిన దీక్షలు చేస్తున్న వారికి అయ్యప్ప స్వామి వారి ఆశీషులు తప్పక ఉంటాయన్నారు. నిష్టతో పూజలు చేసి, ఎల్లవేళలా స్వామి వారి కృపకు పాత్రులు కావాలన్నారు. ధర్మశాస్త్ర అన్నదాన సేవా సమితి పడి పూజ ఏర్పాటుకు శ్రీకారం చుట్టి గత 37 రోజులుగా అయ్యప్ప స్వాములకు అన్నదానం చేస్తున్న ధర్మశాస్త్ర అన్నదాన సేవా సమితి నిర్వాహకులు యర్రంశెట్టి ఉపేందర్, రాచకొండ దేవయ్య, వెంపటి పురుషోత్తం ను ప్రత్యేకంగా అభినంచారు. ఆధ్యాత్మిక జీవితంతో వ్యక్తి సన్మార్గంలోకి వస్తారని ఆయన అన్నారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆయన తెలిపారు. లోకాలను కాపాడే ఆ అయ్యప్ప స్వామి అనుగ్రహముతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. పవిత్రమైన అయ్యప్పస్వామి మాలధారణకు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంటుదని ఆయన తెలిపారు. అత్యంత భక్తిశ్రద్ధలతో లోక కల్యాణం కోసం పూజ కార్యక్రమలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు. హరిహారసుతుడు అయ్యప్పస్వామి అనుగ్రహముతో ప్రజలందరు ఆయురాగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని వారు తెలిపారు. స్వాములు అందరూ కలిసి తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం మాలదారణ స్వాములను పేరు పేరున ఆప్యాయంగా పలకరించారు.

## లిటిల్ స్టార్స్ హై స్కూల్ లో ఘనంగా జాతీయ మ్యాథ్స్ డే వేడుకలు



**శంకర్ పల్లి వెలుతురు డిసెంబర్ 21**
స్థానిక లిటిల్ స్టార్స్ హై స్కూల్ లో జాతీయ మ్యాథ్స్ డే వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకకు స్థానిక ఎస్ఐ తుకారాం ముఖ్య అతథులుగా వచ్చారు. నేటి మ్యాథ్స్ డేలో స్థానిక ఎస్ఐ మరియు పాఠశాల కరస్పాండెంట్ సంజిత్ కుమార్ మాట్లాడుతూ ఉద్దండులే పరిష్కరించలేని గణిత సమస్యలను తన అపార మేధా సంపత్తితో చిటికెలోనే పరిష్కరించి వారి నుంచి ప్రశంసలుందుకున్నారు శ్రీనివాస్ రామానుజన్. అందుకే ఆయన పుట్టిన రోజును జాతీయ గణిత దినోత్సవంగా జరుపుకుంటున్నాం. నిరుపేద కుటుంబంలో జన్మించిన రామానుజన్.. గణితంపై ఎక్కువ శ్రద్ధ పెట్టడంతో ఎఫ్ఏ పరీక్షల్లో తప్పారు. తన మేధతో క్లిష్టమైన గణిత సూత్రాలను అవలీలగా చేసి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు దక్కించుకున్నారు. రామానుజన్‌లోని ప్రతిభను బయటకు తీసింది మాత్రం జీఎస్ కార్ రచించిన గణిత పుస్తకం. సర్వశాస్త్రాలకు తల్లివంటిది గణితం , అటువంటి గణితశాస్త్రానికి పుట్టిల్లు భారతదేశము. మిగిలిన ప్రపంచములో విజ్ఞానశాస్త్రము ఉదయించకముందే ఇక్కడ మహాపురుషులు ఖగోళశాస్త్రాన్ని అత్యున్నత స్థాయికి తీసుకు వెళ్ళారు. కాల గమనము, గ్రహణాల అంచనాలు, పంచాంగ నిర్మాణము వంటివన్నీ వారి ప్రతిభకు నిదర్శనము. అంకెలు కనుగొన్నది , గణితంలో కీలకమైన సున్నాని కనుగొన్నది భారతీయులే. అని భారతీయుల గణిత వేత్తల ఘనతను పిల్లలకు గుర్తు చేశారు. అదేవిధంగా మాథ్స్ ఉపాధ్యాయులకు సన్మానం చేసి గౌరవించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సంజిత్ కుమార్ గారు, ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఉపాధ్యాయులు , మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




## అభివృద్ధిలో గుంటూరును ముందువరసలో నిలబెడతా

### 20 సూత్రాల కమిటీ ఛైర్మన్ లంకా దినకర్

**గుంటూరు,డిసెంబర్21( వెలుతురు):**
20 సూత్రాల అమలు విషయంలో కేంద్ర పథకాలపై అధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించామని 20 సూత్రాల కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వికసిత భారత్ మోడీ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లాను అభివృద్ధి రంగంలో ముందు వరుసలో ఉంచుతామన్నారు. నగరంలో అండర్ డ్రైనేజ్ రూ.540 కోట్లతో అభివృద్ధి చేయాలని చూస్తే గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ఉపాధి హామీ లోపాలపై ఆడిట్ చేయాలని సూచించారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో మహిళల అభివృద్ధి, త్రాగునీటి కుళాయిల కోసం 70 వేల కోట్ల రూపాయలు అభివృద్ధి చేయాలని అంచనాలు వేశామన్నారు.నగరంలో త్రాగునీటి కోసం రూ.124 కోట్లతో అమృత్ -2 పథకాన్ని అమలు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. రేషన్ కార్డులు రాష్ట్రాల్లో అత్యధికంగా ఉన్నాయని... త్వరలోనే నూతన రేషన్ డీలర్లను నియమిస్తామని చెప్పారు. 45 వేల ఇళ్లను పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలి వేసిన పరిస్థితి నెలకొందని తెలిపారు. కేవలం 17419 టిడ్కో గృహాలు మాత్రమే ప్రారంభం కావడం గమనార్హమన్నారు. వ్యవసాయ ఆధారిత జిల్లాలో ఫసల్ భీమా పథకం రైతులకు అందకపోవడం విడ్డురంగా ఉందన్నారు. 2019 - 2024 మధ్య ఫసల్ యోజనకు సంబంధించి ప్రభుత్వం నుంచి సహాయక డబ్బులు కట్టకపోవడమే రైతులకు నష్టపరిహారం అందించలేకపోయామన్నారు. యూరియాను రైతులకు సకాలంలో ఇస్తామని.. సూర్యఘర్ పథకం కింద కేంద్రం నుంచి సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని 20 సూత్రాల కమిటీ చైర్మన్ లంకా దినకర్ స్పష్టం చేశారు.

# ఘనంగా ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు...

- కెపిహెచ్బి వైఎస్ఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో కేక్ కటింగ్, రక్తదానాలు, అన్నదాన కార్యక్రమాలు...
- వైయస్ జగన్ పేదల పక్షపాతి, సంక్షేమ సారథి అని కొనియాడిన నేతలు...



**కూకట్ పల్లి డిసెంబర్ 21 వెలుతురు:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం కేపీహెచ్బీ కాలనీ రమ్య గ్రౌండ్ లో వైఎస్ఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వందలాది మంది వై ఎస్ అభిమానులు తరలి వచ్చి వేడుకల్లో పాల్గొన్నారు. వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలకు ముఖ్య అతిథులుగా కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం



కృష్ణారావు హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. జన్మదిన సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం నిర్వహించిన వేడుకలలో ఆంధ్రప్రదేశ్ మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు సతీష్ రెడ్డి, శివరామిరెడ్డి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, సాక్షి మీడియా ఫైనాన్స్ డైరెక్టర్ ఈశ్వరప్రసాద్ రెడ్డి, మాజీ చైర్మెన్ చల్లా మధుసూదన్ రెడ్డి వైఎస్ఆర్ సీపీ అధికార ప్రతినిధి శ్యామల లుపాల్గొని ప్రత్యేకంగా తయారు చేసిన కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైయస్ జగన్మోహన్ రెడ్డి పేదల సంక్షేమమే ధ్యేయంగా పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేశారని కొనియాడారు. వైయస్ జగన్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఎంతో గొప్పవని, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఏపీలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ అభిమాన సంఘం నేతలు బండి మధుసూదన్ రెడ్డి, బి.శివారెడ్డి, జి.ఎల్.ఎన్.రెడ్డి, జయ చంద్రారెడ్డి, శేషారెడ్డి, గాలి రెడ్డి, జగదీష్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, రమణారెడ్డి, సుబ్బారెడ్డి, గౌతంరెడ్డి, శేఖర్ రెడ్డి అనిమిరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, కే.శేఖర్ రెడ్డి, డి. శ్రీనివాస్ రెడ్డి, సుబ్బరామిరెడ్డి, తిరుపతి చారి, తులసిరెడ్డి, టీ ఎల్ ఆర్ , గొట్టం కోటి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు టెంపుల్ బస్టాప్ చౌరస్తాలోని స్వర్గీయ వై ఎస్ ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వందలాది మంది వై ఎస్ జగన్ అభిమానులు తరలిరావడంతో రమ్యగ్రౌండ్ ప్రాంతం సందడిగమారింది. అన్న సమారాధన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో స్థానికులు మహిళలు పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటీలు ఉత్తమాటలేనా..?

- ఆరు గ్యారెంటీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్... ,
- కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు...



**కూకట్ పల్లి డిసెంబర్ 21 వెలుతురు:** ఆరు గ్యారెంటీలు అమలుచేస్తామని అధికారంలోకి వచ్చి ఏడాది పాలన పూర్తయిన పూర్తిస్థాయి అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు ఆరోపించారు. శేర్లింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ లోని వీకర్ సెక్షన్ కాలనీ వెంకటేశ్వర్ నగర్ లో ఇందిరమ్మ ఇండ్లు పథకం కొరకు దరఖాస్తు చేసుకున్న వారి ఎంపిక కోసం సిఓ పాప గౌడ్ తో కలిసి శనివారం కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ‘అది చేస్తాం.. ఇది చేస్తాం’ అని నమ్మించి గద్దెనెక్కిన కాంగ్రెస్, ఇప్పుడు చేతులెత్తేస్తున్నది. మ్యానిఫెస్టోలో ఆరు గ్యారెంటీలు ప్రకటించి, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలన పేరిట దరఖాస్తులు స్వీకరించి, తీరా అమలు చేసేందుకు అనేక కండిషన్లు పెడుతుందని మండిపడ్డారు. ముఖ్యంగా ఆరు గ్యారెంటీలు 420 అమలు చేస్తామని చెప్పి మహాలక్ష్మి పథకం, గృహలక్ష్మి, ఇందిరమ్మ ఇల్లు, చేయూత, రైతు భరోసా పథకాల కింద అప్లై చేసుకోమని చెప్పి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. కానీ నేడు ఏదైతే ఇందిరమ్మ ఇండ్లు పథకం ద్వారా ప్రజాపాలన అప్లికేషన్స్ దారులు 50 మంది వస్తే దాదాపు 30 మందికి ఇందిరమ్మ ఇండ్లు పథకంలో ఆన్లైన్లో ఎంట్రీ లేదని చెప్పడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఇందులో 20 మందిలో కూడా వాళ్ళు ఐదు స్కీం లకి అప్లై చేసుకుంటే ఏదో ఒక స్కీం, రెండు స్కీములు మాత్రమే ఆన్లైన్లో ఎంటర్ అయ్యాయని అనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విధంగా తమ డివిజన్ లో అప్లై చేసిన వారిలో 40% కూడా ఎంట్రీ కాలేదని ఏడాది గడిచిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం అసలు ఇందిరమ్మ ఇల్లు ఎక్కడ కడుతున్నారు ఎన్ని కడుతున్నారు అన్న క్లారిటీ ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఇప్పటికీ అప్లై చేసిన దరఖాస్తులు ఎంట్రీలు చేయక ప్రజలు వార్డ్ ఆఫీస్ చుట్టూ, మీరు పెట్టిన జ్యోతిరావు పూలే ప్రజా భవన్ కి వెళ్లినా కూడా ఎవరు స్పందించడం లేదని ప్రజలు వాపోతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు స్పందించి ఎవరైతే ఆన్లైన్ లో ఎంట్రీ కాలేదు అప్పుడు ఎవరైతే లేనివారు ఉన్నారో వారందరికీ కూడా అవకాశం ఇచ్చి ఈ పథకాలు వాళ్ళందరకి కూడా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీలైనంత త్వరగా ప్రజలకు అవకాశం ఇవ్వాలని లేనియెడల ప్రజలందరిని తీసుకొని ముఖ్యమంత్రి నివాసం, డిప్యూటీ ముఖ్యమంత్రి నివసిస్తున్న ప్రజా దర్బార్ కి వెళ్లి ధర్నా చేయడం ఖాయం అన్నారు. ఈ కార్యక్రమంలో వేముల ఆంజనేయులు, జగదీష్ గౌడ్, రాజశేఖర్, రమేష్ రావు, బాబు, రవీందర్రావు, నాగార్జున, భారతి చౌదరి, తానారాం, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# డబల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులకు ఇండ్లు కేటాయించాలి

## సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎల్లూరి గోవింద్



**వెలుతురు న్యూస్ సూర్యాపేట డిసెంబర్ 21 :** గత టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సూర్యాపేట పట్టణంలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్ల ను లబ్ధిదారులకు పట్టాలు మాత్రమే పంపిణీ చేసి చేతులు దులుపుకున్నారని ప్రభుత్వం వెంటనే లబ్ధిదారులకు ఇండ్లను కేటాయించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎల్లూరి గోవిందు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం పార్టీ వన్ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో సూర్యాపేట పట్టణంలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇళ్లను సిపిఎం పార్టీ ప్రతినిధి బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 804 మంది లబ్ధిదారులకు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పట్టాలు ఇచ్చారు తప్ప ఇళ్లను కేటాయించకపోవడంతో లబ్ధిదారులు సంవత్సర కాలం నుండి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లు వచ్చిందన్న సంతోషం పేదల్లో కనపడటం లేదని గతంలో సూర్యాపేట ఎమ్మెల్యేగా ఉన్న జగదీశ్ రెడ్డి మంత్రిగా ఉన్నారని నేడు ప్రభుత్వం అధికారం కోల్పోవ దంతో ఎమ్మెల్యేగా కొనసాగుతు న్నారని ఆయనే వెంటనే కలగజేసు కొని పేదలందరికీ ఇండ్లు కేటాయిం చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణమే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని పట్టాలు ఇచ్చిన పేదలకు ఇండ్లు కేటాయించాలన్నారు. గత సంవత్సర కాలంగా ఇండ్లు కేటాయించకపోవడంతో ఇండ్లు శిథిలావస్థలోకి చేరాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా డబల్ బెడ్ రూమ్ ఇండ్ల లలో పనులు పూర్తి కాలేదని కొన్ని పనులు పూర్తి అయిన మొత్తం ధ్వంసం చేయబడి ఉన్నాయని ప్రభుత్వం తక్షణమే కాంట్రాక్టర్ తో మాట్లాడి ఇళ్లను పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేసి లబ్ధిదారులకు కేటాయించాలని లేనియెడల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోసిపిఎం పార్టీ వన్ టౌన్ కార్యదర్శి వల్లపు దాసు సాయికుమార్, పట్టణ కమిటీ సభ్యులు మామిడి పుల్లయ్య, మామిడి సుందరయ్య, గంగపురి శశిరేఖ, పిట్టల రాణి, వట్టే ఎర్రయ్య, మాధగోని మల్లయ్య, నాయకురాలు బిక్షమమ్మ, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎంపీపీ దశదినకర్మలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు డిసెంబర్ 21:** నారాయణపురం మాజీ ఎంపీపీ, వాయిల్లపల్లి మాజీ సర్పంచ్ మంచికంటి జనార్ధన్ గారి దశదిన కార్యక్రమం చౌటుప్పల్ వారి సగృహంలో పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన యాదాద్రి జిల్లా ఉపాధ్యక్షుడు మందుగుల బాలకృష్ణ,కార్యదర్శిలు ఏపూరి సతీష్, కార్యదర్శి నోముల మాధవరెడ్డి ప్రజా ప్రతినిధి గా, కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా ప్రజలకు అనేక సేవలు అందించారు అని గుర్తు చేశారు. ఈ యొక్క కార్యక్రమంలో పిఎసిఎస్ డైరెక్టర్ ఉప్పల కృష్ణ,కుక్కల నరసింహ,రాచకొండ రమేష్ బాబు, కరెంటోతూ రమేష్ నాయక్, చిలువేరు అంజయ్య,గునిగంటి రాజు,యువజన కాంగ్రెస్ కార్యదర్శి ఉప్పల నాగరాజు,బద్దుల యాదగిరి యాదవ్, మాజీ సర్పంచ్ గడ్డం శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# అంకుర్ స్కూల్లో అట్టగాసంగా మ్యాథ్స్ డే






**వెలుతురు నారాయణఖేడ్ డిసెంబర్ 21 :** నారాయణఖేడ్ పట్టణంలోని అంకుర్ స్కూల్లో శనివారం మ్యాథ్స్ డే ను అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సరీ నుండి ఐదవ తరగతి క్లాస్ స్టూడెంట్స్ వివిధ రకాల ఎగ్జిబిట్స్ చేసి స్టాల్స్ గా ఏర్పాటు చేసి పేరెంట్స్ కు, విజిటర్స్ కు వివరించారు. కాగా నర్సరీ స్టూడెంట్స్ చేసిన ప్రాజెక్టులు ప్రత్యేకించి పలువురిని ఆకర్షించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపల్ సుస్మిత మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకను వెలికితీయడానికి ప్రతీ కార్యక్రమాన్ని స్కూల్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహిస్తున్నామని, సహకరిస్తున్న పేరెంట్స్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టీచర్లు, స్టూడెంట్స్, పేరెంట్స్ పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు...



**కూకట్ పల్లి డిసెంబర్ 21(వెలుతురు):** సంక్షేమ సారథి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం కూకట్ పల్లి లో ఘనంగా నిర్వహించారు. బాలాజీ నగర్ లోని వైయస్సార్ విగ్రహం వద్ద ఎన్టీఆర్ జిల్లా జెసిఎస్ కోఆర్డినేటర్ ఐస్ క్రీమ్ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మదిన వేడుకలకు మేధావుల ఫోరం అధ్యక్షులు ఈశ్వర్ ప్రసాద్ రెడ్డి, వైఎస్ఆర్సిపి అధికార ప్రతినిధి శ్యామల, ఐ టి వింగ్ అధ్యక్షుడు సునీల్ రెడ్డిలు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం జగన్మోహన్ రెడ్డి జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం శ్యామల మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. అర్హులైన పేద ప్రజలకు సంక్షేమ పథకాలు, రైతులకు అండగా నిలిచి రైతు భరోసాని అందించిన గొప్ప నాయకుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని ఆమె అన్నారు. విద్యా వ్యవస్థలో రూపురేఖలు మార్చి విద్యార్థులకు అమ్మ ఒడి, విద్యా దీవెన, ఫీజు రియంబర్స్మెంట్ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలుపరిచిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. కూకట్పల్లి బాలాజీ నగర్ లో ఇంత పెద్ద ఎత్తున అధినేత జన్మదిన వేడుకలు జరుపుకోవడం నిజంగా తనకు ఎంతో గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా వైయస్సార్సీపి ట్రేడ్ యూనియన్ ఉపాధ్యక్షుడు పెసర్లంక రమణ, వైఎస్ఆర్సిపి అభిమానులు కార్యకర్తలు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సెమీ క్రిస్మస్ వేడుకల్లో మహిళలకు చీరలు పంపిణీ చేసిన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్



**కూకట్ పల్లి డిసెంబర్ 21 వెలుతురు:** క్రిస్మస్ పండుగ సందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని శంషిగుడా ఆదర్శ్ నగర్ లోని గ్లోరియస్ ప్రార్థన మందిరం పాస్టర్ యం.యం.సురేష్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన సెమి క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథిగా డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై ప్రత్యేక ప్రార్ధన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కార్పొరేటర్ చేతులమీదుగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్స్ రెవ ఏడివి ప్రసాద్, యం.రాజు, సామ్ జాషువ, జయరాజు, ఏ. గోపి, శైలిస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పల్లె దవాఖానా'లను సద్వినియోగం చేసుకోవాలి

- కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్..



**కూకట్ పల్లి డిసెంబర్ 21 వెలుతురు:** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ 1వ ఫేస్ లోని పల్లె దవాఖాన ను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ శనివారం తనిఖీ చేసి, వారు అందిస్తున్న వైద్య సేవల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పల్లె, బస్తి దవాఖాన, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల రూపేనా ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకుని రోగాలకు దూరంగా ఉండాలని అన్నారు. పల్లె దవాఖానలో బిపి, షుగర్ కు సంబందించిన మాత్రలు(టాబ్లెట్స్) కొరత ఉందని డాక్టర్ తో మాట్లాడిన తరువాత తెలిసిందని అన్నారు. వెంటనే ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి మాత్రలు త్వరగా వచ్చే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, పోశెట్టిగౌడ్, బి.వెంకటేష్ గౌడ్, కుమార చారి, రాంరెడ్డి, రఘు, నరసింహ రెడ్డి, హేమలత, రాజేందర్, డాక్టర్ సాయి కృష్ణ, ఏ.ఎన్.ఎం శశికళ తదితరులు పాల్గొన్నారు.

# జన్మదిన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ చైర్మన్ తన్వీర్...



**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 21:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం న్యాల్కల్ మండలం మిరజాపుర్ గ్రామ మాజీ సర్పంచ్ మల్ల రెడ్డి కుమారుడు ఆరుష్ మొదటి పుటిన రోజు వేడుకలు ముంగి ఎక్స్ రోడ్ ఎస్ ఎల్ ఆర్ ఫంక్షన్ హాల్లో శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి మాజీ టిజిఐడిసి చైర్మన్ మొహమ్మద్ తన్వీర్ పాల్గొని చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితో పటు నర్సింగా రెడ్డి, మాజీ సర్పంచ్ అమీర్, యువజన కాంగ్రెస్ సంగారెడ్డి జిల్లా జర్నల్ సెక్రటరీ గోవర్ధన్ రెడ్డి, నవీద్ తదితరులు పాల్గొన్నారు.

# రంజోల్ పాఠశాలలో ఘనంగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్, ఫుడ్ ఫెస్టివల్..

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 21:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పురపాలక సంఘం పరిధిలోని రంజోల్ గ్రామంలోగల ప్రభుత్వ ఉన్నత పాఠశాల యందు శనివారం రోజున పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ మరియు ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని పాఠశాల గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు నానుసింగ్ రాథోడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు రుచికరమైన, పోషకమైన, ఆహారాన్ని ఇంటి వద్ద నుండే వండించుకొని పాఠశాలకు తీసుకొని వచ్చారు. అదేవిదంగా స్కూల్ మేనేజ్మెంట్ కూడా వెజ్ బిర్యానిని సిద్ధం చేసి విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి భోజనాలు చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులను ఇంటి నుండే వండించి తెచ్చిన వంటకాల రుచి చూసి పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాను సింగ్ రాథోడ్, ఉపాధ్యాయులు



విద్యార్థులను, తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు నానుసింగ్ రాథోడ్ తోపాటు ఉపాధ్యాయుల బృందం నర్సింలు, రవి ప్రకాష్, నర్సింహా



రెడ్డి, భాస్కర్, ఖాజా నిజామోద్దీన్, తయాబున్నిస్సా, సాజీదా బేగం, తస్కిన్ ఫాతిమా, రాజేశ్వరి, ఫరిదా ఫాతిమా, కె. జ్యోతి, ఫరజానా బేగం, పాఠశాల విద్యార్థులు, విద్యార్థినులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న బీజేపీ సీనియర్ నాయకురాలు జ్యోతి పండాల్



**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 21:**
మత సామరస్యానికి ప్రతీక ఉర్సు ఉత్సవాలని బీజేపీ సీనియర్ నాయకురాలు, రాష్ట్ర పూలే అవార్డు గ్రహీత జ్యోతి పండాల్ అన్నారు. శుక్రవారం రాత్రి కొహీరు పట్టణంలో జరిగిన 766 వ ఉర్సు ఉత్సవాల్లో పాల్గొని దర్గను దర్శించుకోని చాదర్ ను సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి దర్గా కమిటీ సభ్యులు శాలువా కప్పి సత్కరించి ఆహ్వానం పలికారు. అంగరంగ వైభవంగా జరుగుతున్న ఉర్సు ఉత్సవాల్లో బీజేపీ సీనియర్ లీడర్ జ్యోతి పండాల్ తో పాటు కోహీర్ మాజీ ఎంపీపీ శౌకత్, బీజేపీ సీనియర్ లీడర్స్ శ్రీనివాస్ గౌడ్, అఫ్సర్ డిల్దార్, రేణుకా, దర్గా కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లైఓవర్ బ్రిడ్జ్ కి తెలంగాణ అమరవీరుడు
# లక్ష్మణ్ యాదవ్ పేరు పెట్టాలి

- **జహీరాబాద్ పట్టణ బీజేపీ యువ నాయకుడు అప్పం శ్రవణ్ కుమార్...**

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 21:**
జహీరాబాద్ పట్టణంలో నూతనంగా ఏర్పడి ప్రారంభ దశలో ఉన్న రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జికి జహీరాబాద్ బడుగు బలహీన వర్గాలకు చెందిన ముద్దుబిడ్డ లక్ష్మణ్ యాదవ్ పేరు పెట్టాలని పట్టణ బీజేపీ యువ నాయకుడు అప్పం శ్రవణ్ కుమార్ ప్రభుత్వానికి డిమాండ్ చేస్తూ శనివారం రోజు ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం పదేపదే ఆత్మ బలిదాల పైన సోనియా గాంధీ నేతృత్వంలో తెలంగాణ ఏర్పాటు జరిగిందని గొప్పలు చెప్పుకుంటున్నారు, అలాంటి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆత్మబలిదానం చేసిన లక్ష్మణ్ యాదవ్ పేరు పెట్టకుంటే తెలంగాణ సమాజం సిగ్గుతో తలదించుకుంటుంది గడిచిన పది సంవత్సరాలలో తెలంగాణ ఉద్యమకారులకి కానీ తెలంగాణ కోసం ఆత్మబలిదానం చేసుకున్న వారికి వాళ్ళ కుటుంబ సభ్యులకి గాని ఎలాంటి సముచిత న్యాయం జరగలేదు, కానీ ఇప్పుడు ఏర్పడ్డ ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందా లేదా అని ఉద్యమకారులు తెలంగాణ



కోసం బలిదానం చేసుకున్న వారి కుటుంబ సభ్యులు అయోమయంలో ఉన్నారు, ఇప్పటికైనా ప్రభుత్వం చిత్తశుద్ధితో తెలంగాణ కోసం అమరుడైన జహీరాబాద్ ముద్దుబిడ్డ లక్ష్మణ్ యాదవ్ పేరు జహీరాబాద్ ఫ్లైఓవర్ బ్రిడ్జికి పెట్టి ఉద్యమకారులపై ఉన్న చిత్తశుద్ధిని ప్రభుత్వం నిరూపించుకోవాలని అప్పం శ్రవణ్ కోరారు.



# ఆరోగ్యమే మహాభాగ్యము

**వెలుతురు నారాయణఖేడ్ డిసెంబర్ 21 :**
నారాయణఖేడ్ నియోజకవర్గం లో ఆరోగ్యమే మహాభాగ్యమని ఆయుర్వేద డాక్టర్ నారాయణరావు అన్నారు. ఇంటర్నేషనల్ మెడిటేషన్ డే సందర్భంగా నారాయణఖేడ్ జూకల్ శివారులోని మహాత్మ జ్యోతిబాపూలే స్కూల్ టీచర్లు, స్టూడెంట్స్ తో కలిసి మెడిటేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెడిటేషన్ ద్వారా వచ్చే బెనిఫిట్స్ ను స్టూడెంట్స్ వివరించారు. నిత్యజీవితంలో జీవితంలో మానవుడు అనేక రకాల మానసిక ఒత్తిడికి లోనవుతున్నాడని ఆ ఒత్తిడి దూరం చేసుకోవాలంటే మెడిటేషన్ ఒక్కటే మార్గమని చెప్పారు. అనంతరం స్టూడెంట్స్ టీచర్లతో కలిసి యోగ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపల్ శ్రీను మాట్లాడుతూ మన కుటుంబంలో పూజ గదికి ఎంత ప్రాధాన్యత ఉంటుందో, ప్రపంచానికి అంతర్గత శక్తిని అందించడంలో భారతదేశం కూడా అంతే ప్రాధాన్యమైందని చెప్పారు. కార్యక్రమంలో యోగ మాస్టర్ గుండె రావ్, టీచర్లు స్టూడెంట్స్ పాల్గొన్నారు.

## ఝురసంఘం రహదారి నిర్మాణానికి
# నిధులు నిధులివ్వండి

- **మంత్రిని కోరిన జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు**

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 21:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం ఝురాసంఘం లో ఉన్న ప్రధాన రహదారిని విస్తరించాలని జహీరాబాద్ శాసనసభ్యులు కొనింటి మాణిక్‌రావు శనివారం రాష్ట్ర రహదారుల శాఖ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ని కలిసి వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రమైన ఝురసంఘంలో శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి వారి ప్రధాన దేవాలయం ఉండడం, నిమ్జ్ ప్రాజెక్టు ఏర్పాటు అవుతుండడం వల్ల ఇట్టి రోడ్డుపై నిత్యం భారీ సంఖ్యలో వాహనాలు వస్తుపోతూ ఉంటాయి కనుక అట్టి రోడ్డును బాగు చేయాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో 5కోట్ల రూపాయల వరకు మంజూరు చేశామని, ప్రస్తుతం రోడ్డు అనుకూలంగా లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని, మరిన్ని నిధులను మంజూరు చేయాలని కోరారు. అంతేకాకుండా రోడ్డు పక్కల ఉన్న విద్యుత్ స్తంభాలతో కూడా ఇబ్బందికరంగా ఉందని రోడ్డును విస్తరించి అనుకూలమైన ప్రధాన రహదారిగా మార్చాలని ఎమ్మెల్యే మాణిక్ రావు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

## కోహీర్‌ను మున్సిపాలిటీగా మారుస్తే
# ఉపాధి కరువు

**కోహీర్ మాజీ ఎంపీటీసీ (4) నాగరిగారి అనిత సంపత్‌కుమార్...**

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 21:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం మండల కేంద్రమైన కోహీర్‌ను అర్ధాంతరంగా మున్సిపాలిటీగా మారిస్తే మండల కేంద్రమైన కోహీర్‌లో ఉన్న 800 మంది నిరుపేదలకు ఉపాధి హామీ పని లేకుండా పోతుందని కోహీర్ గ్రామ మాజీ ఎంపీటీసీ (4) నాగరిగారి అనిత సంపత్‌కుమార్ అన్నారు. కోహీర్ గ్రామస్తులు అభిప్రాయ సేకరణ లేకుండానే ప్రభుత్వం కోహీర్ మేజర్ గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా ప్రకటించడం సమంజసం కాదన్నారు. కొందరు స్వార్థం కోసం ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినంత మాత్రాన ప్రభుత్వం దానిని అంగీకరించి మునిసిపాలిటీగా ప్రకటించడం సరికాదన్నారు. ప్రస్తుతం కోహీర్‌లో నూటికి 90 శాతం మంది బీపీఎల్ కుటుంబాలు (రోజు కూలి చేసుకొనే కుటుంబాలు) ఉన్నాయన్నారు. అకస్మాత్తుగా కోహీర్‌ను మున్సిపాలిటీగా మారిస్తే నిరుపేదలకు ఉపాధి హామీ పని దొరకపోవడమే కాకుండా ఎన్ఆర్ఈజీఎస్ బడ్జెట్ రాక ప్రజలు ఉపాది కోల్పోయి ఇంటి పన్ను, నీటి పన్ను, రిజిస్ట్రేషన్ చార్జీలు తదితర చార్జీలు పెరుగుతాయన్నారు. చార్జీలు పెరిగితే నిరుపేదలు వాటిని కట్టుకోలేని పరిస్థితి ఉంటుందని పేర్కొన్నారు. చిరు వ్యాపారులకు కమర్షియల్ టాక్సెస్ (జీఎస్టీ ) పెరిగి ఇబ్బందిగా ఉంటుందన్నారు. అదే కాకుండా కోహీర్ సమీపంలో ఎలాంటి పరిశ్రమలు లేవు కనుక కోహీర్ కు సిఎస్ఆర్ నిధులు కూడా వచ్చే అవకాశం లేదన్నారు. కనుక ప్రభుత్వం పునరాలోచన చేసి కోహీర్‌ను మేజర్ గ్రామపంచాయతీగానే కొనసాగించాలని కోహీర్ ప్రాంతం మొత్తం వ్యవసాయంపై ఆధారపడి ఉంది అన్నారు నూతన గృహం నిర్మాణం పర్మిషన్ నిమిత్తం 65,000 వెయ్యిల నుండి 1,5,0000 వెయ్యిల రూపాయలతో పాటు, ఇంటి పన్ను రుసుము 4 రేట్లు పెరగడం, రిజిస్ట్రేషన్ చార్జీలు 4 రేట్లు పేరగడం, ప్రతినెలా నల్ల నీరు బిల్లు కట్టడం, చిరు



వ్యాపారులపై అధికంగా కమర్షియల్ టాక్సీల భారం పడి చెల్లించక వ్యాపారాలు మానుకొని ఆర్థికంగా ఇబ్బంది పడే పరిస్థితులు ఏర్పడతాయని, కనుక కోహీర్ మున్సిపాలిటీగా మార్చే ముందు ప్రజాభిప్రాయ సేకరణ తీసుకొని ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల
# సమస్యలు పరిష్కరించాలి

- **తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్ వి రామారావు**



**మెదక్ వెలుతురు డిసెంబర్ 21:**
తపస్ శివంపేట శాఖ ఆధ్వర్యంలో మెదక్ కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహిస్తున్న ఎస్ ఎస్ ఏ ఉద్యోగులకు సంఘీభావం ప్రకటించి వారికి ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్వీ రామారావు మాట్లాడుతూ ఎస్ ఎస్ ఏ ఉద్యోగుల న్యాయపరమైన సమస్య ను ప్రభుత్వ వెంటనే పరిష్కరించాలని, శాసన మండలి లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల గురించి శాసనమండలిలో మాట్లాడడం అభినందనీయమని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ శివం పేట్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కొండల్ రెడ్డి, రాజు, తపస్ నాయకులు శేఖర్, మల్లేష్, రాములు తదితరులు పాల్గొన్నారు

## చాగంటికి మరో బాధ్యతను అప్పగించిన ఏపీ ప్రభుత్వం

**అమరావతి,డిసెంబర్ 21( వెలుతురు):**
ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును విద్యార్థులు – నైతిక విలువల సలహాదారుగా ఏపీ ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. కేబినెట్ హోదా కలిగిన ఈ బాధ్యతలను ఆయనకు ప్రభుత్వం అప్పగించింది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ తర్వాత ఆయన బాధ్యతలను స్వీకరించారు. తాజాగా చాగంటికి ఏపీ ప్రభుత్వం మరో కీలక బాధ్యతను అప్పగించింది. విద్యార్థుల్లో నైతిక విలువలను పెంచేందుకు చాగంటితో ప్రభుత్వం ప్రత్యేకంగా పుస్తకాలను తయారు చేయించి, విద్యార్థులకు పంపిణీ చేయనుంది. రెండు రోజుల క్రితం జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

## జిల్లాలో పర్యటించనున్న
# గవర్నర్ ముఖ్యమంత్రి

- **ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ రాహుల్ రాజ్, అడిషనల్ కలెక్టర్ నగేష్**
- **భద్రతా ఏర్పాట్లలో ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి**



**కొల్చారం, వెలుతురు న్యూస్ డిసెంబర్ 21:**
మెదక్ జిల్లాలో నేడు రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ఈనెల 25న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అడిషనల్ కలెక్టర్ నగేష్, జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి పర్యటన కార్యక్రమ ఏర్పాట్లను, భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. గవర్నర్ తునికిలోని వ్యవసాయ కృషి విజ్ఞాన కేంద్రం, మెదక్ చర్చిని దర్శించుకుని మండల కేంద్రమైన కొల్చారంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ తో పాటు జిల్లా యంత్రాంగం శనివారం కొల్చారం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించి పాఠశాల ఆవరణలో బసకు ఏర్పాట్లను సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ గఫర్ మియా, ఎంపీడీవో కృష్ణవేణి, ఎస్సై మహమ్మద్ గౌస్, ఏ పి ఓ మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# గణిత ప్రదర్శనను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిన కాటా సుధా శ్రీనివాస్ గౌడ్





**అమీన్ పూర్ వెలుతురు డిసెంబర్ 21:**
అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలోని వందనపురి కాలనీ గౌతమ్ మోడల్ స్కూల్‌లో జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన గణిత ప్రదర్శనకు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి కాటా సుధా శ్రీనివాస్ గౌడ్ గారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గణితశాస్త్రం విద్యార్థుల బౌద్ధిక వికాసానికి ముఖ్యమని, ఇలాంటి ప్రదర్శనలు వారిలో ఆవిష్కరణాత్మక ఆలోచనలను మరియు సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందిస్తాయని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో విద్యార్థులు తమ ప్రతిభను గణిత ప్రదర్శనల ద్వారా ప్రదర్శించారు.

# నాడు కార్పొరేషన్లో విలీనం చేసుకున్న 8 గ్రామాలే అభివృద్ధికి నోచుకోలేదు..

- కొత్తగా 6 గ్రామాలను కార్పొరేషన్లో కలపడం ఎందుకు..?
- ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాము..
- బిజెపి కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్



**కరీంనగర్ వెలుతురు డిసెంబర్ 21:**
కరీంనగర్ నగరపాలక సంస్థలో గతంలో విలీనం చేసుకున్న 8 గ్రామాలు నేటికీ ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదని, కనీసం తాగునీటి సదుపాయం కూడా కల్పించలేని దుస్థితిలో మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నప్పుడు, కొత్తగా ఆరు గ్రామాలను కార్పొరేషన్ లో విలీనం చేయడం అన్యాయమని, ఈ విషయంలోప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తున్నామని బిజెపి కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ అన్నారు. శనివారం రోజున కరీంనగర్ నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ కొత్తగా 6 విలీన గ్రామాలను కరీంనగర్ కార్పొరేషన్ లో విలీనం చేస్తూ నిన్న రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ మున్సిపల్ కార్పొరేషన్ తీర్మానం పెట్టాలని మాట్లాడారు. గతంలో కార్పొరేషన్ లో విలీనమైన గ్రామాలు పూర్తిస్థాయిలో నేటికీ అభివృద్ధికి నోచుకోవడం లేదని, కనీసం స్ట్రీట్ లైట్స్, మురికి కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణం జరగలేదన్నారు. గతంలో విలీనమైన గ్రామాల్లో ప్రస్తుత డివిజన్లో ప్రత్యేక నిధులు కేటాయించి , ఆ ప్రాంతాలు అభివృద్ధి చేసిన తర్వాతే కొత్తగా గ్రామాల విలీనం చేయాలన్నారు.

# నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్ మెంబర్ గా ఎన్నికైన గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ డాక్టర్ శరత్ నాయక్ ఐఏఎస్ గారిని కలిసి అభినందనలు తెలియజేసిన బీసీ నేత లింగంగౌడ్

**వెలుతురు హైదరాబాద్ డిసెంబర్ 21:**



నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్ సభ్యుడిగా గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ శరత్ నాయక్ గారిని కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేయడం పట్ల బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కలసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ సామాన్య మారుమూల గిరిజన కుటుంబంలో జన్మించి బాగా కష్టపడి అంచలంచెలుగా ఎదిగినటువంటి శరత్ నాయక్ గారికి ఈ అవకాశం రావడం సంతోషించదగ్గ విషయమని అన్నారు. దేశంలోని ఏ రాష్ట్రాలలో అయితే గిరిజన జనాభా ఎక్కువగా ఉండి అక్షరాస్యత తక్కువగా ఉన్న రాష్ట్రాలలో శరత్ నాయక్ గారి ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేసి గిరిజనుల అభివృద్ధికి పాటుపడాలని ఆయన లింగంగౌడ్ ఆకాంక్షించారు.

# ప్రీమియర్ షోలు రద్దు అభినందనీయం

- అసెంబ్లీలో సీఎం ప్రకటనపై ఢిల్లీలో రాచాల హర్షం

**న్యూఢిల్లీ వెలుతురు డిసెంబర్ 21:**
ప్రీమియర్ షోలకు అనుమతులు ఇవ్వబోమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించడం పట్ల బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ఢిల్లీలో హర్షం వ్యక్తం చేశారు. శనివారం న్యూఢిల్లీ లోని తెలంగాణ భవన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సంధ్య థియేటర్ ఘటనపై హీరో అల్లు అర్జున్, చిత్ర యూనిట్, థియేటర్ యాజమాన్యంపై తాము శుక్రవారం జాతీయ మానవ హక్కుల సంఘానికి ఫిర్యాధు చేశామని,వేగంగా స్పందించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబానికి 25 లక్షల రూపాయల ఆర్థిక సాయం ప్రకటించడమే కాకుండా అధికారంలో వున్నంతవరకు బెనిఫిట్ షోలు, టికెట్లు రేట్ల పెంపుకు అనుమతించే ప్రసక్తే లేదని సిఎం అసెంబ్లీలో ప్రకటించడం హర్షణీయమన్నారు. సంధ్య థియేటర్ ఘటనపై ప్రభుత్వం మొదటి నుంచి సీరియస్ గానే ఉందని, సెలబ్రిటీ



అయినా కూడా లెక్కచేయకుండా హీరోని అరెస్ట్ చేసి సామాన్యుల పక్షం వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. పెద్ద సినిమాలను ప్రోత్సహించడం కాకుండా చిన్న సినిమాలకు ప్రోత్సాహకాలు అందిస్తే సినీ పరిశ్రమ నిలదొక్కుకుంటదని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం సామాన్య ప్రజల విషయంలో వ్యవహరిస్తున్న తీరుపై తెలంగాణ సమాజం హర్శిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిసి పొలిటికల్ జెఎసి నాయకులు అనంతుల రామ్మూర్తి గౌడ్, బడేసాబ్, రాఘవేందర్ గౌడ్,అంజన్న యాదవ్, మహేందర్ నాయుడు, గౌతమ్ శంకర్ గౌడ్, దేవర శివ తదితరులు పాల్గొన్నారు.

# అన్నిటి కంటే విలువైనది భూమి

## రాష్ట్ర శాసన మండలిలో భూ భారతి బిల్లును ప్రవేశ పెట్టిన రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి

## సుదీర్ఘంగా మాట్లాడిన మంత్రి శ్రీనివాసరెడ్డి



(రాపర్తి భాస్కర్ గౌడ్)
**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 21:**
శని వారం నాడు రాష్ట్ర శాసన మండలిలో భూభారతి బిల్లు ప్రవేశ పెట్టిన సందర్భంగా రాష్ట్ర రెవెన్యు శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో భూ భారతి చట్టం మాకు రెఫరండమే అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు, మనిషికి అన్నిటి కంటే విలువైనది భూమి ,జీవితం భూమి చుట్టూ తిరుగుతుం దని ఆయన అన్నారు, ప్రపంచంలో అన్నింటికన్నా విలువైనది, ఉత్తమమైనది,ప్రాణప్రదమైంది, బతుకునిచ్చేది,బువ్వపెట్టేది.భూమి ఒక్కటేనని మంత్రి చెప్పారు,ఏ చరిత్ర చూసినా భూమి కోసం పోరాటాలు, మనకు తెలిసిందే. మనిషికి తన భూమి అంటే ప్రాణం.అటువంటి ప్రాణాన్ని యమధర్మరాజు లాంటి ధరణి తీసుకుపోతే వారి గతి ఏమిటి? కానీ యుముడి నుంచి తెలివిగా తన భర్త ప్రాణాలను తెచ్చుకున్న సతీ సావిత్రిలా ఇప్పుడు భూభారతితో ధరణిలో పోయిన భూములు ఇప్పుడు తిరిగి హక్కుదారులకు చేరే పరిస్థితి ఏర్పడిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు,ఆనాటి నియంతృత ప్రభుత్వం నలుగురి కోసం ఒకరిద్దరు కలిసి చట్టాన్ని తయారు చేస్తే ఈనాటి ఇందిరమ్మ ప్రభుత్వం నాలుకోట్ల మంది కోసం అందరి అభిప్రాయాలను. ఆలోచనలను సూచనలను. సలహాలను.ప్రజల ఆకాంక్షలను పరిగణ లోకి తీసుకొని చట్టాన్ని రూపొందించామనీ మంత్రి శ్రీనివాసరెడ్డి తెలిపారు, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు నేరుగా ఉపయోగపడే భూభారతి రానున్న కాలంలో దేశంలోని ఎన్నో రాష్ట్రాలకు మార్గదర్శి కానుంది. ఇటువంటి బిల్లును చూసి బి ఆర్ ఎస్ నేతలకు కన్నుకుట్టింది. ఇటువంటి చట్టం చేయలేకపోయామే అన్న బాధ, భూభారతి ప్రజామోదం పొందిందన్న ఉక్రోషం వారికి నిద్ర పట్టనీయడం లేదు. అందుకే శాసనసభలో గలాటా చేశారు. అయితే ప్రజలకు వీరి కపట నాటకం అర్ధమయిపోయిందన్నారు, భూభారతి పేరులోనే ప్రత్యేకత ఉంది. భూమిని భారతదేశాన్ని కలిపే ఈ భూభారతి నిజంగా ప్రజలకు మంగళప్రదమైన హారతిని పడుతుంది. భూ యజమానుల జీవితాల్లో సరికొత్త కాంతులను ప్రసరింపజేస్తుందని అన్నారు, ముందుంది ముసళ్ల పండగ అంటుంటారు.ఈ భూభారతి పూర్తిగా అమలులోకి వస్తే బి ఆర్ ఎస్ పెద్దలు దోచుకున్న భూముల వివరాలు బయటపడతాయి. అప్పుడు తెలుస్తుంది ఈ చట్టం పవర్ ఏమిటో అని మంత్రి అన్నారు,

### 2024 భూభారతి చట్ట మా ఇందిరమ్మ ప్రభుత్వానికి శ్రీరామరక్ష

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో భూ భారతి చట్టం మాకు రెఫరండమే అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు,మన దేశంలో కానీ రాష్ట్రం లో కానీ 2014కు ముందు కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు తీసుకున్ననిర్ణయాలు ,సంస్కరణలు చట్టాలు ఈనాటి వరకు కూడా రైతులకు సామాన్యులకు ఎంతో మేలు చేశాయని మంత్రి తెలిపారు,
2020 నూతన రెవెన్యూ చట్టం.మరియు ధరణి పోర్టల్ కర్త, కర్మ, క్రియా.ధరణి ఒక విప్లవాత్మకం అని చెప్పిన.ఆనాటి ముఖ్యమంత్రి.ఈనాటి ప్రతిపక్ష నేత కె.సి.ఆర్. తెలంగాణ సమాజంలో సృష్టించిన విధ్వంసం ఏమిటో ఇక్కడ ఉన్న మనందరికీ తెలిసిందే అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు,తెలంగాణ ప్రజానీకం తమ భూముల విషయంలో పెట్టుకున్న ఆశలను.ఆకాంక్షలను.గత పది సంవత్సరాలలో బి.ఆర్.ఎస్. ప్రభుత్వం.సమాధి చేసిందని రెవెన్యూ సంస్కరణల పేరుతో గత ప్రభుత్వం చేసిన దాష్టికానికి తెలంగాణ ప్రజానీకం అనుభవించిన బాధలు అన్నీ ఇన్నీ కావు అని మంత్రి తెలిపారు,ధరణి పేరిట బి.ఆర్.ఎస్. సర్కారు చేసిన నిర్వాకం తెలంగాణ రైతాంగం పాలిట ఒక భూతంగా మారిందని మంత్రి తెలిపారు, తెలంగాణ ప్రజల ఆలోచనలు. ఆకాంక్షలకు అనుగుణంగా చట్టాలు తీసుకురావాలి,తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్షలను నెరవేర్చే విధంగా ఉండాలీ కానీ గడీల మధ్య కూర్చొని ఇద్దరు వ్యక్తులు కుట్రపూరితంగా, మోసపూరితంగా తీసుకొచ్చిన ధరణి చట్టం వల్ల అన్నం పుణ్యం ఎరగని అమాయక రైతులు రోడ్డున పడ్డారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు,విత్తు మంచిదైతే.చెట్టు మంచిదవుతుందనే సామెత.చట్టం మంచిదైతే ప్రజలకూ మేలు జరుగుతుంది.కానీ ఈ చట్టం వలన ప్రజలు ఎంతగానో నష్టపోయారని మంత్రి అన్నారు,దుక్కి చాలని చేనుకి.ఎరువెంత వేసినా వ్యర్థమే.ప్రజలకు పనికిరాని ఈ చట్టాలు ఎన్ని చేసినా శూన్యమేనని మంత్రి పేర్కొన్నారు,ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలు,చట్టాలు, సంస్కరణలు,ఎప్పుడు కూడా ప్రజలకు ఉపయోగపడేలా, ప్రజా కోణంలో ఉండాలని అన్నారు, సమాజం పురోగమన దిశలో పయనించేలా ఉండాలి,లేదా ఇబ్బందులను కనీసం కొంత మేరకైనా తగ్గించాలని మంత్రి సూచించారు,కానీ.దీనికి భిన్నంగా గత ప్రభుత్వం ఆనాడు నూతన రెవెన్యూ చట్టం ద్వారా తీసుకువచ్చిన ధరణి పోర్టల్ ఇందుకు భిన్నంగా ఉందని తెలిపారు, తెలంగాణ సమాజం తిరోగమన దిశలో ప్రయాణించే విధంగా, సమస్యలు పరిష్కారం కాకపోగా కొత్త సమస్యలను సృష్టించిందని మంత్రి అన్నారు,తెలంగాణ విప్లవాల గడ్డ,పేమకు ప్రాణమిచ్చే తెలంగాణ. అహంకారాన్ని సహించదు.అని శాసనసభ, పార్లమెంటు ఎన్నికల్లో రుజువదని అసెంబ్లీ ఎన్నికల సమయంలో ధరణికి ఓటేస్తారో.. ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని చెప్తున్న కాంగ్రెస్ కు ఓటేస్తారో తేల్చుకోండి అని ఆనాటి పెద్ద మనిషి ఇచ్చిన పిలుపుకు తెలంగాణ ప్రజానీకం ఏ తీర్పు ఇచ్చిందో మన అందరికి తెలుసు. తెలంగాణ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత ముగింపు పలికేలా భూ భారతి చట్టాన్ని తీసుకు వచ్చామని మంత్రి తెలిపారు, తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఏ సమస్యలు తీరుతాయని ఆశించామో ఆ సమస్యలు తీరకపోగా, పరిష్కారం కాకపోగా కొత్త సమస్యలు తెచ్చిపెట్టాయని చెప్పడానికి చక్కటి ఉదాహరణ -2020 రెవెన్యూ చట్టం అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు,ప్రజల ఆలోచనలు, ఆకాంక్షల మేరకు చట్టాలు చేయకుండా పాలకులకు అనుకూలంగా వారి అవసరాలకు అనుగుణంగా చీకటి గదుల్లో ఒకరిద్దరు కలిసి రాత్రికి రాత్రే చట్టాలు చేస్తే వాటి ఫలితాలు ఎలా ఉంటాయో 2020 ఆర్వోఆర్ చట్టం ఇందుకు నిదర్శనం. అప్పటివరకు ఏ భూసమస్య లేని రైతులకు ఈ చట్టం కొత్త సమస్యలను తెచ్చిపెట్టాయని మంత్రి తెలిపారు,




### ధరణి చట్టంలో ఉన్న లోపాలు

- ధరణి రికార్డుల సవరణకు ఏ అధికారికి అధికారం లేదు.
- ప్రతి సమస్య పరిష్కారానికి కోర్టు మెట్లు ఎక్కాల్సిందే. ప్రతిరోజు కొన్ని వేల కేసులు రాష్ట్రంలోని వివిధ సివిల్ కేసులు నమోదు అవుతున్నాయి.
- ఒక్కప్పుడు రైతుకు భూమికి సంబంధించి ఏ కష్టం వచ్చినా రెవెన్యూ కార్యాలయాల్లో పరిష్కారం దొరికేది. కానీ ధరణి వచ్చిన తరువాత రైతులు కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి వచ్చింది. వేల రూపాయలు ఖర్చుపెట్టుకొని చెప్పులు అరిగేలా కోర్టుమెట్లు ఎక్కడం దిగడంతో రైతు జీవితం గడచిపోతుంది.
- ఎలాంటి అప్పీల్, రివిజన్ చేసుకునే మెకానిజం లేదు.
- భూరికార్డుల ప్రక్షాళన జరుగుతున్న సందర్భంగా చిన్నా చితక సమస్యలు ఉన్నాయని తరువాత రోజుల్లో పరిష్కారం చేస్తామని పార్టు-బి అనే జాబితాలో పొందుపర్చారు. మిగతా భూములను పార్టు-ఏ లో చేర్చి కొత్త పాసుపుస్తకాలు ఇచ్చారు.
- భూ రికార్డుల ప్రక్షాళన సమయంలో పార్టు-బి లో చేర్చిన భూములకు ఎలాంటి పరిష్కారం ఈ చట్టం చూపలేదు.
- కొత్తగా ఇచ్చిన పట్టాదారు పాసుపుస్తకాలలో కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేస్తామని ఒక వేళ పట్టాదారు చనిపోతే ఆ సభ్యుల పేరు మీద పట్టా మార్పిడి ఆటోమెటిక్‌గా చేస్తామని చెప్పారు.
- కానీ పాసుపుస్తకంలో అలాంటి వివరాలు ఏవీ ఇప్పటికీ నమోదు కాలేదు. మరోపక్కా మ్యుటేషన్ చేసే ముందు విచారణ చేసే అధికారం లేకపోవడంతో భాగపంపకాలలో అన్నాదమ్ముళ్ల మధ్యన ఆస్తి తగాదాలు పెరిగాయని మంత్రి ఆరోపించారు,

### భూ సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యం గా భూభారతి చట్టం

భూభారతి పేరులోనే ప్రత్యేకత ఉంది. జననీ, జన్మభూమి ఈ రెండూ మనిషి జీవితాన్ని ప్రభావితం చేసేవే. కన్నతల్లి, మాతృదేశం మనకు ముఖ్యం. మన దేశ ఔన్నత్యం, ఆత్మీయతలు జన్మభూమితోనే ముడిపడి ఉన్నాయి. దేశంలోని 18 రాష్ట్రాలలో ఉన్న ఆర్ ఓ ఆర్ చట్టాలను పూర్తిగా అధ్యయనం చేసి వాటిని వడపోసి ప్రజలకు అత్యంత ఉపయోగపడేలా ఈ నూతన చట్టానికి ప్రాణం పోశాం, రంగారెడ్డి జిల్లా యాచారం మండలం, నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని తిరుమలగిరి మండలంలో పైలట్ ప్రాజెక్టు ప్రాజెక్ట్ నిర్వహించడం జరిగిందని మంత్రి తెలిపారు,రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి విస్తృతస్థాయిలో అభిప్రాయాలను సూచనలు సలహాలను స్వీకరించడం జరిగింది. ఈ బిల్లు దేశానికే దిక్సూచిగా ఉంటుందని చెప్పడానికి గర్వపడుతున్నాను. ఒక విధంగా చెప్పాలంటే జాతీయస్థాయిలో నెంబర్ వన్ గా దేశానికి ఆదర్శంగా ఒక రోల్ మోడల్ గా ఈ చట్టం ఉండబోతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు,



## కీర్తి సుధాకర్ గురు స్వామి 18 నారికేల పడిపూజ మహోత్సవం

- ముఖ్యఅతిథిగా హాజరైన సమ్మి గౌడ్ ఫౌండేషన్ చైర్మన్ సమ్మయ్య గౌడ్



**కేసముద్రం వెలుతురు డిసెంబర్ 2:** శ్రీ ధర్మశాస్త్ర దేవాలయ గురుస్వాముల ఆధ్వర్యంలో కీర్తి సుధాకర్ గురుస్వామి 18 నారికేల పడిపూజ మహోత్సవం శుక్రవారం ఆలయ ప్రధాన మంత్రివర్యులు కల్లూరి మఠం విష్ణు నారాయణ పొట్టి దివ్య హస్తములచే అయ్యప్ప స్వామి దివ్య పడిపూజను కేసముద్రం విలేజ్ లో గ్రామ అయ్యప్ప భక్త బాంధవుల సమక్షంలో స్థానిక ఆంజనేయస్వామి దేవాలయంలో కొబ్బరి చెట్టు నాటడం జరిగినది. అనంతరం పడిపూజ మహోత్సవం ప్రారంభమై 11 గంటల 15 నిమిషాలవరకు అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. సమ్మి గౌడ్ ఫౌండేషన్ చైర్మన్ సుధాకర్ స్వామికి, విష్ణు నారాయణ పొట్టి స్వాములకు శాలువాలతో సత్కరించి ఆశీర్వాదం తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల గురు స్వాములు మార్కెట్ డైరెక్టర్ మర్రి రంగారావు, సమ్మిగౌడ్ ఫౌండేషన్ అధినేత చిలువేరు సమ్మయ్య గౌడ్, ఆలయ అధ్యక్షులు వోలం చంద్రశేఖర్, కార్యదర్శి పోలేపల్లి యాకూబ్ రెడ్డి, నాగేశ్వర చారి, ధర్మకర్తలు చింత నాగేశ్వరరావు, తంగళ్ళపల్లి భాస్కర్, అన్నదాన ప్రసాద వితరణ మండలి కూరెల్లి సతీష్, పెరుమాండ్ల ఎల్ల గౌడ్, సోల్జర్ మిత్రులు కేసముద్రం విలేజ్ మట్టి గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ గురు స్వాములు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు...

## మాజీ ప్రధాన మంత్రి వాజ్ పేయి 100 వ జయంతి పై చర్చించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 21:**



శని వారం హైదరాబాద్, నాంపల్లిలోని తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో డిసెంబరు 25వ తేదీన మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 100వ జయంతి సందర్భంగా చేపట్టనున్న కార్యక్రమాలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ , పార్టీ రాష్ట్ర ముఖ్య నాయకులతో కలిసి కిషన్ రెడ్డి చర్చించారు, ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై వివిధ మోర్చాల అధ్యక్షులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులతో చర్చించారు,

## స్కేటింగ్ రంగంలో దూసుకుపోతున్న జెస్సీరాజ్

- ప్రధానమంత్రి జాతీయ బాల పురస్కార్ అవార్డుకు ఎంపికైన చిన్నారి
- జెస్సీ ఎంతోమంది యువ క్రీడాకారులకు స్ఫూర్తి
- ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసా




**అమరావతి, డిసెంబర్ 21( వెలుతురు):** గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన స్కేటింగ్ క్రీడాకారిణి జెస్సీరాజ్ ను ప్రతిష్ఠాత్మక 'ప్రధానమంత్రి జాతీయ బాల పురస్కార్ - 2025' వరించింది. ప్రతి ఏటా దేశవ్యాప్తంగా వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన 25 మంది చిన్నారులకు కేంద్ర ప్రభుత్వం ఈ పురస్కారాన్ని అందిస్తుంది. 14 ఏళ్ల జెస్సీరాజ్ ప్రస్తుతం తొమ్మిదో తరగతి చదువుతోంది. ప్రతిష్ఠాత్మకమైన పురస్కారానికి ఎంపికైన జెస్సీరాజ్ ను ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసించారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ... ప్రధానమంత్రి జాతీయ బాల పురస్కార్ అవార్డుకు ఎంపికైన స్కేటర్ జెస్సీరాజ్ కు అభినందనలు తెలియజేశారు. ఆమె సాధించిన విజయాలు ఏపీకి గర్వకారణమని చెప్పారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకోబోతున్నారని తెలిపారు. 9 ఏళ్ల వయసులో ఆమె స్కేటింగ్ రంగంలో తన ప్రయాణాన్ని ప్రారంభించిందని... ఆమె పట్టుదల, అంకితభావం ఆమెను ఈరోజు గొప్ప గౌరవాన్ని అందుకునే స్థాయికి తీసుకొచ్చిందని కొనియాడారు. ఎంతో మంది యువ క్రీడాకారులకు ఆమె ఒక స్ఫూర్తి అని చెప్పారు. ఇటీవల జరిగిన 62వ జాతీయ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్స్ లో సోలో డ్యాన్స్ లో ఆమె సిల్వర్ మెడల్ సాధించారు.

# కరీంనగర్ స్మార్ట్ సిటీగా కనిపిస్తుందా..! గుండె మీద చేయి వేసుకుని చెప్పండి..?

- అధికారుల నిర్లక్ష్యం తో స్మార్ట్ సిటీ పథకం పూర్తిగా అక్రమాలపరమైంది...
- పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి...
- స్మార్ట్ సిటీ పనుల పురోగతిపై ఎప్పుడైనా కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారా..?
- మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ప్రశ్నించిన కార్పొరేటర్ వంగల శ్రీదేవి పవన్...

**కరీంనగర్ వెలుతురు డిసెంబర్ 21:** కేంద్ర ప్రభుత్వం మంచి ఆలోచనతో కరీంనగర్ ను స్మార్ట్ సిటీగా ఎంపిక చేస్తే... పనులన్నీ ఎక్కడికక్కడ ఆగిపోయాయి? అసలు కరీంనగర్ స్మార్ట్ సిటీగా కన్పిస్తోందా? మీ గుండె మీద చేయి వేసుకుని చెప్పండని కార్పొరేటర్ వంగల శ్రీదేవి పవన్ శనివారం జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ప్రశ్నించారు..



సమావేశంలో కార్పొరేటర్ శ్రీదేవి అనేక అంశాలను లేవనెత్తి మాట్లాడారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల స్మార్ట్ సిటీ పథకం పూర్తిగా అక్రమాల పరమైందని, స్మార్ట్ సిటీ పనులన్నీ ఎక్కడిక్కడ ఆగిపోయాయన్నారు. కరీంనగర్లో జరుగుతున్న అభివృద్ధి పనుల నిధులు ఒకరేమో సీడీఎఫ్ నిధులంటారు. ఇంకొకరేమో స్మార్ట్ సిటీ ఫండ్స్ అంటారని , అసలు స్మార్ట్ సిటీ స్కీం కింద ఎన్ని నిధులు కేటాయించారు? ఏయే పనులకు ఎంతెంత ఖర్చు చేశారు? వాటి పురోగతి ఏమిటి? పూర్తి రిపోర్ట్ ఇవ్వాలన్నారు. స్మార్ట్ సిటీ పనుల్లో అక్రమాలు జరిగినట్లు అనేక వార్తలొచ్చాయని, బాధ్యులపై ఏం చర్యలు తీసుకున్నారన్నారు. అలాగే సీడీఎఫ్ నిధులు ఎన్ని మంజూరయ్యాయి? వాటిని ఏయే పనులకు వినియోగించారు? ఎంత ఖర్చు చేశారు?.. పూర్తి వివరాలు ఇవ్వాలన్నారు. ముఖ్యంగా స్మార్ట్ సిటీ పనుల పురోగతిపై ఎన్నడైనా కరీంనగర్ కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారా అని ప్రశ్నించారు. ఇకనైన కార్పొరేటర్లకు బ్యాచ్ ల వారీగా స్మార్ట్ సిటీ, సీడీఎఫ్ నిధులు, పనుల పురోగతిపై ప్రత్యేక అవగాహన శిబిరం నిర్వహించాలని ఆమె ఈ సందర్భంగా కోరారు.

## కష్ట పడ్డాను.. అనుకున్నది సాధించాను : నిఖత్ జరీన్

**మేడిపల్లి, వెలుతురు:-** విద్యార్థులలో క్రీడాస్ఫూర్తిని నింపి నైపుణ్యం వెలికి తీయడం వలన ఉన్నత శిఖరాన్ని అధిరోహిస్తారని నిఖత్ జరీన్ అన్నారు. క్రీడా ఉత్సవాన్ని పురస్కరించుకొని గ్లోబల్ ఇండియన్ ఇంటర్నేషనల్ పాఠశాలలో అంతర్గత క్రీడలకు ముఖ్య అతిదిగా బాక్సర్ నిఖత్ జరీన్ పాల్గొని ఆటలను తిలకించారు. ఈ పోటీలలో చాల మంది విద్యార్థినీ, విద్యార్థులు తమ ప్రతిభతో విజయం సాధించి పతకాలు పొందారు. ఈ సందర్భంగా నిఖత్ జరీన్





మాట్లాడుతూ అనుకున్నది సాధించడానికి నిరంతరం కృషి చేయాలని, నేను కూడ ఎంతో కష్టపడి క్రమశిక్షణతో అనుకున్నది సాదించగలిగానని అన్నారు. మీరు కూడా క్రమశిక్షణతో ఉన్నప్పుడు అనుకున్నది సాధించగలరని, క్రీడల వల్ల మానసికంగా శారీరకంగా దృఢంగా ఉంటారు కాబట్టి ప్రతి తల్లిదండ్రులు పిల్లల్ని ఉత్సాహించాలని కోరారు. అలాగే మరో ముఖ్య అతిథిగా విచ్చేసిన హైదరాబాద్ రంజీ క్రికెట్ ప్లేయర్ రవితేజ మాట్లాడుతూ పాఠశాలలోనీ శ్రీరామచవం చాలా ఆకట్టుకుందని అన్నారు. పాశ్చాత్య, శాస్త్రీయ నృత్యాలను చూస్తున్న వీక్షలు కరతాళ ధ్వనులతో ప్రాంగాణం మారుమోగింది. అనంతరం పాఠశాల చైర్మన్ మాగంటి నరసింహ మూర్తి విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమని క్రీడలు జీవితంలో ఒక భాగం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాగంటి సరస్వతి, ప్రిన్సిపాల్ రాదిక, వైస్ ప్రిన్సిపల్ ప్రభాకర్, ఉప ప్రధానోపాధ్యాయురాలు కల్పన, కో ఆర్డినేటర్ మాదవి, ఎస్తర్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రవెల్లి ముత్యాలమ్మ దేవాలయంలో పూజలు

- దేవాలయం లో మౌళిక వసతులు కల్పించాలి.
- జై గౌడ సంక్షేమ సంగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పంతంగి వీరస్వామి గౌడ్.

**వెలుతురు న్యూస్ సూర్యాపేట డిసెంబర్ 21** సూర్యాపేట పట్టణం లోని తాళ్ల గడ్డ లోని ఇంద్రవెల్లి ముత్యాలమ్మ దేవాలయంలో శనివారం గౌడ సంఘం కుల పెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జై గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పంతంగి వీరస్వామి గౌడ్ ఆధ్వర్యంలో దేవాలయం లో కుల పెద్దలు దేవాలయం చైర్మన్ బైరు వెంకన్న గౌడ్, లైన్స్ క్లబ్ సర్వీస్ చైర్మన్ కుమ్మరికుంట్ల లింగయ్య జై గౌడ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జలగం సత్యం గౌడ్ సూర్యాపేట గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు కేక్కి రేణి నాగయ్య తో కలిసి పూజలు చేశారు. ఈ సందర్భంగా పంతంగి వీరస్వామి గౌడ్ అయన మాట్లాడుతు సూర్యాపేట పట్టణనికి చెందిన ఐతగాని మల్లయ్య కుమారుడి వివాహ మహోత్సవం



సందర్భంగా దేవాలయం లో తోరణాలతో అలంకరణ చేసి కుల పెద్దలతో కలిసి కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించిన్నట్లు చెప్పారు. ఇంద్రవెల్లి ముత్యాలమ్మ ఆశీస్సులు ప్రజలకు ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. దేవాలయం లో భక్తుల సౌకర్యర్థం మౌళిక వసతులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ను కోరారు. ఎంతో పేరు గాంచిన ఇంద్రవెల్లి ముత్యాలమ్మ దేవాలయం అభివృద్ధి లో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఐతగాని మల్లయ్య కుమారుడు డాక్టర్ సందీప్ గౌడ్ వివాహ మహోత్సవం సందర్భంగా అయన నివాసంలో మామిడి తోరణాల అలంకరణ కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంద్రవెల్లి ముత్యాలమ్మ గుడి చైర్మన్ బైరు వెంకన్న గౌడ్ సూర్యాపేట లైన్స్ క్లబ్ సర్వీస్ చైర్మన్ కుమ్మరికుంట లింగయ్య జై గౌడ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జలగం సత్యం గౌడ్ సూర్యాపేట జిల్లా గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు కెక్కిరేణి నాగయ్య గౌడ్, రాపర్తి శ్రీనివాస్ గౌడ్ కౌన్సిలర్, రాపర్తి శ్రీనివాస్ గౌడ్, బూర బాల సైదులు గౌడ్, కెక్కిరేణి ఆనంద్ గౌడ్, రాపర్తి రాము, నర్సింగ్ నాగరాజు, రాపర్తి సైదులు, బైరు నాగరాజు, కెక్కిరేణి యాదగిరి, రాపర్తి జానయ్య, దుర్గయ్య, రమేష్, లక్ష్మయ్య, సైదులు, నాగరాజు, నాగేందర్, సైదులు, పాపయ్య, రమేష్, పర్శి, దేవేందర్, నగేష్, మహేష్, అంజయ్య, పాల సైదులు, మరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల గంజ్ భువనగిరి లో ఘనంగా ఆహారోత్సవం, గణిత ఉత్సవం కార్యక్రమాలు

**భువనగిరి వెలుతురు డిసెంబర్ 21:** ప్రభుత్వ పాఠశాల గంజ్ భువనగిరి లో ఘనంగా ఆహారోత్సవం, గణిత ఉత్సవం కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. శనివారం రోజున అనగా 21 12 2024 నాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల గంజ్ బోనగిరి నందు తల్లిదండ్రుల సమావేశ ఏర్పాటు చేయడం జరిగింది దీనిలో భాగంగా ఈరోజు ఫుడ్ ఫెస్టివల్ మరియు రామాను జయంతి సందర్భంగా గణిత దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి ఈ నాగవర్ధన్ రెడ్డి సార్ హాజరై ఫుడ్ ఫెస్టివల్ స్టాల్స్ ను మరియు విద్యార్థులు స్వతహాగా తయారుచేసిన గణిత టి ఎల్ ఎం ను సందర్శించే విద్యార్థులను అడిగి వాటి ప్రాముఖ్యతను తెలియజేయడం జరిగింది తదనంతరం సమావేశం విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుక గారి అధ్యక్షతన జరిగింది. ఇట్టి కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు మరియు పాఠశాల ఉపాధ్యాయులు AVSSR మూర్తి, విజయశ్రీ, ఉపేంద్ర, రమణ, ఉమా, శర్మ పి సంతోష్. డి రామలింగయ్య, శ్రవన్ , వాణి , శెహనాజ, పాల్గొనడం జరిగింది







## హామీలు,మేనిఫెస్టోలపై బిఆర్ఎస్ అబద్ధాలు

సభలో గందరగోళం ఏర్పడింది. దీంతో మంత్రి కోమటి రెడ్డి సభలో మాట్లాడుతూ.. నల్గొండ జిల్లాలో కాళేశ్వరం నీళ్లు ఒక్క ఎకరానికి ఇచ్చినట్లు నిరూపించినా తాను రాజీనామా చేస్తానని మంత్రి అన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు ఏం మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. చర్చకు రావాలని హరీష్ రావు, కేటీఆర్ లకు సవాల్ విసిరిన కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నల్గొండకు నీళ్లు ఎవరు ఇచ్చారో అడగాలని ప్రశ్నించారు. నల్గొండ జిల్లాలో ఎకరాకు కాళేశ్వరం నీళ్లు ఇచ్చారని నిరూపిస్తే రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వల్లే ఏఎంఆర్‌బీ వచ్చిందని గుర్తు చేశారు.తన బావ, మామ నల్గొండ ప్రజలను చంపేస్తారా? వాళ్ళని చంపేయండి అని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి మూసీని సరిచేస్తున్నారన్నారు. అందుకు కూడా తన బావ, మామ అడ్డుపడుతున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో 24 గంటల కరెంటు ఇవ్వలేదన్నారు. 24గంటల కరెంట్ ఇవ్వలేదని లాగ్ బుక్స్ తెచ్చి చూపిస్తా అన్నారు. ఎక్సైజ్ టెండర్లు ఒక ఏడాది ముందు పెట్టారు.. రూ.2 వేల కోట్లు ముందుగా వసూలు చేశారన్నారు. కేటీఆర్ సభను తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో కేవలం 14 గంటల కరెంటు మాత్రమే ఇచ్చారన్నారు. నేను సబ్ స్టేషన్ వెళ్లి చెక్ చేశానని తెలిపారు. నేను ఎమ్మెల్యే, ఎంపీగా గత పదేళ్లుగా పని చేశానని సభలో తెలిపారు. కేసీఆర్ పాలనలో 24 గంటల కరెంటు ఇవ్వలేదన్నారు. ఎక్సైజ్ టెండర్లు 2లక్షలు పెట్టి రూ.2వేల కోట్లు వసూళ్లు చేశారు? ఆ డబ్బులు ఎక్కడికి వెళ్ళాయో తెలీదన్నారు. తెలంగాణ వచ్చాక నష్టపోయిన జిల్లా నల్గొండ అని తెలిపారు. తెలంగాణ వస్తే దళితున్ని ముఖ్యమంత్రి చేస్తా అన్నారు కేసీఆర్ మాట తప్పారని తెలిపారు. హామీల గురించి, మేనిఫెస్టోల గురించి బిఆర్ఎస్ మాట్లాడడంవిడ్డూరంగా ఉందన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలన..వందేళ్లు వెనక్కి తీసుకెళ్ళారని కీలక వ్యాఖ్యలు చేశారు. కూలిపోయే ప్రాజెక్టులు మాత్రమే కట్టారన్నారు. ఇంటింటికి నీళ్లు ఇయ్యకపోతే ఓట్లు అడుగా అన్నావ్ అన్నారు. సిరిసిల్లకు పోదాం ఏ ఇంటికి నీళ్లు వస్తున్నాయో తెలుస్తుందన్నారు. నల్గొండ జిల్లా సూర్యాపేటకు వెళ్దాం అన్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు కట్టింది ఎవరు? అని ప్రశ్నించారు. బావ,బామ్మర్దికి నల్గొండ జిల్లాపై కోపం ఎందుకని మండిపడ్డారు. మాకు విషం ఇచ్చి చంపండని మంత్రి తెలిపారు. ఉచిత విద్యుత్ అందించింది కాంగ్రెస్.. దాని పేటెంట్ హక్కు కాంగ్రెస్‌దే. భారాస పాలనలో నీళ్లు, విద్యుత్.. ఏమీ ఇవ్వలేదు. వాళ్ల పాలనలో కూలిపోయే ప్రాజెక్టులు కట్టారు. మిషన్ భగీరథ ద్వారా కుళాయి నీళ్లు వచ్చాయని ప్రజలు చెబితే.. మరో సారి ఓట్లు అడగం. మిషన్ భగీరథలో రూ.50 వేలకోట్లు తినేశారు' అని కోమటిరెడ్డి ఆరోపించారు. అయితే మంత్రి ఆరోపణలను భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు ఖండించారు. 'మిషన్ భగీరథకు అయిన ఖర్చు రూ.28 వేల కోట్లు. రూ.50 వేల కోట్లు తిన్నారని మంత్రి కోమటిరెడ్డి ఎలా మాట్లాడతారు? మంత్రి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలి. కాళేశ్వరం ద్వారా నల్గొండ జిల్లాలో 2 లక్షల ఎకరాలకు నీళ్లు అందించాం. నల్గొండలో వైద్య కళాశాల పెట్టింది కేసీఆర్. ఉమ్మడి నల్గొండలో యాదాద్రి పవర్ ఎ÷-లాంట్‌ను ఏర్పాటు చేశాం' అని హరీశ్ రావు అన్నారు.

## కొత్త సంవత్సరం వేళ డ్రగ్స్ కలకలం

న్యూఇయర్ వేడుకల్లో డ్రగ్స్ వినియోగానికి ప్రయత్నిస్తుంటారు. ఇప్పటికే వివిధ రాష్ట్రాల నుంచి పలు విధాలుగా డ్రగ్స్‌ను నగరానికి తీసుకువచ్చేందుకు యత్నించారు. అయితే వారి చర్యలను పోలీసులు ఎప్పటికప్పుడు భగ్నం చేస్తూ వచ్చారు. డ్రగ్స్ సరఫరాపై గత కొద్దిరోజులుగా నిఘా పెట్టిన పోలీసులు.. పెద్ద మొత్తంలో డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న వారిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. డ్రగ్స్‌తో పాటు గంజాయి, హెరాయిన్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఇదిలా ఉండగా.. న్యూఇయర్ వేడుకల్లో డ్రగ్స్ వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఈ అంశంపై నార్కోటిక్ బ్యూరో ఎస్పీ సాయి చైతన్య మాట్లాడుతూ.. న్యూ ఇయర్ వేడుకలు సందర్భంగా డ్రగ్స్‌పై పటిష్ట నిఘా ఏర్పాటు చేశామన్నారు. కొత్త సంవత్సరాన్ని ఎంతో ఘనంగా ఆహ్వానించేందుకు ఎన్నో ఈవెంట్లు చేస్తుంటారు. న్యూఇయర్ వేడుకలను ఎంతో గ్రాండ్‌గా నిర్వహిస్తుంటారు. పెద్ద పెద్ద ఈవెంట్లను ఏర్పాటు చేస్తుంటారు.లోకల్ పోలీసులతో కోఆర్డినేట్ చేసుకుంటూ ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. గత 15 రోజుల్లో నాలుగున్నర కోట్ల డ్రగ్స్‌ను పట్టుకున్నామని.. 266 డాగ్స్‌తో రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు చేశామని చెప్పారు. 100 మీటర్ల దూరంలో ఓ ఇంటిపై పెంచుతున్న గంజాయి మొక్కలను కూడా డాగ్స్ గుర్తించాయన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి డ్రగ్స్‌ను మన రాష్ట్రంలోకి రావడానికి ముందే అడ్డుకోగలుగుతున్నామని తెలిపారు. గత 15 రోజుల కాలంలో 641 కిలోల గంజాయి, 15 కిలోల గంజాయి చా÷-లకెట్లు, 1600 గ్రాముల హాష్ ఆయిల్, 1383 గ్రాముల ఎండిఎంఏ, 1000 గ్రాముల ఓపీఎం చరాస్, 53 గ్రాముల పాపిస్ట్ర ను పట్టుకున్నామని తెలిపారు. 44 గ్రాముల హెరాయిన్‌తో పాటు 148 కేసులను రిజిస్టర్ చేసి 315 మంది నేరస్తులను అరెస్ట్ చేశామని చెప్పారు. అలాగే ఈవెంట్ ఆర్గనైజర్లు డీజే ప్లేయర్ల ట్రాక్ రికార్డు చెక్ చేసుకోవాలన్నారు. ఈవెంట్లలో డ్రగ్స్ వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నార్కోటిక్ బ్యూరో ఎస్పీ సాయి చైతన్య హెచ్చరించారు. మరోవైపు సంగారెడ్డి జిల్లాలో భారీగా నిషేధిత ఎండీఎంఏ డ్రగ్స్‌ను పోలీసులు పట్టుకున్నారు. దీనిపై సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్ మీడియాతో మాట్లాడుతూ.. టీజీఎన్ఏబీ, సంగారెడ్డి పోలీసుల జాయింట్ ఆపరేషన్ నిర్వహించారని.. సుమారు 70 లక్షల విలువచేసే నిషేధిత ఎండీఎంఏ డ్రగ్స్‌ను పట్టుకున్నారని తెలిపారు. మహమ్మద్ సలీం, ముఖేష్ దుబే అనే ఇద్దరు డ్రగ్ ఫెడ్లర్స్‌ను అరెస్ట్ చేశారన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా కస్టమర్లకు డ్రగ్స్ సప్లై చేయడానికి నిందితులు వచ్చారని.. షేక్ అమిర్ అనే వ్యక్తికి 1000 గ్రాముల డ్రగ్స్‌ను అమ్మేందుకు ప్రయత్నం చేశారన్నారు. పక్కా సమాచారంతో ఇస్నాపూర్ వద్ద నిందితులను అరెస్టు చేశామన్నారు. ఢిల్లీలో ఉంటున్న నైజీరియన్‌లు జెమ్మి జెన్నీ అనే వ్యక్తులు వద్ద నుంచి నిందుతులు డ్రగ్స్ కొనుగోలు చేశారన్నారు. ముంబైకి చెందిన మరో వ్యక్తి రైస్ కాన్ అనే వ్యక్తి కూడా డ్రగ్స్‌ను నగరానికి తీసుకొచ్చి అమ్ముతున్నాడని నేరస్తులు తెలిపారన్నారు. నిందితులు వద్ద నుంచి కిలో ఎండిఎంఏ డ్రగ్స్‌తో పాటు నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ ఆక్ట్ కింద కేసు నమోదు చేశామన్నారు. పట్టుబడ్డ నిందితులపై గతంలో డ్రగ్స్ కేసులు ఉన్నాయన్నారు. ప్రజారవాణా మార్గం ద్వారా నిందితులు డ్రగ్స్‌ను హైదరాబాద్‌కు తీసుకువచ్చారని తెలిపారు. ఢిల్లీలో కిలో వెయ్యి రూపాయలకు కొనుగోలు చేసి హైదరాబాద్‌లో అత్యధిక ధరకు అమ్ముతున్నారన్నారు. వినియోగదారులను గుర్తించి వారిని కూడా అదుపులోకి తీసుకుంటామని సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్ స్పష్టంచేశారు.

## ముఖ్యమంత్రిది డొల్ల నీతి..

(మొదటి పేజీ తరువాయి..)

స్టేట్‌మెంట్ ఇచ్చి అప్రూవ్వర్ అయిపోయారు. నావల్ల కాదు ప్రభుత్వం నడపడం. నేను ఇచ్చిన హామీలు అన్నీ తెలివితక్కువతనంతో ఇచ్చాను. నాకు తెల్వది ఆరు గ్యారంటీల అమలు సంగతి, రుణమాఫీ గానీ. ఏదో తెల్వకుండా కేవలం ఓట్ల కోసం మాత్రమే నేను హామీలు ఇచ్చాను. అప్పుడు బుకాయింపు మాటలు చెప్పిన. కానీ, తంతే గారెల బుట్టలో పడ్డడు అనుకోకుండా అడ్డమారి గుడ్డిదెబ్బలెక్క ముఖ్యమంత్రి అయిన. ఇప్పుడు నేను ముఖ్యమంత్రి అయ్యాక. నాకు ప్రభుత్వం నడుపొస్తలేదు. వ్యవహారం తెలుస్తు లేదంటే రేవంత్‌రెడ్డి స్టేట్‌మెంట్ రేవంత్‌రెడ్డి అక్కసుతో కూడిన మాటల్లో బయటపడ్డది. మేం సూటిగా అడిగాం. రూ.49,500కోట్ల అన్నారు కదా? స్టేట్ లెవల్ బ్యాంకర్ల కమిటీ మీటింగ్‌లో రుణమాఫీపై. సంవత్సరం కడుపు కట్టుకుంటే రుణమాఫీ చేసేస్తాం అన్నారు ఎందుకు చేయలేదని అడిగాం. రూ.49,500 కోట్లు మళ్లీ రూ.40వేలకోట్లు ఎట్ల అయ్యింది? శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టే వరకు రూ.26వేలకోట్లు ఎట్ల అయ్యింది? ఇవాళ రూ.20వేలకోట్లు ఇచ్చి చేతులు దులుపుకొని సిగ్గులేకుండా రుణమాఫీ వందశాతం అయ్యిందని చెబుతున్నవ్ అని అడిగినం' అన్నారు.

'బమ్మిని తిమ్మిని చేసి.. మసిపూసి మారేడు కాయ చేసి.. రాష్ట్రవ్యాప్తంగా చూస్తున్న రైతులకు మాత్రం స్పష్టంగా అర్థమైంది. ఈ ముఖ్యమంత్రి డొల్ల నీతి.. డొల్ల మాటలు. రైతు రుణమాఫీ విషయంలో చెప్పిన, చేసిన ప్రచారం అంతా ఉత్తదే అని వాళ్ల ఎమ్మెల్యేలు తేల్చేశారు. వాళ్ల ఎమ్మెల్యేలకు రెండురోజులు ట్రెయినింగ్ ఇచ్చారట. అబద్ధాలు చెప్పే శిక్షణ సరిగా ఇచ్చినట్లు లేరు. ఒక ఎమ్మెల్యేలు లేచి మా దగ్గర 70శాతం రుణమాఫీ అయ్యింది అన్నడు. ఇంకొక ఎమ్మెల్యే లేచి మా దగ్గర 70శాతం కాకపోతే అర్జెంటుగా రాజీనామా చేస్తానని ఎగురుతున్నడు. వాస్తవం ఏంటంటే.. సీఎం వందశాతం అంటున్నడు. ఎమ్మెల్యేలు 70శాతం అంటున్నరు. ఏ గ్రామంలో కూడా వాస్తవం ఏంటంటే.. 25-30శాతానికి మంచి రుణమాఫీ జరుగలేదు. అందుకే నేను సవాల్ చేశాను. నీ సొంత ఊరు కొండారెడ్డిపల్లి పోదామా? నీ సొంత నియోజకవర్గం కొడంగల్ పోదమా..? రుణమాఫీ కాలేదు ఇది అక్షర సత్యం. ఎస్ఎల్‌బీసీలో రూ.49,500కోట్లు అని చెప్పి.. ఇవాళ రూ.20వేలకోట్లు అని చెప్పి.. ఇప్పటికీ డిపాజిట్ చేసింది రూ.12 నుంచి రూ.13వేలకోట్లకు మంచి రైతుల ఖాతాల్లో పడలేదు. ఇది వాస్తవమని శాసనసభా వేదికగా రుజువు చేయగలిగినం. దాంతో సీఎం తట్టుకోలేకపోయిండు' అంటూ మండిపడ్డారు కేటీఆర్.

'రుణమాఫీ విషయంలో వాళ్ల బండారం బయటపడే వరకు బాధైంది. నువ్వు రైతు భరోసా ఎగ్గొట్టినవ్. ఆ రోజు ఇదే ముఖ్యమంత్రి.. ఎవడైయ్య అవులగాడు.. ఎవడయ్య దీవానాగాడు.. రైతుబంధు బంద్ అవుతుందని చెప్పినవాడు ఎవడూ అంటూ నోరుపారుసుకున్నడు ఎంపీ, పీసీసీ అధ్యక్షుడిగా. మరి ఇవాళ వానాకాలం రైతుబంధు ఎగ్గొట్టిన అవులగాడు ఎవడు? దీవానాగాడు ఎవడు? వ్యవసాయ మంత్రి చెప్పాలంటే..? ఏం చేయాలో తెలియక.. నోటికి వచ్చిన కారుకూతలు. అక్కసుతో కూడిన మాటలు. ఈ ప్రభుత్వం చిత్తశుద్ధి లేదు కాబట్టే.. రేవంత్‌రెడ్డి చెప్పిన మాటల్లో నిజాయితీ ఉంటే.. ఆయన ఎన్నికలు ముందు ఏమన్నడు. డిసెంబర్ 3 ముందుకు తీసుకుంటే ఎకరానికి రూ.5వేలు.. తర్వాత తీసుకుంటే ఎకరానికి రూ.7500 నేను ఇస్తానని చెప్పిండు. డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తానని చెప్పిండు. ఇప్పటి దాకా రుణాలు తీసుకోని రైతులుంటే.. ఉరుక్కుంటూపోయి తెచ్చుకోండి రుణమాఫీ నేను చేస్తానని చెప్పిండు. ఇవాళ రాష్ట్ర రైతాంగం తరఫున అడుగుతున్నాం బీఆర్ఎస్ తరఫున. ఏమయ్యాయి నీ మాటలు. ఉరుక్కుంటూ పొమ్మనవ్. రైతులు రూ.2లక్షలు, రూ.3లక్షలు లోన్లు తెచ్చుకున్నారు. ఇవాళ మోసం చేస్తూ.. నీ మాయమాటలతో బుకాయించి.. 25శాతం రుణమాఫీ చేసి 100శాతం అయ్యిందని రూ.550కోట్లతో పత్రికల్లో ప్రకటనలు ఇచ్చుకున్నవ్. ఈ మాట మేం అడిగివే వరకు ఉక్రోషం వచ్చింది సీఎం. రైతుబంధు ఎగ్గొట్టావా? లేదా? అని అడిగే వరకు ఉక్రోషం వచ్చింది. రుణమాఫీ చేయని మాట వాస్తవం కాదా? అంటే ఉక్రోషం వచ్చింది. తట్టుకోలేక పచ్చి అబద్ధాలు చెబుతున్నడు' అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు విషయంలో సీఎం రేవంత్ చెప్పినవన్నీ అబద్ధాలేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఆయన ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ అని.. ఆయన చెప్పినవన్నీ అబద్ధాలేనన్నారు. అసెంబ్లీలో మీడియా పాయింట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'కేసీఆర్ 11 విడుతల్లో ఆయన ప్రభుత్వం రూ.72వేలకోట్లు రైతుబంధు డబ్బులు నగదు బదిలీ పథకం భారతదేశంలో అతిపెద్ద పథకం. అది సక్సెస్‌ఫుల్‌గా అమలు చేశారో.. దాన్ని కూడా బద్నాం చేసే ప్రయత్నం ఈ ప్రభుత్వం చేస్తుంది. రూ.22వేలకోట్లు దుర్వినియోగం జరిగిందని చెబుతున్నరు.

ముఖ్యమంత్రి మాట్లాడిన మాటలు వింటే.. మీడియా మిత్రులను కోరుతున్నా. దయచేయి ఆయనేం దేవుడు కాదు.. ఆయన చెప్పింది భగవద్గీత కాదు.. ఖురాన్ కాదు.. బైబిల్ కాదు' అన్నారు.

'ఆయన పచ్చి దొంగ. ఓటుకునోటుకు దొంగ. ఆయన చెప్పినవన్నీ అబద్ధాలు. ఎందుకంటే సీఎం ఇవాళ ఎట్ల మాట్లాడిండు? రూ.22వేలకోట్లు రియల్ ఎస్టేట్ వాళ్లకు వెళ్లినయ్. క్రషర్స్‌కు పోయినయ్, రోడ్లల్లో ఉన్న భూములకు పోయినయ్ అంటున్నడు. ఆయన మాట్లాడితే మైక్ కట్‌కాదు. ఎన్ని అబద్ధాలైనా అవలోకగా చెప్పే సామర్థ్యం రేవంత్‌రెడ్డికి. 'కానీ, వాస్తవం ఏంటీ? నేను మంత్రిని అడిగిన. మంత్రి చెబుతున్నడు. రూ.22వేలకోట్లు సాగు చేయని వాటికి ఏవైతే ఉన్నయో.. అవి కూడా ఉన్నయ్ అంటున్నడు. రాష్ట్ర రైతాంగానికి, ప్రజలకు అర్థం కావాలి. ఒక పత్తిచేను ఉంటే.. సంవత్సరంలో ఎనిమిది నెలలు పంట ఉంటది. కంది చేను ఉంటే.. ఎనిమిది నెలలు ఉంటది. పత్తయినా, కందయినా ఎనిమిది నెలల పంట. వీళ్ల లెక్క ఉన్నదంటే.. మిగతా నాలుగు నెలలను రైతులు సహజంగా విడిచిపెడుతారు' అని కేటీఆర్ గుర్తు చేశారు.

'ఆ నాలుగు నెలలను లెక్కలోకి తీసుకొని.. అయినా రెండోవిడత రైతుబంధు ఇచ్చారు.. అవన్నీ దుర్వినియోగమయ్యాయని ప్రభుత్వం పచ్చి అబద్ధాలు చెబుతున్నది. కంది, పత్తిని పండించే రైతులకు రేపటి రోజున మీరు రెండో పంటకు రైతుబంధు ఇవ్వరా? పత్తి రైతులు 45లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నరు. వారికి రెండో పంటకు రైతుబంధు ఇచ్చే ఉద్దేశం లేనట్టుంది కాబట్టే.. రూ.22వేలకోట్లకు నూకి ఇష్టంవచ్చినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నరు. నేను ప్రభుత్వాన్ని.. మంత్రిని ఆ లిస్ట్ ఇవ్వాలని అడిగాను. క్రషర్స్.. రోడ్లల్ల పోయిన భూములు అంటున్నరు ఆ లిస్ట్ ఇవ్వాలని అడిగాను. శాసనసభలో పెడితే మాకు తెలుస్తుంది.. ప్రజలకు తెలుస్తుంది. ఎక్కడ ఏ సర్వే నెంబర్‌లో దుర్వినియోగం అయ్యిందో తేలిపోతుందని అడిగాం. కానీ, మంత్రి తెలివిగా చెప్తున్నారు. రెండోపంట పండించని వారి కూడా లిస్ట్ ఇందులోనే ఉంది.. ఇవన్నీ కలిపే రూ.22వేలకోట్లు అని చెబుతున్నడు. నేను మళ్లీ చెబుతున్న. పత్తిరైతులు, కంది రైతులు మోసపోకండి. ఆయన మాట్లాడిన రూ.22వేల కోట్లల్లో మీరు ఏదైతో రెండోపంట వేయలేదో దాని గురించే మాట్లాడుతున్నరు' అంటూ మండిపడ్డారు.

సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ రైతుబంధుపై సబ్ కమిటీ వేసింది రైతుబంధు ఎగ్గొట్టేందుకేనని సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సర్కారు తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఇవాళ ఎన్ని అబద్ధాలు అంటే.. తెలంగాణలోని రైతుల ఆత్మహత్యలపై కూడా ప్రభుత్వం కూడా దిగజారింది. 2014లో అధికారంలో వచ్చిన తర్వాత రైతు ఆత్మహత్యలు సంవత్సరానికి నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో ప్రకారం.. 1348 రైతు ఆత్మహత్యలు జరిగాయి. 2015లో 1400, 2016లో 645, 2017లో 851, 2018లో 908 రైతు ఆత్మహత్యలు జరిగాయి. 2019లో రైతుబంధు స్టార్ట్ అయ్యాక 2019లో 499, 2020లో 471, 2021లో 359, 2022లో కేవలం 178 రైతు ఆత్మహత్యలు జరిగాయి. ఇది రైతుబంధు, రైతుబీమా ప్రభావం కాదా? పెరిగిన వ్యవసాయ విస్తరణ ఫలితం కాదా? అందుబాటులోకి వచ్చిన చెరువులు, కాళేశ్వరం ప్రాజెక్టులతో స్థిరీకరించబడ్డ సాగు కాదా? వ్యవసాయం కాదా? ఇది ప్రామాణికం కాదా?' అంటూ నిలదీశారు.

'రైతు ఆత్మహత్యల్లో భారతదేశంలో తెలంగాణ భాగస్వామ్యం 11శాతం ఉండేది. దాన్ని 1.57శాతానికి తగ్గిస్తే.. దాన్ని కూడా చిన్నగా చేసి.. చూపే చిల్లరప్రయత్నం రేవంత్‌రెడ్డి చేసిండు. ఇంకా నికృష్టపు మాటలు. వీళ్లు మాకు అప్పచెప్పిన నాటే సర్‌ప్లస్‌గా ఇచ్చినం అని చెబుతున్నడు. రేవంత్‌రెడ్డికి చరిత్ర తెలియదు.. వర్తమానం తెల్వదు. లెక్కలు అంతకన్నా తెల్వదు. తెలంగాణ, ఆంధ్రాతో కలిసిన నాడే 1956 సంవత్సరంలో సర్‌ప్లస్ స్టేట్. 1968లో సర్‌ప్లస్ స్టేట్ తెలంగాణ మొదటి సారి ప్రారంభమైనప్పుడు. 2001లో రెండోదశ ఉద్యమం ప్రారంభమైనప్పుడు సర్‌ప్లస్ స్టేట్. 2014లో తెలంగాణ వచ్చినప్పుడు సర్‌ప్లస్ స్టేట్. కొత్తగా నీ కాంగ్రెస్ పార్టీ పీకింది లేదు. ఇచ్చింది ఏం లేదు. మీ ప్రభుత్వం ఊడబొడిచిందేమీ లేదు. ఇంకా సిగ్గుమాలిన మాట. ఒక సంవత్సరంలో రూ.20వేలకోట్లు రుణమాఫీకి ఇచ్చినం అన్నడు. కేవలం ఇచ్చింది లెక్కగడితే రూ.12వేలకోట్లు దాటదు. కానీ, అదే మా ప్రభుత్వం పదేళ్లలో రూ.28వేలకోట్ల రుణమాఫీ రెండు దఫాల్లో. మరో వైపు రూ.73వేలకోట్ల రైతుబంధు. ఈ రెండు కలిపితే రైతుల ఖాతాల్లో పైసలు లెక్కపెడితే రూ.లక్ష కోట్లు దాటింది' అని తెలిపారు.'ఇవాళ రైతుబంధు భారతదేశానికి ఆదర్శమైంది. పీఎం కిసాన్‌గా పేరు మారింది. కృషిబంధు బెంగాల్‌లో.. ఇంకా చాలా రాష్ట్రాల్లో పేరు మారింది. ఇవాళ ప్రభుత్వాన్ని ఒక్కటే అడుగుతున్నాం. రాష్ట్ర రైతాంగానికి విజ్ఞప్తి చేస్తున్నాం. సబ్ కమిటీ వేసిందే టైమ్‌పాస్‌కి, రైతుబంధు ఎగ్గొట్టెందుకు, కోత పెట్టేందుకు. ఉద్యోగస్తులకు నేను ఇయ్యా రైతుబంధు ఇవ్వనని ఎందుకు చెప్పలేదు అని నేను ఇవాళ అడిగినా.. ఉద్యోగస్తుడి తల్లిదండ్రులు వ్యవసాయదారులైతే.. ఆ ఉద్యోగస్తుడు వ్యవసాయ కుటుంబం నుంచే.. సాయంత్రం ఉద్యోగం నుంచి వస్తే పోయి వ్యవసాయం చేయడా? ఆయనకు భూమితో ఉన్న కనెక్షన్ ఎందుకు కట్ చేస్తున్నవ్. ఆయనను ఎందుకు రైతుగా గుర్తిస్తలేవు అని అడిగినాను. తెలంగాణలో 1.30కోట్ల పాన్ కార్డులు ఉన్నయ్. పాన్ కార్డ్ నిబంధన పెడితే మిగేలదీ ఎవరు? ఆలోచించాలని కోరిన. ఐటీ అంటున్నవ్.. ఆదాపు కట్టె వారిలో రైతుబిడ్డలు అయిన ఉద్యోగులు ఉన్నరు. జర్నలిస్టులు ఉన్నరు. ఐటీ కట్టేవారందరికీ రైతుబంధు తీసేస్తానంటే.. ఎవడు మిగులుతడు ? అందుకే నేను అడిగినా సమాధానం లేదు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే రైతుబంధుకు రాం..రాం అవుతుందని ఎన్నిలకు ముందు కేసీఆర్ అన్నారని.. ప్రస్తుతం ఆయన చెప్పినట్లుగా అయ్యిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. రైతుబంధు, రుణమాఫీ, బోనస్ విషయంలో కాంగ్రెస్ సర్కారుపై ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ.. 'ఎటుపెట్టి వీళ్ల సిద్ధాంతం ఒకటే. ఎన్నికలకు ముందు అందరికీ అన్నీ.. ఎలక్షన్లు అయిపోయాయి కదా? కొందరికి కొన్ని. అట్ల కటింగ్‌లు పెట్టి ఏదో రకంగా తప్పించుకోవాలన్న ఎజెండా తప్ప వీళ్లకు చిత్తశుద్ధి లేదు. ఆత్మహత్యల విషయంలో తప్పుడు మాటలు చెప్పారు. వానాకాలం రైతుబంధు ఎగొట్టారు. రూ.700కోట్లు బోనస్ ఇచ్చామంటున్నరు. ఆ బోనస్ బోగస్ అని చూపించాం ఈ రోజు. మేనిఫెస్టోలో పెట్టింది దొడ్డు వడ్లకు. సన్నాలకని సన్నాయి నొక్కులు నొక్కుతున్నరు. వానాకాలం రైతుబంధు ఎగ్గొట్టారు అని అడిగినం. అదేవిధంగా రైతుభరోసా అని పేరు మార్చారు తప్పా.. డబ్బులు పెరగలేదు. మార్పు మార్పు అంటే.. ప్రజలు కోరుకున్నది పేరు మార్పు కాదు గుణాత్మకమైన మార్పు. మాకు ఎక్కువ డబ్బులు రావాలి.. ఎక్కువ పెట్టుబడి సాయం కావాలని ఆలోచన చేశారు. అందుకే ప్రభుత్వాన్ని అడిగినం' కేటీఆర్ తెలిపారు.

'వానాకాలం ఎగొట్టారు.. మళ్లీ ఆ ప్రయత్నం చేయొద్దని చెప్పాం. పెంచిన రైతు భరోసా ఇవ్వాలని చెప్పాం. ప్రభుత్వానీ మేం నమ్మడం లేదు. వాళ్లు చెప్పే కాకి లెక్కలు నమ్మడం లేదు. రూ.22వేలకోట్ల దారి మళ్లినయ్.. దుర్వినియోగం జరిగిందని రేవంత్‌రెడ్డి చెబుతున్నడు. ఆయన మాటలు నేను కాదు.. ఎవరూ నమ్మడం లేదు. పచ్చి అబద్ధాలను ఆలంభనగా చేసుకొని బతికే వ్యక్తి. చేసిన అరకొర రుణమాఫీని.. డబ్బా కొట్టుకొని ఎవరూ చేయనిది చేసినా అని చెప్పుకున్నడు. ఆ నాడు రైతుబంధుకు రాంరాం అయితది.. నేను ముందే చెబుతున్న కాంగ్రెస్‌కు ఓటేస్తే అని కేసీఆర్ చెప్పారో.. అది ఇవాళ వాస్తవం అయ్యింది. 12 నెలలు రైతుబంధు ఎండబెట్టి.. 12 రోజుల్లో ఇచ్చినమని చెప్పుకునే సిగ్గుమాలిన ప్రయత్నం చేస్తున్నరు. సన్నాలకు రూ.700కోట్ల బోనస్ ఇచ్చినమని చెప్పుకుంటున్నరు. రూ.7500కోట్ల రైతుబంధు ఎగొట్టినమని చెబుతలేరు. ఎగ్గొట్టింది కేవలం వానాకాలం మాత్రమే కాదు. రైతుభరోసా అని పేరు మార్చినవ్ కాబట్టి.. ఈ సంవత్సర కాలంలో 70లక్షల రైతుల కుటుంబాలకు నీ ప్రభుత్వం బాకీ ఉన్న మొత్తం రూ.26,775కోట్లు' అని కేటీఆర్ తెలిపారు.

'నువ్వే (రేవంత్‌రెడ్డి) చెప్పినవ్. కేసీఆర్ ఎకరానికి రూ.5వేలు ఇస్తుండు.. నేను రూ.7500 ఇస్తా అని చెప్పినవ్. కేసీఆర్ ముష్టి వేస్తున్నడు అని ఆనాడు ఎటకారపు మాటలు మాట్లాడినవ్. అందుకే ఇవాళ అడుగుతున్నం. నీ ప్రభుత్వం రైతులందరికీ కేవలం రైతుభరోసా విషయంలోనే రూ.26,775 కోట్లు బాకీ ఉన్నారు. ఇవాళ అరకొర రుణమాఫీ చేశారో.. అందులో రూ.20వేలకోట్లు రుణమాఫీ బాకీ ఉన్నది. ఇవాళ ఎంత అన్యాయం అంటే.. ఈ ప్రభుత్వం మాటలు మేం నమ్మమని ఊరికే అనడం లేదు. రూ.22వేల కోట్లు దారిమళ్లినయ్.. ఏదో తప్పు జరిగింది అనే వాతావరణం కల్పించి.. రేపు పత్రికల్లో తాటికాయంత అక్షరాలతో వచ్చేటట్టు మీడియా మేనేజ్‌మెంట్.. హెడ్‌లైన్ మేనేజ్‌మెంట్ చేసి.. రైతుబంధు డబ్బులన్నీ ఖరాబ్ అవుతున్నయి కదా? ఇన్ని రోజులు కేసీఆర్ ఖరాబ్ చేసిండు కదా అనే ఓ అభిప్రాయం కలిగే విధంగా చేసి కటింగ్ పెట్టే ఆలోచనలో భాగంగా ఈ కార్యక్రమం అంతా జరుగుతున్నది' అంటూ అనుమానాలు వ్యక్తం చేశారు.

'రాష్ట్రంలోని ఉద్యోగులు, రాష్ట్రంలో పాన్‌కార్డ్ హోల్డర్లకీ, పత్తి, కందిరైతులకు.. సోయా రైతులకు కూడా నా విజ్ఞప్తి ఇదే. ఈ ప్రభుత్వం ఇవాళ ఎత్తగొట్టే ప్రయత్నం చేస్తున్నది. రైతుబంధుకు రాం రాం చెప్పే ప్రయత్నం చేస్తున్నది. మనం అందరం ఈ ప్రభుత్వంపై ఎక్కడిక్కడ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజాప్రతినిధులను స్థానిక సంస్థల్లో నిలదీయండి. ఇప్పుడు సంక్రాంతి తర్వాత అంటున్నరు. అదే ఏ సంక్రాంతి చెప్పడం లేదు. 2024 సంక్రాంతా? 2025 సంక్రాంతా? రుణమాఫీ విషయంలోనూ ఇలాగే చెప్పారు. డిసెంబర్ 9న సంతకం అన్నరు.. మళ్లీ మరిచిపోయారు. డిసెంబర్ 9 రెండుసార్లు దాటిపోయినా రుణమాఫీ కాలేదు. అందుకే రైతు సోదరులకు విజ్ఞప్తి చేస్తున్నాం' అన్నారు.

## గిరిజన యువత తలుచుకుంటేనే మార్పు సాధ్యం

(మొదటి పేజీ తరువాయి..)


సర్పంచ్‌లు తల ఎత్తుకుని తిరిగే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యంగా ప్రణాళిక బద్ధంగా పనిచేస్తున్నామన్నారు. 100 మంది జనాభా ఉన్న గ్రామాలకు రోడ్లు నిర్మాణం ప్రధాని నరేంద్ర మోడీ మహా సంకల్పమని వెల్లడించారు. ఏటా రూ. 350కోట్లు రహదారులు, ఇతర అవసరాల కోసం కేటాయిస్తామని చెప్పారు. ప్రజల నమ్మకం గెలుచుకోవడానికి ఇక్కడకు వచ్చాను.. ఐదేళ్ల పనితీరు గమనించి ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇవ్వాలన్నారు. తాను, ముఖ్యమంత్రి మనసు పెట్టకపోతే ఇవాళ ఏజెన్సీలో రోడ్లు లేవన్నారు. ÷నాన్స్ ఎలా హ్యాండిల్ చెయ్యాలో తెలియదు.. ప్రజల ఇబ్బందులను తెలుసుకోవడం వాటిని పరిష్కరించడం మాత్రం తెలుసన్నారు. జనవరిలో రూ.250కోట్లు రహదారుల నిర్మాణం కోసం కేంద్రం నిధులు ఇవ్వనుందని తెలిపారు. తిట్లు తిన్నాం.. కుటుంబ సభ్యులను టా÷-గ్గ్÷ట్ చేసినా భరించి నిలబడ్డాం.. దాని ఫలితం ఇవాళ ప్రజలకు సర్వీస్ చేసే అవకాశం లభించిందన్నారు. గంజాయిని ఒక సామాజిక సమస్యగా చూడాలని పవన్ అన్నారు. గంజాయి గిరిజన ఆచార వ్యవహారాలు దాటి కమర్షియల్ అయిందన్నారు. యువత, పిల్లలు చెడిపోవడానికి గంజాయి కారణమంటూ వ్యాఖ్యానించారు. మత్తులో ఇటీవల కడపలో టీచర్‌పై దాడి చేసి కొందరు విద్యార్థులు దారుణంగా ప్రవర్తించారన్నారు. ప్రత్యామ్నాయ మార్గాలు కల్పిస్తామన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. గంజాయి సాగు వదిలేయమని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. గంజాయి గ్రామాలను దాటి ఎక్స్‌పోర్ట్ వరకు వెళ్లడంతో ఏపీ గంజాయి కేపిటల్‌గా మారిందని మండిపడ్డారు. గంజాయిని మీరు వదిలే వరకు మిమ్మల్ని వదలనన్నారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. తనకు గిరిజన ఆచార వ్యవహారాలు చాలా ఇష్టమని పేర్కొన్నారు. మీ ఇంట్లో ఒక వ్యక్తి ప్రభుత్వంలో ఉన్నాడనీ గుర్తు పెట్టుకోవాలన్న ఆయన.. మంచి పని చేసే వాడికి ఆపద ఉండదు.. ఉండకూడదు.. దీనిని తాను బలంగా నమ్ముతానన్నారు. సినిమా కోసం తాను ఎప్పుడూ కల కనలేదని.. దేశం కోసం, ప్రజల కోసం కల కన్నానన్నారు. మనసు, బుద్ధి కలిస్తే.. రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. సినిమా పరిశ్రమ ఇక్కడికి రావాలని.. విదేశాలలో ఉండే చాలా సుందరమైన ప్రదేశాలు ఇక్కడ ఉన్నాయన్నారు. ఇటువంటి చోట షూటింగ్‌లు చేస్తే స్థానిక గిరిజనులకు ఉపాధి లభిస్తుందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అల్లూరి సీతారామరాజు జిల్లా బల్లగరువులో పర్యటించారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ... పంచాయతీరాజ్ శాఖ తీసుకున్నందుకు తాను ప్రజలకు ఏదైనా చేయగలుగుతున్నాను అంటే అందుకు కారణం ప్రజలు ఓట్లేసి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించడమేనని అన్నారు. అధికారంలో ఉండడం వల్లే ప్రజలకు మేలు చేయగలుగుతున్నానని వివరించారు. ఒకటి కాదు, రెండు కాదు... 164 అసెంబ్లీ సీట్లు, 21 ఎంపీ స్థానాలు ఇచ్చారని వ్యాఖ్యానించారు. "ఇందాక పాత్రికేయ సోదరులు అడుగుతున్నారు.... ఈ పార్లమెంటు స్థానం మీ కూటమికి దక్కలేదు కదా అన్నారు. వాళ్లకి నేను ఒకటే చెప్పాను... మాకు ఓట్లు వేయని ప్రజల కోసం కూడా మేం పనిచేస్తాం... మేం ఓట్ల కోసం ఇలా చేయడం లేదు... ప్రజా సంక్షేమమే మాకు ముఖ్యం. ఇక్కడ అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.105 కోట్లు ఖర్చు పెడితే లబ్ధి పొందేది 4,500 మంది గిరిజనులు మాత్రమే... పైగా వాళ్లు మాకు ఓట్లు కూడా వేయలేదు... అభివృద్ధే మాకు ముఖ్యం అని చెప్పడానికి ఇదే నిదర్శనం" అని స్పష్టం చేశారు.

## బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం

(మొదటి పేజీ తరువాయి..)

ఆదేశించారు. సహాయక చర్యలకు సన్నద్ధంగా ఉండాలన్నారు. అల్పపీడన వర్షాలపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. సీఎంవో అధికారులు ఆయా జిల్లాల్లో ప్రస్తుత పరిస్థితులపై ముఖ్యమంత్రికి వివరించారు. కలెక్టర్లు, జిల్లా స్థాయిలో అధికారులు తీసుకుంటున్న చర్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. భారీవర్షాలు ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు.. స్కూళ్లకు సెలవు ప్రకటించినట్లు సీఎంకు వెల్లడించారు. కొన్ని ప్రాంతాల్లో పంటలు దెబ్బ తిన్నాయని.. వర్షాల అనంతరం పంటనష్టం వివరాలు సేకరించి రైతులకు సాయం అందేలా చూడాలని సీఎం ఆదేశించారు. భారీవర్షాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు అన్నదాతలకు చేరేలా చూడాలని సూచించారు. అన్ని స్థాయిల్లో అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండి పనిచేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశర చేశారు. ఇదిలావుంటే పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండం కొనసాగుతోంది. గడిచిన 6 గంటలుగా గంటకు 12 కిలోమీటర్ల వేగంతో వాయుగుండం కదులుతోంది.



ప్రస్తుతం విశాఖకు అగ్నేయంగా 430 కిలోమీటర్లు దూరంలో కేంద్రకృతమై ఉంది. చెన్నైకు ఈశాన్యంగా 480 కిలోమీటర్లు, గోపాల్‌పూర్‌కు దక్షిణంగా 590 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైందని వాతావరణశాఖ తెలిపింది. రాగల 12 గంటలపాటు ఇది తూర్పు ఈశాన్యం దిశగా కదులుతూ వాయుగుండంగా కొనసాగే అవకాశం ఉంది. ఆ తదుపరి క్రమంగా సముద్రంలోనే బలహీన పడే సూచనలు ఉన్నట్లు పేర్కొంది. దీని ప్రభావంతో రాగల 24 గంటల్లో ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తాంధ్ర రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరుగా వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని పేర్కొంది.

## గిరిజన ప్రాంతాలు షూటింగ్‌కు అనుకూలం: పవన్ కళ్యాణ్

**పార్వతీపురం,డిసెంబర్21(వెలుతురు):**
గిరిజన ప్రాంతాల్లో సినిమా షూటింగ్‌లకు అందమైన ప్రదేశాలు ఉన్నాయని డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ అన్నారు. ఇక్కడ షూటింగ్‌ల వల్ల ఖర్చు తగ్గడంతో పాటు, స్థానిక గిరిజనులకు ఉపాధి దక్కుతుందని అభిప్రాయపడ్డారు. అల్లూరి జిల్లా అనంతగిరి మండలం గిరిజన ప్రాంతాల్లో పర్యటిస్తున్న పవన్‌కల్యాణ్ సినీ రంగంపై మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో చాలా సుందరమైన ప్రదేశాలున్నాయని, సినిమా పరిశ్రమ ఇక్కడికి వచ్చి సినిమా షూటింగ్‌లు చేయాలని సూచించారు. విదేశాల్లో ఉండే అందమైన ప్రదేశాలు గిరిజన, ప్లలె ప్రాంతాల్లోనూ ఉంటాయని తెలిపారు. ఇటువంటి స్థలాల్లో షూటింగ్‌లు చేస్తే గిరిజనులకు ఉపాధి లభిస్తుందని అన్నారు.

# నేను సోలోగా వచ్చి నాలుగేళ్లు అవుతోంది..

## - రామ్‌చరణ్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తేజ్ దిగ్గజ దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న తాజా చిత్రం గేమ్ ఛేంజర్. ఈ సినిమాను అగ్ర నిర్మాత దిల్ రాజు నిర్మిస్తుండగా.. థమన్ సంగీతం అందిస్తున్నాడు. ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. రామ్ చరణ శంకర్ దిల్ రాజు కాంబినేషన్‌లో ఈ సినిమా వస్తుండటంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. అయితే ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నేడు అమెరికాలోని టెక్సాస్‌లో నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఫస్ట్ టైం ఒక ఇండియన్ సినిమాను అందులో ఒక తెలుగు సినిమాను ఇండియాలో కాకుండా వేరే దేశంలో నిర్వహిస్తున్నారు. అయితే ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో భాగంగా.. ఇప్పటికే నటుడు రామ్ చరణ్‌తో పాటు నిర్మాత దిల్ రాజు, దర్శకుడు శంకర్‌లు డల్లస్‌లో ల్యాండ్ అయ్యారు. రామ్ చరణ్ అమెరికాకు చేరుకోగానే మెగా అభిమానులు నుంచి ఆయనకు ఘన స్వాగతం లభించింది. అయితే ప్రీ రిలీజ్ వేడుకకు ముందు ప్రెస్ మీట్ నిర్వహించగా.. ఇందులో రామ్ చరణ్ మాట్లాడుతూ.. తన సినిమా సోలోగా వచ్చి నాలుగు ఏండ్లు అవుతుందని తెలిపాడు. ''నేను సోలోగా వచ్చి నాలుగు ఏండ్లు అవుతుంది. చివరిగా నా బ్రదర్ తారక్‌తో కలిసి ఆర్ఆర్ఆర్ సినిమా చేశాను. ఇప్పుడు వస్తున్న గేమ్ ఛేంజర్ సినిమా కోసం చాలా కష్టపడ్డాం. ఈ సినిమాతో మిమ్మల్ని అస్సలు నిరాశపరచము. అది మనందరికీ అద్భుతమైన సంక్రాంతి అవుతుందంటూ'' రామ్ చరణ్ చెప్పుకోచ్చాడు.


# చివరకు మిగిలేది అదే

## - అనన్యపాండే

'లైగర్'తో తెలుగు ప్రేక్షకులకు చేరువైన బాలీవుడ్ బ్యూటీ అనన్య పాండే.. కొత్త సంవత్సరానికి బాధ్యతగా స్వాగతం పలుకుతూ తన సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ పెట్టింది. 'ఈ ఏడాది చాలా ప్రేమను పొందాను. తనను ప్రేమించే చాలామంది వ్యక్తుల్ని కలుసుకున్నాను. రాబోవు ఏడాది ఈ ప్రేమ ఇలాగే కొనసాగాలి. ముఖ్యంగా నాతోపాటు అందరికీ మంచి ఆరోగ్యం చేకూరాలి. ఎందుకంటే చివరకు మిగిలేది అదే..' అంటూ కాస్తంత నిర్వేదం, ఇంకాస్త వైరాగ్యాన్ని తన పోస్ట్‌లో పొందుపరచింది అనన్య పాండే. ఇదిలావుంటే.. ఆదిత్యరాయ్ కపూర్‌తో విడిపోయిన ఈ అందాలభామ ప్రస్తుతం వాకర్ బ్లాంకో అనే వ్యక్తితో రిలేషన్‌లో ఉన్నట్టు బాలీవుడ్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. అనంత్ అంబానీ జంతు సంరక్షణ కేంద్రమైన 'వంతారా'లో వాకర్ బ్లాంకో కీలకమైన బాధ్యతను నిర్వహిస్తున్నారు. వారిద్దరి ఇన్‌స్టా పోస్టులు కూ డా ఈ పుకార్లకు బలాన్నిస్తున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.



# పుష్ప 2 సినిమాకు వద్దనడంతో యువతి ఆత్మహత్యాయత్నం




పుష్ప 2 సినిమాకి వెళదాం అంటే బాయ్ ఫ్రెండ్ వద్దనడంతో ఓ యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో ఈ ఘటన జరుగగా.. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తుంది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన పుష్ప2 సినిమా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాస్తున్న విషయం తెలిసిందే. తెలుగులో కంటే నార్త్‌లోనే ఈ సినిమాని చూడటానికి జనాలు ఎక్కువగా క్యూ కడుతున్నారు. అయితే ఈ సినిమా చూడటానికి తన ప్రియుడు నిరాకరించాడన్న కారణంతో ఒక యువతి సుసైడ్ చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బనారస్ హిందూ యూనివర్శిటీ అనుబంధ కళాశాలలో చదువుతున్న 22 ఏండ్ల యువతి తన ప్రియుడితో కలిసి ట్రిప్? కోసం వారణాసి వెళ్లింది. ఇద్దరు కలిసి ఒక హెూటల్‌లో దిగిన అనంతరం.. తనను పుష్ప 2 సినిమాకి తీసుకువెళ్లమని బాయ్ ఫ్రెండ్ కోరింది. అయితే ప్రియురాలి కోరికను అతడు నిరాకరించడంతో మనస్తాపం చెందిన యువతి.. హెూటల్ మూడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు వెంటనే స్పందించి ఆమెను ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తుంది. అయితే ఈ ఘటనపై పోలీసులు ప్రియుడిని అదుపులోకి తీసుకోని విచారణ చేపట్టారు.

# ఒబామాకు నచ్చిన భారతీయ సినిమా అదే..?




అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటాడు అన్న విషయం తెలిసిందే. అమెరికా అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన అనంతరం ప్రజలతో మమేకం అవ్వడానికి సోషల్ మీడియాలో గడుపుతుంటాడు. అయితే ఒబామా అప్పుడప్పుడు తన ఇష్టాలను నెటిజన్లతో పంచుకుంటాడు. ఈ క్రమంలోనే 2024 ఇయర్ ముగుస్తున్న నేపథ్యంలో తనకి ఈ ఏడాది నచ్చిన కొన్ని సినిమాలను ఎక్స్ వేదికగా పోస్ట్ చేశాడు. ఇందులో ఒక భారతీయ చిత్రం ఉండడం కూడా విశేషం. ఇంతకీ ఆ సినిమా పేరు. ఆల్ వి ఇమేజిన్ యాజ్ లైట్. భారతీయ దర్శకురాలు పాయల్ కపాడియా దర్శకత్వంలో వచ్చిన తాజా చిత్రం 'ఆల్ వి ఇమేజిన్ యాజ్ లైట్'. ముంబయి నర్సింగ్ హెూమ్‌లో పనిచేసే కేరళకు చెందిన ఇద్దరు నర్సుల కథ ఆధారంగా వచ్చిన ఈ చిత్రం ఇప్పటికే పలు అంతర్జాతీయ అవార్డులను గెలుచుకున్న విషయం తెలిసిందే. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో సత్తాచాటిన ఈ చిత్రం రీసెంట్‌గా 82వ గోల్డెన్ గ్లోబ్స్ పురస్కారాలకు నామినేట్ అయ్యింది. ఇదిలావుంటే తాజాగా ఈ చిత్రం చూసిన అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా సినిమాపై ప్రశంసలు కురిపించాడు. అంతేగాకుండా.. తనకు 2024లో నచ్చిన సినిమాలలో 'ఆల్ వి ఇమేజిన్ యాజ్ లైట్' చిత్రం మొదటి స్థానంలో ఉంటుందని తెలిపాడు.

# పెద్ద సినిమాకు పైరసీ కష్టాలు

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన పుష్ప2 సినిమా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే రూ.1500 కోట్ల వసూళ్లను రాబట్టిన ఈ చిత్రం రూ.2000 కోట్ల దిశగా దూసుకువెళుతుంది. అయితే ఈ క్రమంలోనే చిత్రయూనిట్‌కి భారీ షాక్ తగిలింది. ఈ సినిమా ప్రింట్ ఆన్‌లైన్‌లో లీక్ అయ్యింది. సైబర్ నేరగాళ్లు పుష్ప 2 ది రూల్ మొత్తం సినిమా ప్రింట్ రూపంలో ఆన్‌లైన్‌లో విడుదల చేశారు. దీంతో మూవీ ఈ విధంగా లీక్ కావడం వల్ల కలెక్షన్లపై దారుణంగా దెబ్బ పడే ఛాన్స్ ఉంది. మరోవైపు చిత్రయూనిట్ కూడా ఈ విషయంను సీరియస్‌గా తీసుకోవడమే కాకుండా.. సైబర్ వింగ్‌ను కలిసినట్లు తెలుస్తుంది. దీనిపై కంప్లయింట్ ఇవ్వడంతో పాటు సినిమాను ఆన్‌లైన్ నుంచి తొలగించేందుకు చర్యలు చేపడుతుంది.

# నేను చాలా రఫ్

## - ఐశ్వర్యశర్మ

'మా నాన్న స్టేజ్ ఆర్టిస్ట్. ఆ ప్రభావం నాపై తెలియకుండానే పడింది. అందుకే కెరీర్ పరంగా వేరే ఆప్షనేం పెట్టుకోలేదు. సెకండ్ ఇంటర్ అవ్వగానే జమ్ము నుంచి ముంబై వచ్చి యాక్టింగ్ కోర్స్‌లో చేరిపోయాను. కోర్స్ అవ్వగానే ఆడిషన్స్ ఇవ్వడం మొదలుపెట్టా. కొన్ని యాడ్స్‌లో నటించా. హీరోయిన్‌గా 'డ్రింకర్ సాయి' నా తొలి సినిమా' అని తెలిపింది ఐశ్వర్యశర్మ. 'డ్రింకర్ సాయి' సినిమా ద్వారా ఆమె కథానాయికగా పరిచయం అవుతున్నది. ధర్మ హీరోగా కిరణ్ తిరుమలశెట్టి దర్శకత్వంలో బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా శు క్రవారం హైదరాబాద్‌లో విలేకరులతో ముచ్చటించింది ఐశ్వర్యశర్మ . 'ఇది అద్భుతమైన ప్రేమకథ. ఇందులో నా పాత్ర పేరు బాగీ. మెడికల్ స్టూడెంట్‌ని. చాలా బలమైన పాత్ర. చూడ్డానికి ఇన్నోసెంట్‌గా కనిపిస్తా. కానీ రఫ్ అండ్ టఫ్‌గా ఉంటా. రెగ్యులర్ హీరోయిన్లకు భిన్నమైన పాత్ర అనమాట. ఛాలెంజ్‌గా తీసుకొని చేశా.' అని తెలిపింది ఐశ్వర్య శర్మ. డ్రింకర్ సాయిగా ధర్మ చాలా బాగా నటించారని, సాంకేతికంగా అన్ని విధాలుగా సినిమా బావుంటుందని, అర్జున్‌రెడ్డికీ డ్రింకర్‌సాయికీ పోలిక లేదని, అర్జున్ క్లాసీ డ్రింకర్ అయితే.. సాయి మ్యాసీ డ్రింకర్ అని చెప్పింది ఐశ్వర్యశర్మ.





# న్యాయ పోరాటంలో అనుమప పరమేశ్వర్

మలయాళ అగ్ర నటుడు సురేశ్‌గోపి, అనుపమ పరమేశ్వరన్ ముఖ్య పాత్రల్లో రూపొందిన చిత్రం 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ'(జె.ఎస్.కె). యదార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రానికి ప్రవీణ్ నారాయణన్ దర్శకుడు. జె.ఫణీంద్రకుమార్ నిర్మాత. ఉత్కంఠకు గురిచేసే కోర్ట్ డ్రామాగా ఈ సినిమా రూపొందిందని, జానకి అనే స్త్రీ తనకు జరిగిన అన్యాయాన్ని కోర్టు ద్వారా ఎలా ఎదుర్కొన్నది అనేదే ఈ సినిమా ప్రధాన ఇతివృత్తమని, కేసు వాదించే లాయర్‌గా సురేశ్‌గోపీ నటించారని, ఫిబ్రవరిలో సినిమాను విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. బైజు సందోష్, మాధవ్ సురేశ్‌గోపి, దివ్య పిళ్లయి, అస్కర్ అలీ తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: రెనదివ్, సంగీతం: గిరీష్ నారాయణన్, జిబ్రాన్, నిర్మాణం: కాస్మోస్ ఎంటైర్టెన్మెంట్స్.

# పావురాలతో మనుషులకు ప్రమాదమా?

**హైదరాబాద్ డిసెంబర్ 21 (వెలుతురు):**
నగర వాతవరణంలో పక్షుల మనగడ కష్టమవుతోంది. ఇప్పటికే అనేక రకాల పక్షులు నగరాల్లో కనుమరుగయ్యాయి. అయితే పావురాలకు మాత్రం ఇది వర్తించదు. పల్లె ప్రాంతాల్లో కన్నా నగరా ల్లోనే మనం పావురాను ఎక్కువగా చూస్తాం. సిటీస్‌లో వాటికి నీరు, ఆహారం అందుబాటులో ఉంటాయి. వాటిని చంపితినే జంతువులు దాదాపు ఉండవు. ఉన్నా చాలా తక్కువ. వీటికి తోడు ఎత్తయిన బిల్డింగులు, కిటికీలు, పైకప్పులు, వంతెనలు, ఫ్లైఓవర్లు, గోదాములు..ఇలా ఒకటేంటి, అవి నివసించడానికి ఎన్నో అనువైన ప్రదేశాలున్నాయి. అయితే, మెట్రో సిటీస్‌లో వీటి సంఖ్య పెరగటం మనుషులకు ప్రమాదంగా పరిణమిస్తోంది. పావురాల వల్ల కలిగే ఆరోగ్య ప్రమాదాలను పరిగణనలోకి తీసుకున్న పుణె మున్సిపల్ కార్పొరేషన్, వాటిని పోషించే వారిపై చర్యలు ప్రారంభించింది. పావురాల రెట్టలు, ఈకలు శ్వాసకోశ ఇన్ఫెక్షన్లకు కారణమవుతాయి. వీటితోపాటు చర్మ సమస్యలు, అలర్జీలు, సైనసైటిస్ ప్రమాదం పెరుగుతుంది. కానీ, ఏదైనా ఒక జీవి జనాభా విపరీతంగా పెరిగితే అది పర్యావరణంపైనా ప్రభావం చూపుతుంది. పావురాల సంఖ్య పెరగడం పర్యావరణంలో అసమ తుల్యతకు సంకేతం. పావురాలు స్థానిక జాతులే. ఇళ్లలో పెంచుకోవడానికి పావురాలను మనుషులు అడవుల నుంచి గ్రామాలు, పట్టణాలకు తీసుకొచ్చారు. అంతకు ముందు అవి కొండా కోనల్లో తిరుగుతూ, పెద్ద పెద్ద బండరాళ్ల మధ్య గూళ్లు పెట్టుకుని జీవించేవి. చిన్న చిన్న పురుగులు, పండ్లు తిని బతికేవి. వీటి రెట్టల ద్వారా పండ్ల విత్తనాలు అడవి అంతటా వ్యాపించేవి. కానీ, ఇప్పుడు పక్షులకు అడవులలో తిండి సరిగా దొరకడం లేదు. పావురాలను డేగలు, గద్దలు వేటాడి చంపి తింటుంటాయి. తోడేళ్లు, నక్కలకు కూడా ఇవి చాలా ఇష్టమైన ఆహారం. తరచూ మనుషులు కూడా వీటిని వేటాడుతుంటారు. ఇంతకు ముందు ఈ పక్షులు అడవుల్లో



చాలా ఎక్కువగా ఉండేవి. ఇప్పుడు చాలా తగ్గాయి. నగరాల్లో వీటికి శత్రువులు పెద్దగా లేకపోవడం, రక్షణ ఎక్కువగా ఉండటం వాటి సంఖ్య పెరగడానికి కారణమైంది. పైగా ప్రజలు వాటికి తిండిగింజలు వేస్తూ వేటాడే శ్రమను తగ్గిస్తున్నారు. దీంతో సహజంగానే సంతానోత్పత్తి సులభమవుతోంది. పౌల్ట్రీలలో కోళ్లు పెరిగినట్లే, ఇక్కడ పావురాలు కూడా పెరుగుతున్నాయి. నగరాలు పెద్ద పౌల్ట్రీఫ్రామ్‌గా మారాయి. పావురాల సంఖ్య పెరిగేకొద్దీ ప్రకృతిలోని ఇతర జీవులపై దాని ప్రభావం పడుతుంది. ఇవి తమకంటే చిన్నసైజులో ఉండే పిచ్చుకల్లాంటి వాటిని వేధిస్తుంటాయి. అవి కట్టుకున్న గూళ్లను ఆక్రమిస్తుంటాయి. వాటి ఆహారాన్ని తినేస్తాయి. దీనివల్ల ఆహారపు కొరతతో చిన్నపక్షులు నశిస్తుంటాయి. ఒక్క పావురానిదే కాదు, ఏ పక్షి మల మూత్రాలైనా మన చుట్టూ ఎక్కువగా ఉంటే, అవి మనిషి ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. ఇక, పర్యావరణంలో పావురాలు కూడా కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, అవి పెద్ద సంఖ్యలో పెరగడం వల్ల ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. ఏ ప్రదేశంలో ఎన్ని పక్షులు నివసించాలి అన్నదానిపై ఒక నిర్దిష్ట పరిమితి ఉంది. ఒక రకం జీవరాశి అధికంగా పెరిగితే, దానివల్ల ఇతర జీవులకు లభించే ఆహారం, నివాసం, ఎగిరే స్థలం తగ్గుతాయి. అది వాటి జనాభా మీద ప్రభావం చూపిస్తుంది. పావురాలు అన్ని పరిస్థితులను తట్టుకుంటాయి. కొన్ని ఇతర పక్షుల మాదిరిగా కాకుండా, ఏ సమయంలోనైనా గుడ్లు పెట్టి సంతానోత్పత్తి చేయగలవు. నివాసానికి అనుకూల స్థలం, పుష్కలంగా ఆహారం, వేటాడే జంతువులు లేకపోవడంలాంటివి పావురాలు విపరీతంగా పెరగడానికి కారణమవుతున్నాయి. ఇప్పుడు నగరాలలో చాలా ప్రాంతాలను పావురాలు ఆక్రమించినట్లు కనిపిస్తుంది. వీటి కారణంగానే కాకులు, పిచ్చుకల్లాంటి కొన్ని పక్షులు కనిపించకుండా పోతున్నాయి. అయితే పావురాల సంఖ్య పెరగడం వల్లే ఇతర పక్షుల తగ్గిపోతున్నాయని చెప్పడం పూర్తిగా నిజంకాకపోవచ్చు. పట్టణీకరణతోపాటు, మరికొన్ని ఇతర కారణాల వల్ల కూడా ఇలాంటి పక్షులు కనుమరుగవుతున్నాయి. ఈ రెండింటిలో ఏది ఎంత వరకు కారణమన్నదాన్ని పరిశోధించాల్సి ఉంది.

## స్వీట్ షాపులోకి దూసుకెళ్లిన డీసీఎం వ్యాన్

### ముగ్గురు మృతి

**నల్లగొండ, డిసెంబర్ 21 (వెలుతురు):**
నల్లగొండ జిల్లా దేవరకొండలో రోడ్డు ప్రమాదం జరిగింది. శనివారం తెల్లవారుజామున దేవరకొండ శివార్లలోని పెద్ద దర్గా వద్ద వేగంగా దూసుకొచ్చిన డీసీఎం అదుపుతప్పి స్వీట్ షాప్‌లోకి దూసుకెళ్లింది. దీంతో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను దేవరకొండ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతులను అబ్దుల్ ఖాదర్, హాజీ, నబీనగా గుర్తించారు. అతివేగం, డ్రైవర్ నిద్రమత్తే ప్రమాదానికి కారణంగా తెలుస్తున్నది. కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సత్యసాయి జిల్లాలో.. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సత్యసాయి జిల్లాలో శనివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే నలుగురు ప్రాణాలు కోల్పోగా, మరో పది మంది తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. గుడిబండ, అమరాపురం మండలాలకు చెందిన 14 మంది మినీ వ్యాన్‌లో ఇటీవలే తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లారు. మళ్లీ తమ స్వగ్రామాలకు తిరిగి వస్తున్న క్రమంలో శనివారం తెల్లవారుజామున.. మడకశిర మండలం బుళ్లసముద్రం వద్ద ఆగి ఉన్న లారీని వారి వాహనం ఢీకొట్టింది. దీంతో మినీ వ్యాన్‌లో ప్రయాణిస్తున్న 14 మందిలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. క్షతగాత్రులను బెంగళూరులోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. మృతుల నివాసాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. క్షతగాత్రుల కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. క్షతగాత్రుల్లో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

## ప్రభుత్వ కార్యక్రమాలకు ఎమ్మెల్సీలను ఆహ్వానించాల్సిందే

### - మండల చైర్మన్


**హైదరాబాద్,డిసెంబర్ 21 (వెలుతురు):**



భూభారతి బిల్లుపై స్వల్పకాలిక చర్చ జరుగుతున్నది. ఈ సందర్భంగా భూభారతి చట్టం అమల్లోకి రాకముందే పేపర్లలో ప్రకటనలు వచ్చాయని విపక్ష సభ్యులు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి దృష్టి తీసుకొచ్చారు. అదేవిధంగా ప్రొటోకాల్ ఉల్లంఘనలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఇలాంటి తప్పులు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి చైర్మన్ సూచించారు. అదేవిధంగా ప్రొటోకాల్ అమలులో అలసత్వం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ఎమ్మెల్సీలను ఆహ్వానించాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రొటోకాల్‌పై ఖచ్చితమైన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. కాగా, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ 2024 బిల్లును, తెలంగాణ పంచాయతీరాజ్ బిల్లును మండలిలో ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ప్రస్తుతం రైతు భరోసాపై స్వల్పకాలిక చర్చ కొనసాగుతున్నది.

## పొత్తులు దిశగా వైసీపీ అడుగులు

**విజయవాడ, డిసెంబర్ 21 (వెలుతురు):**
వచ్చే ఎన్నికల్లో వైసిపి పొత్తులు పెట్టుకోవాల్సిన అనివార్య పరిస్థితి. గతం మాదిరిగా ఒంటరి ప్రయాణం అంటే కుదిరే పని కాదు. అధికార పక్షం మూడు పార్టీలతో పటిష్టంగా ఉంది. వారి మధ్య ఇప్పట్లో విభేదాలు వచ్చే అవకాశం కూడా కనిపించడం లేదు. వచ్చే ఎన్నికల్లో ఆ మూడు పార్టీలు కచ్చితంగా కలిసి వెళ్తాయి. వైసిపి ఒంటరి ప్రయాణం చేస్తే.. గతం మాదిరిగా కాంగ్రెస్, వామపక్షాలు కలుస్తాయి. అయితే ఓట్లు వాటికి రాకున్నా.. జగన్ ను ఎంత నష్టం చేయాలో అంతలా చేస్తాయి. ఆపై అధికారపక్షం దూకుడుగా ఉంటుంది. కేంద్రం సహకారం సంపూర్ణంగా ఉంటుంది. అందుకే ఏదో ఒక పార్టీ దన్ను వైసిపికి అవసరం. అందుకు పొత్తులు కూడా కీలకం. మాటకు మాట తోడవుతుంది. అధికార పక్షానికి నిలదీసే గొంతు బలపడుతుంది. అందుకే జగన్ పొత్తులపై సీరియస్ గా ఆలోచిస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ తో పాటు వామపక్షాలతో కలిసి వెళ్తే ఓటు శాతం పెంచుకోవచ్చని భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై కొద్ది రోజుల్లో క్లారిటీ వస్తుంది. తాజాగా వచ్చే ఎన్నికల్లో పొత్తులపై కీలక వ్యాఖ్యలు చేశారు వైసీపీ నేత విజయసాయిరెడ్డి. పార్టీలో పొత్తుల గురించి అధినేత జగన్ నిర్ణయం తీసుకుంటారని తాజాగా వ్యాఖ్యానించారు సాయి రెడ్డి. దీంతో పొత్తుల ఆలోచనతో వైసిపి ఉన్నట్లు అర్థమవుతోంది.ఇప్పటివరకు సెంటిమెంటుతో పాటు ప్రత్యేక రాజకీయ పరిస్థితులు వైసీపీకి కలిసి వచ్చాయి.ఒక విధంగా చెప్పాలంటే అది జైత్రయాత్రే. 2011లో ఆవిర్భవించింది వైసిపి. అప్పట్లో వైయస్సార్ మరణం విపరీతమైన సానుభూతి ఇచ్చింది. 2012లో జరిగిన 30 ఎన్నికల్లో అయితే జగన్ జైలుకు వెళ్లిన సానుభూతి బలంగా వర్కౌట్ అయ్యింది. 2014 ఎన్నికల్లో ఒక ఊపు వచ్చింది. వైసిపి అధికారంలోకి రాబోతుందన్న చర్చ నడిచింది. 67 స్థానాలతో గౌరవప్రదమైన స్థానాలను సైతం పొందింది వైసిపి. 2019లో అయితే జగన్ కు ఒకసారి ఛాన్స్ ఇద్దామని ప్రజలు స్ట్రాంగ్ గా ఫిక్స్ అయ్యారు. జగన్ ను సీఎం చేయాలని వైసీపీ శ్రేణులు సైతం కసితో పని చేశాయి. అయితే అదే



ధోరణితో, అదే ధీమాతో ఒంటరి పోరాటం చేశారు జగన్ ఈ ఎన్నికల్లో. దారుణంగా దెబ్బతిన్నారు. కానీ ఈసారి పొత్తు లేకుండా ముందడుగు వేయడం ప్రమాదకరమే.దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికల సరళి పరిశీలిస్తే పొత్తులే అధికం. పొత్తు లేకుండా ముందుకు సాగితే ఆ పార్టీలకు ప్రమాదకరమే. ముఖ్యంగా ప్రతిపక్షంలో ఉండే పార్టీలు తప్పనిసరిగా ఇతర పార్టీలను కలుపుకెళ్లాలి. లేకుంటే మాత్రం ఓటు చీలి అధికారపక్షానికి భారీ లబ్ది చేకూరుతుంది. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏపీలో కాంగ్రెస్ తో పాటు వామపక్షాలు కనిపిస్తున్నాయి. వామపక్షాలు బలహీనపడినా.. ప్రజా సంఘాలు, ప్రజా పోరాటాల్లో కీలక భూమిక పోషిస్తున్నాయి. అలా వామపక్షాలను కలుపుకెళ్తే ప్రభుత్వ వ్యతిరేకతను పెంచవచ్చు. ఇక కాంగ్రెస్ ను కలుపుకొని వెళ్తే.. ఆ పార్టీకి ఉన్న ఓటు బ్యాంకు మొత్తం టర్న్ అయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే వైసీపీలో ఉన్నది కూడా కాంగ్రెస్ క్యాడర్ అన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. అయితే గతం మాదిరిగా సింహం సింగిల్ గా వస్తుంది. అన్న నినాదాన్ని విడిచిపెడితేనే వైసీపీకి భవిష్యత్తు. లేకుంటే ఒంటరి పోరాటం అంటే మూల్యం తప్పదని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. మరి జగన్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

## టవర్ ఎక్కిన హెూంగార్డు

◆ ఎన్నికల హామీని నెరవేర్చాలంటూ డిమాండ్



**హైదరాబాద్, డిసెంబర్ 21 (వెలుతురు):**
ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్ రెడ్డి తమకు ఉద్యోగాలివ్వాలని ఓ మాజీ హెూంగార్డు ఆందోళనకు దిగారు. స్పష్టమైన హామీ ఇచ్చేవరకు దిగేది లేదంటూ హైదరాబాద్‌లోని ఎల్బీస్టేడియం వద్ద టవర్‌పైకి ఎక్కి భీష్మించుకు కూర్చున్నారు. రోడ్డుమీద పడ్డ తమ జీవితాలను ఆదుకోవాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో హెూంగార్డుగా విధులు నిర్వహించిన వీరాంజనేయులు.. టవరెక్కి ఆందోళనకు దిగారు. తాను ఉమ్మడి రాష్ట్రంలో విధులు నిర్వహించానని చెప్పారు. 250 మంది హెూంగార్డులను సమైక్య పాలకులు అన్యాయంగా తొలగించారని తెలిపారు. పదేండ్లపాటు విధులు నిర్వహించామని వెల్లడించారు. అప్పట్లో అన్ని డిపార్ట్‌మెంట్లలో విధులు నిర్వహించామని, తమకు గుర్తింపుగా సర్టిఫికెట్లు, బ్యాంక్ అకౌంట్లు, హెల్త్ కార్డులు ఉన్నాయని పేర్కొన్నారు. అప్పట్లో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నామని తమపై కక్షగట్టిన ప్రభుత్వం విధుల నుంచి తొలగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే అధికారంలోకి రాగానే తమను విధుల్లోకి తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని చెప్పారు. ఏడాది గడుస్తున్నా తమను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. తమ గురించి అసెంబ్లీలో చర్చించాలని, తొలగించిన 250మంది హెూంగార్డులను విధుల్లోకి తీసుకొని తమను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## ఏడో రోజు ప్రారంభమైన శాసన సభ సమావేశాలు

### - రైతు భరోసాపై చర్చ



**హైదరాబాద్, డిసెంబర్ 21 (వెలుతురు):**
ఏడో రోజు శాసనసభ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 10 గంటలకు శాసనసభ ప్రారంభం కాగా, స్పీకర్ అనుమతితో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు రైతు భరోసాపై స్వల్పకాలిక చర్చ ప్రారంభించారు. రైతు భరోసా విధివిధానాలపై సూచనలు ఇవ్వాలని మంత్రి తుమ్మల సభ్యులను కోరారు. సంక్రాంతి పండుగ నాటికి రైతు భరోసాపై విధివిధానాలను ఖరారు చేసి, ఆ తర్వాత రైతు భరోసా చెల్లింపులు చేస్తామని మంత్రి ప్రకటించారు. శాసనమండలి ముందుకు నాలుగు సవరణ బిల్లులు వచ్చాయి. జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీల సవరణ బిల్లులు, పంచాయతీ రాజ్ సవరణ బిల్లు, భూ భారతి సవరణ బిల్లులు వచ్చాయి. ఇక హైదరాబాద్ అభివృద్ధిలో ప్రభుత్వ వైఫల్యంపై బీఆర్ఎస్ వాయిదా తీర్మానం ఇచ్చింది. హైదరాబాద్‌లో ఏడాదిలో మౌలిక వసతుల కల్పనపై చర్చించాలని తీర్మానం ఇచ్చింది. మహాలక్ష్మీ పథకంపై చర్చించాలని బీజేపీ వాయిదా తీర్మానం ఇచ్చింది.

# హైదరాబాద్ రెండో రాజధాని దిశగా అడుగులు పడుతున్నయా?

**హైదరాబాద్ డిసెంబర్ 21 (వెలుతురు):**
ఈమధ్య సుప్రీంకోర్టు ఢిల్లీ నగరాన్ని ఏం చేయబోతున్నారని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కూడా ఢిల్లీలో కాలుష్యం తీవ్రంగా ఉందని,. తాను ఎప్పుడు ఢిల్లీకి వచ్చినా అనారోగ్యం పాలవుతున్నానని ఇటీవల చెప్పుకొచ్చారు. ఇలాంటి పరిణామాల మధ్య ఢిల్లీని దేశ రాజధానిగా ఇంకా కొనసాగించాలా అని సాక్షాత్తు సీనియర్ కాంగ్రెస్ నేత శశి థరూర్ ఈ మధ్య కాలంలో చేసిన వ్యాఖ్యలు ఆలోచింపదగినవి. థరూర్ వ్యాఖ్యలు దేశ రాజధానిపై మరోసారి దేశవ్యాప్త చర్చకు దారితీశాయి.. దక్షిణాదిన రెండో రాజధాని ఉండాలన్న ప్రస్తావన చాలా దశాబ్దాలుగా వస్తున్నదే. దేశానికి రెండో రాజధానిగా హైదరాబాద్ ఉండాలన్న చర్చ స్వాతంత్యం వచ్చిన తొలినాళ్లలోనే వచ్చింది. ఈ ప్రతిపాదనను రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తన 'థాట్స్ ఆఫ్ లింగ్విస్టిక్ స్టేట్స్' అనే పుస్తకం 11వ అధ్యాయంలో హైదరాబాద్‌ను రెండో రాజధానిగా చేయాలని స్వయంగా ప్రతిపా దించారు. దీనికి అనుకూలంగా కొన్ని బలమైన కారణాలను కూడా చూపారు. మన శత్రు దేశాలైన పాకిస్తాన్, చైనా దేశ సరిహద్దుకు ఢిల్లీ కేవలం 300 కిలోమీటర్ల దూరంలో ఉందని. కానీ, హైదరా బాద్ సుదూరంగా ఉండటం దేశ భద్రతాపరంగా, అన్ని వాతావరణ పరిస్థితులకు అనువైన ప్రాంతమని గట్టిగా వాదించారు. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరంగా ఢిల్లీ మారింది. గతంలో హైదరాబాద్‌లో ఎత్తైన అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు హాజరైన అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్ హైదరాబాద్‌ను రెండో రాజధానిగా అంబేద్కర్ గుర్తు చేసినప్పుడు కూడా ఈ చర్చ జరిగింది. మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు ఎప్పటికైనా హైదరాబాద్ దేశానికి రెండో రాజధానిగా అవుతుందన్న నమ్మకం ఉందన్నారు. ఇదిలావుంటే, గత ఏడాది రేవంత్ రెడ్డి సీఎంగా ప్రమాణం చేసిన తర్వాత నుంచి ముఖ్యమంత్రి హోదాలో తీసుకుంటున్న చర్యలన్ని భవిష్యత్తు దృష్ట్యా హైదరాబాద్‌ను మహా విశ్వనగరంగా మార్చే ప్రయత్నంలో తీసుకుంటున్నవే. ఢిల్లీ తరహా పరిస్థితులు తలెత్తకుండా హైదరాబాద్ రెండో రాజధాని ఖచ్చితంగా కావొచ్చనే ముందుచూపుతోనే హైడ్రాలాంటి కఠిన చర్యలు తీసుకుంటున్నారని రాజకీయ విమర్శకులు ప్రశంసిస్తున్నారు. అలాగే, కాలుష్యరహిత నగరంగా మార్చేందుకు డీజిల్/ పెట్రోల్ వాహనాలను తరలించి పొల్యూషన్ రహిత ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడం వెనక కారణం కూడా ఇదేనని కొందరి వాదన.



అలాగే, ప్రపంచవ్యాప్తంగా 140 దేశాల్లోని 258 ప్రపంచ నదులలో అత్యంత కాలుష్యంగా మూసీ నది 22వ స్థానంలో ఉన్నట్లు ది ప్రొసీడింగ్స్ ఆఫ్ నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ జర్నల్ లో ప్రచురితమైంది. కనీసం 70 కిలోమీ టర్ల మేర 48 రకాల క్యాన్సర్ కారకాలైన రసాయన అవశేషాలు లభించాయి. ఈ కలుషితమైన నీరు ప్రజల ఆరోగ్యానికి భారీగా హాని చేస్తోందనీ పరిశోధనలు తేల్చాయి. ప్రతిపక్షాల నుంచి ప్రభుత్వం ఎన్ని విమర్శలు ఎదుర్కొన్నా మూసీ పునరుజ్జీవానికి కట్టుబడి ఉంటామని ప్రకటించ డం, అలాగే ఉన్న నగరంపై మరింత జనసాంద్రత పెరగకుండా ఫోర్త్ సిటీ ఆలోచన కూడా వెనుక కూడా రెండో రాజధాని వ్యూహమే ఉన్నట్లు అనుకోవచ్చేమో! అలాగే, 2019 మల్కాజిగిరి పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో రెండో రాజధాని ఆలోచనకు మద్దతు ఇచ్చారు. ఇక రెండో రాజధాని ఆలోచన బీజేపీకి ఖచ్చితంగా ఉందని ఆ నాయకుల వ్యవహార శైలి, మాటలు తదితర పరిణామాలతో వెల్లడవుతూ వస్తోంది. రీజనల్ రింగ్ రోడ్డు అనుమతి, విస్తరణ వెనుక బీజేపీ ఆలోచన లేకపోలేదనే అభిప్రాయం విశ్లేషకుల్లో ఉంది. తెలంగాణలో అధికారంలోకి రావాలని భావిస్తున్న బీజేపీ ఇక్కడ తన బలాన్ని పెంచుకునేందుకు అన్ని అస్త్రశస్త్రాలు ప్రయో గించడానికి పావులు కదుపుతోంది. రెండో రాజధాని పేరుతో హైదరాబాద్ ను కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చితే తెలంగాణ మరోసారి భగ్గుమనే అవకాశం ఉంది. తెలంగాణకు గుండెకాయలాంటి హైదరాబాద్‌ను పూర్తిగా వేరు చేస్తే మాత్రం సమస్యే. హైదరాబాద్ లా అండ్ ఆర్డర్ లాంటి ఒకటి అరా వ్యవస్థలు కేంద్రం చేతిలో ఉంచుకొని, మిగతా పరిపాలన అంతా తెలంగాణ రాష్ట్ర పరిధిలో ఉంచితే సానుకూలత రావచ్చు. హైదరాబాద్ తెలంగాణకు దూరం కాకుండా చేయగలిగితేనే.. రెండో రాజధానికి ప్రజల నుంచి, పార్టీల నుంచి అభ్యంతరాలు రాకపోవచ్చు! ఇక, దేశానికి హైదరాబాద్ రెండో రాజధాని ప్రతిపాదన అంత ఆషామాషీ విషయం కాదు. తెలంగాణ రాష్ట్ర ఆదాయం 50శాతం పైగా కేవలం హైదరాబాద్ నుంచే ఉంది కాబట్టి ఆ ఆదా యం నిస్సంకోచంగా తెలంగాణ కే చెందేలా ఏర్పడాలి. ఇటు తెలంగాణకు రాజధానిగా ఉంటూనే, అటు దేశానికి రెండో రాజధానిగా ఉంటే మంచిదే. రెండో రాజధానితో హైదరాబాద్ నగరమే కా కుండా నగరం చుట్టూ నలువైపులా ఉన్న అనేక ప్రాంతాలు భారీ ఎత్తున లబ్ది పొందే అవకాశాలు ఎక్కువ. అంతేకాదు, రెండో రాజధాని అందుబాటులో ఉండడం తెలంగాణ ప్రజల అభివృద్ధికి మంచి మార్గం కాగలుగుతుంది. ఒకవేళ రెండో రాజధానిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటే మాత్రం.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, ఆశయాలను ఏ మాత్రం విస్మరించకూడదు. రెండో రాజధాని విషయంలో అదే కీలకాంశం అవుతోంది. ప్రత్యేక తెలంగాణ కోసం ఉద్యమిస్తున్న సమయంలో హైదరాబాద్ ను దేశానికి రెండో రాజధాని చేయాలనే ప్రతిపాదన శ్రీకృష్ణ కమిషన్ ముందుకు వచ్చింది. కానీ, అది పూర్తిగా తిరస్కరించినట్లు నాటి తెలంగాణ జేఏసీ చైర్మన్, ప్రొ. కోదండరాం చెప్పారు. హైదరాబాద్ ని దేశానికి రెండో రాజధా నిగా చేయాలనే ప్రతిపాదనను తాము స్వాగతిస్తామని ఆనాడు ముఖ్యమంత్రి హోదాలో 2018లో ఇండియా టుడే సదస్సులో కేసీఆర్ స్పష్టంగా చెప్పారు. కానీ, నేడు అదే పార్టీ హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా చేయాలని బీజేపీ కుట్రలు చేస్తోందని. దాన్ని అడ్డుకునే ధైర్యం కాంగ్రెస్‌కు లేదని 2024 ఏప్రిల్ 29న కరీంనగర్‌లో జరిగిన పార్లమెంటు ఎన్నికల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ద్వంద్వ వైఖరితో విరుచుకుపడిన విషయం తెలిసిందే. అధికారంలో ఉన్నప్పుడు ఒక రీతిగా, ప్రతిపక్ష స్థానంలో మరొక రీతిగా వ్యవహరించడం రాజకీయ అవకాశవాదానికి పరాకాష్టగా చెప్పుకోవచ్చు. ఇలాంటి అవకాశవాద రాజకీయాలు క్షేమకరం కాదని వారు గుర్తుంచుకోవాలి.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com